అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 25-2-2023
సంపుటి : 9 సంచిక : 7 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

బలవంతపు భూసేకరణ ఆపాలి

జమ్మూ కాశ్మీర్‌లో ప్రభుత్వ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలి



- జంతర్ మంతర్ లో ఏఐకేఎస్ ధర్నా
- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి సంఘీభావం


న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లో బలవంతపు భూసేకరణ ఆపాలని, అక్టోబరు-2020 ...5లో

ఖర్గే చేతికి సర్వాధికారాలు



- సీడబ్ల్యూసీ సభ్యులను నామినెట్ చేసే అధికారం చీఫ్‌కే...:కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం

5లో..



ఉక్రెయిన్ తీర్మానానికి భారత్ దూరం

అనుకూలం 141..వ్యతిరేకం 7

- ఏడాది గడిచినా.. ఆగని సంక్షోభం

9లో..



ఎంసెట్‌లో వెయిటేజీ లేదు

- 28న నోటిఫికేషన్ జారీ
- ఇంటర్‌లో 45 శాతం మార్కులొస్తేనే అర్హులు

3లో..

పేదల డబ్బులు...



పెద్దల సామ్రాజ్యాలు

అదానీ, అంబానీ, టాటాల సేవలో కేంద్రం

- భారీ ప్రాజెక్టులు..లక్షల కోట్ల సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు
- ఇవన్నీ ఊరికే కాదు.. దీని వెనుక రాజకీయ లబ్ధి ఉంది : రాజకీయ విశ్లేషకులు
- వాట్సాప్‌ను వాడుకోవాలనే రిలయన్స్ జియోకు ప్రోత్సాహం
- వేదాంత గ్రూప్‌నకు రూ.1.6లక్షల కోట్లు సబ్సిడీలు


(ఫైల్)

న్యూఢిల్లీ : బడా కార్పొరేట్ కంపెనీలపై మోడీ సర్కార్ మోజు రోజు రోజుకీ పెరుగుతోంది. ఎన్నో కుంభకోణాలు, బ్యాంక్ దివాలా..ఉన్నా వాటిని కేంద్రం అక్కున చేర్చుకుంటోంది. పరస్పర ప్రయోజనాలు ఉన్నందునే బడా కార్పొరేట్లకు పెద్ద ఎత్తున సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు దక్కుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దక్షిణ కొరియాకు చెందిన సాంసంగ్, హ్యుందాయ్, ఎల్జీ..ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు అందుకున్న సంస్థలు. దక్షిణ కొరియా రాజకీయాల్ని ప్రభావితం చేస్తున్నాయన్న ఆరోపణలు ఈ సంస్థలపై ఉన్నాయి. ఇలాంటి వ్యాపార సామ్రాజ్యాల్ని మన దేశంలోనూ తీసుకురావాలని మోడీ సర్కార్ ఉవ్విళ్లూరుతోంది. అంబానీ, అదానీ గ్రూప్, టాటా, వేదాంత గ్రూప్‌లతో కేంద్రం కలిసి పనిచేస్తోంది. ప్రజలు ఇచ్చిన పన్నుల ఆదాయంతో ఈ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు విలువజేసే సబ్సిడీలు దక్కుతున్నాయి. ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా మోడీ ప్రభుత్వం ఈ వ్యాపార సామ్రాజ్యాలకు 'నేషనల్ ఛాంపియన్స్' అనే ముద్దు పేరును తగిలిస్తోంది.

ఆధారపడ్డామా..ఇక అంతే

కుటుంబ వ్యాపార సంస్థలు, బడా కార్పొరేట్ కంపెనీలతో పాలకులకు రాజకీయంగా అనేక ప్రయోజనాలున్నాయి. మలేషియా, థాయిలాండ్, దక్షిణ కొరియా..తదితర దేశాల్లో ఈ తరహా ఆర్థిక విధానం ఇప్పటికే ఉంది. దీనిని ప్రధాని మోడీ భారత్‌లోనూ తీసుకురావాలని బలంగా కోరుకుంటున్నారు.

అందువల్లే బడా కార్పొరేట్ కంపెనీలకు పన్ను ప్రయోజనాలు కల్పిస్తున్నారు. బ్యాంకుల ద్వారా అత్యంత తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పిస్తున్నారు. పెద్దమొత్తంలో పెట్టుబడి రుణాలు అందుబాటులో ఉంచుతున్నారు. ఒకవేళ బడా సంస్థలన్నీ దివాలా తీస్తే..దాని ఫలితం దేశ ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆగ్నేయాసియా దేశాల్లో 1997-98 ఆర్థిక సంక్షోభం ఒక ఉదాహరణ. వ్యాపార సామ్రాజ్యాలు కుప్పకూలటంతో ఆగ్నేయాసియా దేశాల కరెన్సీ విలువ అమాంతం పడిపోయింది. దక్షిణ కొరియా, మలేసియా, థాయిలాండ్ కరెన్సీ విలువలు ...2లో

రాజకీయ లబ్ధి ఉంటేనే..

దేశంలో ప్రయివేటు పెట్టుబడి వ్యయం పెరిగితేనే ఉపాధి మెరుగుపడుతుందని మొన్నటి వరకూ మోడీ సర్కార్ భావిస్తూ వచ్చింది. పలు ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రయివేటీకరిస్తూ తన చర్యల్ని సమర్థించుకుంది. ఇందులో రాజకీయ లబ్ధిని చూసుకుంటూ మోడీ సర్కార్ ముందుకెళ్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ 'రిలయన్స్ జియో'. బీఎస్ఎన్ఎల్‌కు 4జీ స్పెక్ట్రమ్ ఇవ్వకుండా, టెలికాంకు సంబంధించి ఎన్నో నిబంధనల్ని పక్కన పడేసి, అనేక మినహాయింపులు 'జియో'కు దక్కాయి. స్వల్ప వ్యవధిలో ...2లో


(ఫైల్)

బ్రెయిన్ లేదంటూ వేధింపుల వల్లే...

ప్రీతిపై ర్యాగింగ్ కేసులో సీనియర్ మెడికో సైఫ్ అరెస్ట్

- సైఫ్‌కు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదన్న పోలీసులు
- రాజకీయ దుష్ప్రచారం చేయొద్దు : వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ)లో పీజీ మొదటి సంవత్సరం అనస్తీషియా విద్యార్థిని డాక్టర్ దరావత్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సీనియర్ వైద్యవిద్యార్థి సైఫ్ వేధింపులే కారణమని ప్రాథమికంగా భావించి సైఫ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు వివరాలు వెల్లడించారు. ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించినట్టు వాట్సాప్ చాటింగ్ ద్వారా తేలిందన్నారు. సీనియర్లు, జూనియర్లు మొత్తం 31మంది వాట్సాప్ గ్రూపులో ఉన్నారన్నారు. తనను ...3లో

ఇంకా విషమంగానే ప్రీతి ఆరోగ్యం

నిందితులు ఎంతటి వారైనా వదలం : మంత్రి రాథోడ్ 10లో..

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కేఎంసీ గేటు ఎదుట ధర్నా



వివరాలు 3లో



సీపీఎస్ రద్దు చేయాలి

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- నూతన విద్యా విధానం రద్దు చేయాలి
- విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు పొడిగించాలి
- కాంట్రాక్టు టీచర్లు, ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- కదంతొక్కిన ఉపాధ్యాయులు
- ఎస్టీఎఫ్ఐ పార్లమెంట్ మార్చ్



న్యూఢిల్లీ : కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్) రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) పునరుద్ధరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం జంతర్ మంతర్ లో ఈ ఐదు డిమాండ్ల సాధన కోసం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. ఎస్టీఎఫ్ఐ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు కదంతొక్కారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులు డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేబూని నినాదాల హోరెత్తించారు. మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలపై గర్జించారు. ఈ సందర్భంగా ఎస్టీఎఫ్ఐ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు .కే.సీ హరికృష్ణ, సిఎన్ భారతి మాట్లాడుతూ మోడీ సర్కార్ విద్యా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. విద్యను కార్పొరేటీకరణ, కాషాయికరణ చేసేందుకు ...9లో

తప్పులు మీవీ..భారం మావా..!

ట్రూఅప్ ప్రతిపాదనలు తిరస్కరించండి

- డిస్కంల నిర్వహణ అస్తవ్యస్తం : టీఎస్ఈఆర్సీ బహిరంగ విచారణలో వక్తలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వం, అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) నష్టాలు వస్తే, దానికి వినియోగదారులుగా తామెందుకు పెరిగిన చార్జీలు చెల్లించాలని పలువురు ప్రశ్నించారు. డిస్కంలకు అతిపెద్ద డిఫాల్టర్‌గా ప్రభుత్వ శాఖలే ఉన్నాయనీ, వాటిని ఎప్పటికప్పుడు వసూలు చేసుకుంటే నష్టాలు ఎందుకుంటాయని అడిగారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఎర్రగడ్డ జీటీఎస్ కాలనీలోని టీఎస్ జెన్‌కో ఆడిటోరియంలో బహిరంగ విచారణ నిర్వహించారు. 2023-24 వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనలు, 2016-17 నుంచి 2022-23 వరకు రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్ చార్జీలు, విద్యుత్ కొనుగోళ్లు, ట్రూ అప్ చార్జీలపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) టీఎస్ఈఆర్సీకి సమర్పించిన ప్రతిపాదనలపై ఈ బహిరంగ విచారణ జరిగింది. టీఎస్ఈఆర్సీ చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు అధ్యక్షతన కమిషన్ సభ్యులు (టెక్నికల్) ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య (ఫైనాన్స్) ఈ విచారణ నిర్వహించారు.

అసమర్థ నిర్వహణ

ఎమ్ వేణుగోపాలరావు, కన్వీనర్, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్

2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.10,535 కోట్లు ఆదాయ లోటు ఉంటుందని డిస్కంలు ఏఆర్ఆర్‌లో పేర్కొన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.6,079 కోట్ల మేరకు కరెంటు చార్జీలు పెంచారు. ట్రూ అప్ పేరుతో రూ.900 కోట్లు, రిటైల్ సప్లయ్ బిజినెస్ పేరుతో ...10లో


2లో..

కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

అందుకే విద్యుత్ సంస్థల ప్రయివేటీకరణ

- ఎన్ని కుట్రలు చేసినా కరెంటును నిరంతరంగా సరఫరా చేస్తాం
- ఊహించిన దానికంటే ఎక్కువగా విద్యుత్ డిమాండ్ : జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు

లైఫ్ సైన్సెస్‌లో హైదరాబాద్ టాప్

అంతర్జాతీయంగా తెలంగాణకు 4వ స్థానం

- 20వ బయో ఏషియా సదస్సును ప్రారంభించిన మంత్రి కేటీఆర్



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

లైఫ్ సైన్స్ రంగంలో హైదరాబాద్ ప్రపంచ హబ్‌గా అవతరించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో టాప్-10లో తెలంగాణ 4వ స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో మూడ్రోజులపాటు నిర్వహిస్తున్న బయో ఏషియా సదస్సును నిటిఅయోగ్ సభ్యులు వీకేపాల్‌తో కలిసి మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఇప్పటికే లైఫ్ సైన్సెస్, ఫార్మారంగ, పర్యావరణ వ్యవస్థలకు నిలయంగా ఉందన్నారు. ఇక్కడ ఎనిమిది వందలకు పైగా ఫార్మా బయోటెక్ ...9లో

టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 21 నామినేషన్లు

లోకల్ అథారిటీ ఇండిపెండెంట్ అభ్యర్థి రహీంఖాన్ నామినేషన్ తిరస్కరణ

- టీచర్ ఓటర్ల సంఖ్య 29,720 : ఎన్నికల సంఘం

వివరాలు 2లో..

ఢిల్లీ అల్లర్లలో కేంద్ర హోం శాఖ వైఫల్యమే

అదనపు బలగాల మోహరింపులో ఆలస్యం

- బీజేపీ ద్వేషపూరిత ప్రచారం.. మీడియా కల్పిత కథనాలు : నిజనిర్ధారణ కమిటీ వెల్లడి

వివరాలు 2లో..

మిర్చి రేటెక్కుతోంది..

ఖమ్మం ఏఎంసీలో పెరుగుతున్న ఎర్రబంగారం ధరలు

- ఒక్కరోజు వ్యవధిలోనే క్వింటాల్‌కు రూ.1700 పెంపు
- శుక్రవారం రూ.20,800 పలికిన క్వింటాల్‌కు మిర్చి
- 52,425 బస్తాలు రాక.. మరింత పెరిగే అవకాశం
- ఇష్టారాజ్యంగా దళారుల దోపిడీ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు పెరుగుతుండటంతో రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ఒక్కరోజు వ్యవధిలోనే క్వింటాకు రూ.1,700 చొప్పున ధర పెరిగింది. సరుకు కూడా భారీగా వస్తోంది. శుక్రవారం 52,425 బస్తాల మిర్చి మార్కెట్‌కు అమ్మకానికి వచ్చింది. బుధవారం క్వింటా మిర్చి గరిష్ట ధర రూ.19,100 పలుకగా శుక్రవారం నాటికి అది 20,800గా నమోదైంది. మిర్చి ధరలు మరింతగా పెరగవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఏసీ మిర్చి ధర రూ.22వేలకు పైగా పలికింది.

ఖమ్మం మార్కెట్ నుంచి విదేశాలకు...

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి విదేశాలకు మిర్చి తరలింపు ఊపందుకుంది. ఫలితంగానే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. ఖమ్మం మార్కెట్ యార్డు నుంచి రోడ్డుమార్గంలో చెన్నైకి చేరుకుని పోర్టు ద్వారా చైనాకు వెళ్తున్నాయి. ఎగుమతులు ఊపందుకోవడంతోనే మార్కెట్లో ధరలు పెరుగుతున్నాయి. విదేశాల నుంచి ఆర్డర్లు ఉండటంతోనే మిర్చి ధరలు పెంచుతున్నట్టు తెలుస్తోంది. రెండేండ్లుగా తెగుళ్ల బారిన పడి, ముఖ్యంగా తామరనల్లితో ...9లో



మూడు వేలు తగ్గిస్తుండ్రు



జెండా పాట చూస్తేనేమో రూ.20వేలకు పైగా పలుకుతోంది. కానీ ఎక్కువ సరుకు రూ.17,500లకే కొంటున్నారు. ఇదేమంటే ఆ సరుకు వైపు ఎవరూ చూడట్లేదు. ఒక్కళ్లొచ్చి చూసిపోతే ఇంకోళ్లు వచ్చి అంతకంటే తక్కువ ధరకు అడుగుతున్నారు. చైర్మెన్, మార్కెట్ అధికారులు వచ్చినప్పుడేమో కొంత ధర ఎక్కువ పెడుతున్నట్టు చేస్తున్నారు.

నాయక్, సంకీస, మహబూబాబాద్ జిల్లా

కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర : మంత్రి జగదీశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ఒకరిద్దరు పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకే ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ క్రమంలోనే విద్యుత్ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరించేందుకు ఆయన కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఎన్ని కుట్రలు చేసినా... రాష్ట్రంలో అలా జరగనివ్వమనీ, రైతులతోపాటు అన్ని రకాల వినియోగదారులకూ 24 గంటలపాటు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో సూర్యాపేట జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు, ఐఎన్‌టీయూసీతోపాటు ఆ పార్టీ మైనారిటీ విభాగం నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ జగదీశ్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర విద్యుత్ సంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటుపరం చేసేది లేదని నొక్కి చెప్పారు. ఇదే విషయాన్ని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మోటార్లకు మీటర్లు పెట్టేది లేదంటూ ముఖ్యమంత్రి స్పష్టం చేశారని వివరించారు. అయినా ఆ రంగానికి సంబంధించిన విషయాలపై కేంద్ర ప్రభుత్వంలోని కొంతమంది గల్లీ లీడర్లు అవగాహన లేమితో అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము ఊహించిన దానికంటే రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతూ వస్తోందని తెలిపారు. సాధారణంగా మార్చిలో వచ్చే పీక్ డిమాండ్ ఈసారి జనవరిలోనే వచ్చిందన్నారు. ఆ రకంగా గతంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ వినియోగం నమోదైందని వివరించారు. అయినప్పటికీ వినియోదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా నాణ్యమైన కరెంటును నిరంతరంగా సరఫరా చేస్తామని హామీనిచ్చారు. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు ఎక్కడ విద్యుత్ లభించినా.. అక్కడి నుంచి తీసుకోవాలంటూ సీఎం కేసీఆర్ ఆదేశించారని వెల్లడించారు. అందుకోసం ఎంత ఖర్చయినా వెనుకాడొద్దంటూ కేసీఆర్ సూచించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో 17 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చినా ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. గత నెల్లో ఎన్టీపీసీ, ఇతర రెండు విద్యుత్ ప్లాంట్లలో కొంత సమస్య రావటం వల్ల కరెంటు సరఫరాలో అంతరాయం కలిగిన మాట వాస్తవమేనని మంత్రి ఈ సందర్భంగా అంగీకరించారు. అది కూడా రెండు మూడ్రోజులేనని వివరించారు.

బీజేపీ, కాంగ్రెస్‌తో రాష్ట్రానికి నష్టం...

బీజేపీ, కాంగ్రెస్‌తో రాష్ట్రానికి తీరని నష్టమని మంత్రి ఈ సందర్భంగా విమర్శించారు. నాయకత్వ లేమితో కాంగ్రెస్ కొట్టుమిట్టాడుతోందని అన్నారు. ఆ పార్టీ గల్లీ నాయకత్వంతో క్యాడర్ విసిగిపోయారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఆ పార్టీని నడపలేరనే విషయం తేలిపోయిందన్నారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి దేశంలో ఒక్క కేసీఆర్‌కే ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తోనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు.

నేడు ముంబయికి ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం ముంబయికి బయల్దేరి వెళ్లనున్నారు. ప్రముఖ మీడియా సంస్థ అక్కడ నిర్వహించే 'ఐడియాస్ ఆఫ్ ఇండియా సమ్మిట్-2023'లో ఆమె పాల్గొంటారు. '2024 ఎన్నికలు-విపక్షాల వ్యూహం' అనే అంశంపై జరిగే చర్చా వేదికలో కవిత పాల్గొని తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు.

బీఆర్ఎస్ గూటికి విజయవాడ మాజీ మేయర్

విజయవాడ మాజీ మేయర్ తాడి శకుంతల బీఆర్ఎస్‌లో చేరారు. ఆ పార్టీ ఏపీ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ సమక్షంలో ఆమె శుక్రవారం గులాబీ కండువా కప్పుకున్నారు. భవిష్యత్తులో తమ పార్టీలోకి ఆంధ్రప్రదేశ్ నుంచి భారీ చేరికలుంటాయని చంద్రశేఖర్ ఈ సందర్భంగా తెలిపారు.

పేదల డబ్బులు...పెద్దల సామ్రాజ్యాలు

(మొదటిపేజీ తరువాయి)

40శాతం క్షీణించాయి. రిస్క్‌లో భారత ఆర్థిక వ్యవస్థ సంక్షోభ సమయంలో విదేశీ అప్పులు చెల్లించటం కోసం ద.కొరియాకు చెందిన ఎల్జీ, హ్యూందాయ్, సాంసంగ్ తమ ఆస్తుల్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్‌లో ఇలాంటి పరిస్థితి ఊహించగలమా? కార్పొరేట్ కంపెనీలు దివాలా తీస్తే ఇక్కడ దీని ప్రభావం ఆర్థిక వ్యవస్థపైన్నే ఉంటుంది. ఉదాహరణకు అదానీ గ్రూప్ మొత్తం అప్పుల్లో 30 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.2.5 లక్షల కోట్లు) విదేశాల నుంచి వచ్చిందే. వేదాంత గ్రూప్ కంపెనీకి కూడా భారీ ఎత్తున విదేశీ రుణాలున్నాయి. మోడీ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెమి-కండక్టర్ చిప్ ప్రాజెక్ట్ 'వేదాంత'కు దక్కింది. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 50శాతం సబ్సిడీ లభించింది. దీనివిలువ మన రూపాయల్లో రూ.1.6 లక్షల కోట్లు. ఒక కుటుంబం చేతిలో నడుస్తోన్న 'వేదాంత గ్రూప్'నకు ఇంత పెద్ద మొత్తంలో ప్రభుత్వ సబ్సిడీలు సమకూరటం గతంలో లేదు.

రాజకీయ లబ్ధి ఉంటేనే..

(మొదటిపేజీ తరువాయి)

20కోట్ల వినియోగదారులు జియోకు లభించారు. కొద్ది నెలల్లో అతిపెద్ద టెలికాం సేవల సంస్థగా 'జియో' ఆవిర్భవించింది. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా 'మోడీ సర్కార్' అనుకూల ప్రచారం అందేందుకు 'జియో' సేవలు దోహదపడ్డాయి. అప్పటికే ఉన్న వొడాఫోన్, ఎయిర్‌టెల్‌తో తమ వ్యూహం అమలు కాదనే 'జియో'ను కేంద్రం ఎంచుకుంది.

సమాన హక్కుల కోసం ఐక్య పోరాటాలు

- రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు సభలు
- రైతు, వ్యకాస, సీఐటీయూ, ఐద్వా పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాన హక్కుల కోసం ఐక్య పోరాటాలు నిర్వహించాలని రైతు, వ్యకాస, సీఐటీయూ, ఐద్వా పిలుపునిచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని కోరాయి.

శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వీ. రమ అధ్యక్షతన ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి తదితరులు సమావేశమయ్యారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, మహిళలపై జరుగుతున్న దాడుల అరికట్టాలనీ, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనీ, మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించాలనీ, గృహహింసను ఆపాలని డిమాండ్ చేస్తూ మార్చి 10 ,11 తేదీల్లో మండలాల్లో ప్రదర్శనలు సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మార్చి 14,15 తేదీల్లో జిల్లా కేంద్రాలు, రాష్ట్ర కేంద్రంలో ప్రదర్శనలు సభలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని మేధావులు ప్రజాసంఘాలు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు శిబిరాలు..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు వైద్య శిబిరాలలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 53, 85,071 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో నేటి వరకు 9, 93,461 మందికి కంటి అద్దాలు ఇచ్చినట్టు పేర్కొన్నారు. శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు: 1,98,006, రీడింగ్ గ్లాసెస్ పంపిణీ 25,507, ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ 19,132 కంటి సమస్యలు లేనివారు 1,53,365 మందిగా నిర్ధారించారని తెలిపారు.కంటివెలుగులో ఇప్పటివరకు.. మొత్తం కంటిపరీక్షలు 53,85,071 మంది కాగా, మొత్తం రీడింగ్ గ్లాసెస్ పంపిణీ 9,93,461,ప్రిస్కిప్షన్ గ్లాసెస్ కోసం రెఫర్ 6,93,644, కంటి సమస్యలు లేనివారు 36,97,858 మంది ఉన్నారని తెలిపారు.

తెరపైకి బఫర్ జోన్



రైతులకు తప్పని 'ఫార్మా' వేధింపులు

- మరోసారి భూ సేకరణ దిశగా సర్కారు
- స్థానికుల్లో భయాందోళన
- అక్కడి నుంచి గ్రామాలను తరలించే ప్రమాదం

ఫార్మాసిటీ భూ సేకరణతో రైతులకు వేధింపులు తప్పడం లేవు. రైతుల నుంచి తీసుకున్న భూములకు సరైన పరిహారం అందలేదు. దీనికితోడు బఫర్ జోన్ పేరుతో రైతుల నుంచి మళ్లీ భూ సేకరణ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా రెవెన్యూ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే భూములు కోల్పోయి రోడ్డున పడ్డ రైతులను బఫర్ జోన్ పేరుతో మరింత దుర్భార స్థితిలోకి నెట్టుతోంది. ప్రభుత్వం చర్యలతో తమ బతుకులు ఆగం అవుతున్నాయని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునరాలోచించాలని రైతులు కోరుతున్నారు. ఫార్మా భూతానికి బలవుతున్న రైతులపై కథనం.

నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా యాచారం, కందుకూరు మండలాల్లోని 8 గ్రామ పంచాయతీల పరిధిలో ఫార్మాసిటీకి సంబంధించి ప్రస్తుతం 19,333 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల నుంచి సేకరించింది. ఇందుకు పరిహారం కింద రైతులకు అసైన్డ్ భూములకు రూ.8 లక్షలు, పట్టా భూములకు రూ.16 లక్షలు కేటాయించారు. అయితే బహిరంగ మార్కెట్ ధరకు ప్రభుత్వం నుంచి రైతులకు ఇస్తున్న ధరకు పొంతన లేకపోవడతంతో రైతులు ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి తమ భూములు ఇవ్వమని కొంతకాలంగా పోరాటాలు చేస్తున్నారు. అయితే ఫార్మాలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు 120 గజాల చెప్పున ఇంటి జాగాలు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇదిలా ఉండగా ఫార్మాసిటీకి బఫర్ జోన్ పేరుతో మరోసారి రైతుల నుంచి 2వేల నుంచి 3వేల ఎకరాలకు పైగా భూ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. భూములు పోగా ఫార్మాసిటీకి దగ్గరలో ఉన్న గ్రామాలు కుర్మిద్ద, మేడిపల్లి, తాడిపర్తి, కొన్ని తాండాలు అక్కడి నుంచి తొలగించే ప్రమాదమూ ఉంది. ఇప్పటికే వ్యవసాయ భూములు కోల్పోయి ఉపాధి లేక బతుకుదెరువు కోసం వలసలు పోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఉన్న ఇంటి జాగా కాస్తా ప్రభుత్వం లాక్కొంటే బతికెదెట్లా అని స్థానికులు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం ఫార్మాసిటీకి కేటాయించిన భూమి సరిహద్దులో రెండు కిలో మీటర్ల మేరకు గ్రీనరీకి కేటాయించి పొల్యూషన్ బయటికి రాకుండా చూస్తామని ఆయా గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చింది. కానీ ఫార్మాసిటీ నుంచి వచ్చే పొల్యూషన్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండాలంటే కచ్చితంగా ఫార్మాసిటీ నుంచి కొంత మేరకు బఫర్ జోన్ ఏర్పాటు చేయాలన్న పొల్యూషన్ బోర్డు ఆదేశాలతో ఫార్మాసిటీకి బఫర్ జోన్ కేటాయించేందుకు ప్రభుత్వ కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. దాంతో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున్న చేపట్టిన రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసిన ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఫార్మాసిటీ చుట్టు పక్కల ఎలాంటి నిర్మాణాలు, చిన్న, చిన్న కంపెనీలు వచ్చే అవకాశం లేకపోవడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల పక్షాన ఆలోచన చేసి ప్రస్తుతం ఫార్మాసిటీకి కేటాయించిన భూముల్లో గతంలో చెప్పిన విధంగా బఫర్ జోన్ కేటాయించాలని, ఫార్మాసిటీకి వెలుపల ఎలాంటి ఆంక్షలు విధించొద్దని స్థానికులు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

ఫార్మాసిటీ కోసం కేటాయించిన భూముల్లో కొంత బఫర్ జోన్‌గా కేటాయించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మాసిటీ వెలుపల బఫర్ జోన్ విషయం మా దృష్టికి రాలేదు. ప్రభుత్వం నిర్ణయం మేరకు చేయాల్సి ఉంటుంది.

- వెంకటచారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో



భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

పంట పొలాలు కోల్పోయిన రైతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారంతో జిల్లా లో గుంట జాగా వచ్చే పరిస్థితిలేదు. చాలీ చాలని పరిహారంతో రైతులు బతికేదెట్లా.. ప్రభుత్వం ఆలోచన చేయా లి. బఫర్ జోన్ పేరుతో ఈ ప్రాంతాల నుంచి ప్రజలను కదిలించే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలి.

ఢిల్లీ అల్లర్లలో కేంద్ర హోం శాఖ వైఫల్యం



న్యూఢిల్లీ: నేటికి సరిగ్గా మూడేండ్ల క్రితం చోటు చేసుకున్న ఢిల్లీ అల్లర్లు ఇప్పటికీ మానని గాయాలను మిగిల్చాయి. బీజేపీ నాయకుల తీరుతో ఆ అల్లర్లు రెండు వర్గాల మధ్య గొడవగా చిత్రీకరించబడ్డాయి. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై కేంద్రం మొండి వైఖరిపై అప్పట్లో దేశరాజధానితో పాటు వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నిరసనలు, ప్రదర్శనలు, ఆందోళనలకు దారి తీసిన విషయం తెలిసిందే. అటు తర్వాత ఈశాన్య ఢిల్లీలో ఈ ఆందోళనలు తారా స్థాయికి చేరాయి. భౌతిక దాడులు, రాళ్ల విసురుకోవడంతో పాటు.. కొందరు వ్యక్తులు తుపాకులతో రావడం వంటి దృశ్యాలు కనబడ్డాయి. ఈ ఘటనలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, పోలీసుల వైఫల్యాన్ని నిజనిర్ధారణ కమిటీ ఎత్తి చూపింది. అల్లర్లతో ప్రభావితమైన ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించడంలో ఆలస్యం చేసిందనీ, ప్రత్యేక బ్రాంచ్, నిఘా విభాగాల నుంచి వచ్చిన హెచ్చరికలను ఢిల్లీ పోలీసులు లెక్క చేయలేదని వివరించింది. అలాగే మీడియా కథనాలు, బీజేపీ నాయకుల వ్యవహార శైలి వంటి కారణాలతో ఈశాన్య ఢిల్లీ అలర్లు మూడు రోజుల పాటు కొనసాగి తీవ్ర ఆస్తి, ధన, ప్రాణ నష్టాలను మిగిల్చాయని కమిటీ వెల్లడించింది. 2020 ఫిబ్రవరి అల్లర్లపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి మదన్. బి లోకూర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల నిజ నిర్ధారణ కమిటీ దర్యాప్తు జరుపుతున్నది. కేంద్ర హోం శాఖ, ఢిల్లీ పోలీసుల నిర్లక్ష్య వైఖరిని కమిటీ ఎత్తి చూపటంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అల్లర్లు మొదలయ్యే రోజు ఫిబ్రవరి 23న ఢిల్లీ పోలీసులకు స్పెషల్ బ్రాంచ్, నిఘా యూనిట్ల నుంచి ఆరుసార్లు హెచ్చరికలు వచ్చినా పట్టించుకోలేదని వివరించింది. ఆ తర్వాత రెండు రోజుల వరకూ అల్లర్లు చోటు చేసుకున్న ప్రాంతాలకు అదనపు బలగాలు చేరుకోలేదు. చివరకు ఫిబ్రవరి 26న అదనపు బలగాలను మోహరించడం గమనార్హం. కేంద్ర హోం శాఖ చూపిన ఉదాసీన వైఖరి అల్లర్లు చేసేవారికి ఊతమిచ్చినట్టయిందనీ, వరుసగా మూడు రోజుల పాటు హింసను మరింతగా సృష్టించారనీ కమిటీ వివరించింది. ఎఫ్ఐఆర్‌పై కోర్టులో సాక్షాత్తూ ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన చార్జీషీటు.. కమిటీ ఆరోపణలకు బలాన్ని చేకూర్చేలా ఉండటం గమనార్హం. ఈ ఎఫ్ఐఆర్‌లో సామాజిక కార్యకర్తలు, విద్యార్థి నాయకులు ఉమర్ ఖాలీద్, ఖాలీద్ సైఫీ, ఇష్రత్ జహాన్, గుల్ఫిషా ఫాతిమా, సఫూరా ఝర్గార్, నటాషా నార్వల్, దేవాంగన కలిత, ఇతరులపై ఉపా కింద పేర్లు చేర్చిన విషయం విదితమే. ఢిల్లీ అల్లర్లు చెలరేగిన 23, 24, 25 తేదీలలో మోహరించిన ఢిల్లీ పోలీసులతో పాటు కేంద్ర బలగాల సిబ్బంది సంఖ్య 1400 మంది లోపే ఉన్నది. అయితే, 26న ఆ సంఖ్య 4200కు పైగా చేరుకున్నది. 25న 3500 అత్యవసర ఫోన్ కాల్స్ రాగా, 26న 1500కు పడిపోయాయి. మొత్తానికి కేంద్ర హోం శాఖ నిర్లక్ష్య వైఖరి, ఢిల్లీ పోలీసుల సహకారం, మీడియా విభజిత కథనాలు, సీఏఏకు వ్యతిరేకంగా దాదాపు రెండు నెలలకు పైగా నిరసనల్లో ఉన్న ముస్లింలకు వ్యతిరేకంగా బీజేపీ చేసిన ద్వేషపూరిత ప్రచారం.. ఢిల్లీ అల్లర్లకు కారణమైందని కమిటీ తన దర్యాప్తులో వివరించింది.

జీ 20 సదస్సుతో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపు : ప్రధాని



న్యూఢిల్లీ: జీ20 సదస్సుకు ఆతిథ్యమివ్వడంతో భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటుందని ప్రధాని మోడీ అన్నారు. ప్రపంచంలో స్థిరత్వం, విశ్వాసం, వృద్ధిని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీ-20 సమావేశం సందర్భంగా ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లతో ప్రధాని శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, అధిక రుణాల వంటి ప్రపంచసవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో బహుపాక్షిక బ్యాంకుల అభివృద్ధిని బలోపేతం చేయాల్సి వుందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మహమ్మారి, యుద్ధాలు, రాజకీయ ఉద్రిక్తతలు దెబ్బతీశాయని అన్నారు. ఈ పరిణామాలతో పలు దేశాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటు న్నాయని అన్నారు.

గవర్నర్ వాహనంలో పూలదండపై దుష్ప్రచారం

- రాజ్‌భవన్ స్పష్టత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మెడికల్ పీజీ విద్యార్థిని ప్రీతిని పరామర్శించేందుకు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం పుదుచ్చేరి నుంచి నేరుగా నిమ్స్ ఆస్పత్రికి గవర్నర్ వెళ్లారని రాజ్‌భవన్ పేర్కొంది. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సంప్రదించి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులను ఆదేశించారని తెలిపింది. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారని పేర్కొంది. ఆ సమయంలో గవర్నరు వాహనంలో పూలదండ ఉండటంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని రాజ్‌భవన్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. నిజానికి గవర్నర్ వేరే ప్రదేశాల నుంచి రాజ్‌భవన్‌కు తిరిగి వచ్చేటప్పుడు ఖైరతాబాద్‌లోని హనుమంతుని ఆలయం దర్శించుకుని ఆ తర్వాత రాజ్‌భవన్‌కు రావడమనేది చాలా కాలంగా పాటించే ఆనవాయితీ అని వివరించింది. దానిలో భాగంగానే కారులో హనుమంతుని గుడిలో సమర్పించేందుకు పూలదండ ఉంచడం జరిగిందని పేర్కొంది. దానికి విపరీతార్థాలు తీయటం సహేతుకం కాదని స్పష్టం చేసింది. విద్యార్థిని త్వరగా కోలుకోవాలని కూడా గవర్నర్ ప్రార్థన చేశారని గుర్తు చేసింది. రాజ్‌భవన్‌కు వచ్చిన వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి ఈ సంఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవల్సిందిగా ఒక లేఖ రాశారని తెలిపింది. కాబట్టి గవర్నర్ నిమ్స్ పర్యటనను సరియైన దృష్టితో అర్థం చేసుకోవాలని రాజ్ భవన్ విజ్ఞప్తి చేసింది.

ఆధార్ లింక్ చేసిన 60 శాతం మందికి పైగా ఓటర్లు

- త్రిపురలో అత్యధికంగా 92 శాతానికి పైనే..!
- తెలంగాణలో 60 శాతం.. ఏపీలో 71 శాతం మంది
- ఆర్టీఐ సమాధానంలో ఈసీ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో ఓటర్ ఐడీకి ఆధార్ నెంబర్‌ను లింక్ చేసిన వారి సంఖ్య 60 శాతానికి పైగా ఉన్నది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేసుకున్న ఈశాన్య రాష్ట్రం త్రిపుర ఈ విషయంలో మిగతా రాష్ట్రాల కంటే ముందున్నది. ఇక్కడ 92 శాతం మందికి పైగా ఓటర్లు తమ ఓటర్ ఐడీకి ఆధార్ నెంబర్‌ను అనుసంధానించారు. గుజరాత్‌లో మాత్రం ఈ సంఖ్య తక్కువగా ఉన్నది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దాఖలైన ఒక ప్రశ్నకు సమాధానంగా ఎన్నికల సంఘం (ఈసీ) ఈ విషయాన్ని వెల్లడించింది. ఈసీ వెల్లడించిన సమాచారం ప్రకారం.. భారత్‌లో ఉన్న మొత్తం 94.5 కోట్ల మందికి పైగా ఓటర్లలో 56,90,83,090 మంది ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేశారు. త్రిపురలో 92.33 శాతం మంది ఓటర్లు ఓటర్ ఐడీకి ఆధార్ నెంబర్‌ను లింక్ చేశారు. త్రిపుర తర్వాతి స్థానంలో మధ్యప్రదేశ్ (86.19 శాతం మంది), సిక్కిం(80.63 శాతం మంది)లు ఉన్నాయి. తెలంగాణలో 60.04 శాతం మంది, ఏపీలో 71 శాతం మంది ఓటర్లు తమ ఓటర్ ఐడీకి ఆధార్ నెంబర్‌ను జత చేశారు.

టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 21 నామినేషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ లోకల్ అథారిటీ ఎమ్మెల్సీ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు వేసిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా శుక్రవారం పరిశీలించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు నామినేషన్‌లు వేయగా.. అందులో ఇండిపెండెంట్ అభ్యర్థిగా మహమ్మద్ రహీంఖాన్ దాఖలు చేసిన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నామినేషన్ పత్రాలలో బలపరి చిన పదిమంది ఓటర్లు కానందున తిరస్కరించినట్టు అధికారి తెలిపారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 21 మంది నామినేషన్లలో ఒక్కటి కూడా తిరస్కరణకు గురికాలేదన్నారు.

టీచర్ ఓటర్లు 29,720మంది : ఎన్నికల సంఘం

మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీకి నియోజకర్గంలోని ఓటర్ల సంఖ్యను గతేడాది డిసెంబర్ 30న ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ జాబితాలో కొత్తగా ఓటర్ల నమోదు, తొలగించినవారు, ఇతర అంశాల ఆధారంగా తుది జాబితాను శుక్రవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 137 పోలింగ్ కేంద్రాల పరిధిలో 29,720 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 15,472, మహిళలు 14,246, ఇతరులు ఇద్దరు ఓటర్లుగా ఉన్నారు. ఆ ఇద్దరు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే ఉన్నారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 9,186 మంది, అత్యల్పంగా నారాయణపేట్ జిల్లాలో 664 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాల వారీగా టీచర్ ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా పేరు	పోలింగ్ కేంద్రాలు	ఓటర్ల సంఖ్య
మహబూబ్‌నగర్	15	3461
నాగర్‌కర్నూల్	14	1822
వనపర్తి	7	1335
జోగులాంబ గద్వాల్	11	877
నారాయణపేట్	5	664
రంగారెడ్డి	31	9186
వికారాబాద్	18	1890
మేడ్చల్-మల్కాజిగిరి	14	6536
హైదరాబాద్	22	3949
మొత్తం	137	29,720

'కోటా' స్టడీ మెటీరియల్ సిద్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్ సిద్ధం చేసినట్టు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందొచ్చని సూచించింది. స్టడీ మెటీరియల్‌తోపాటు అసైన్‌మెంట్లను పొందొచ్చని పేర్కొంది. మరింత సమాచారం కోసం ఇంజినీరింగ్ విద్యార్థులు ఐఐటీ ఎఫ్, మెడికల్ విద్యార్థులు ఎంఈడీ ఎఫ్ అని రాసి 9849016661 నెంబర్‌కు వాట్సాప్ సందేశం పంపాలని కోరింది.

వేసవిలో ప్రయాణికులకు పకడ్బందీ ఏర్పాట్లు

తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలి : అధికారులకు టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దిశానిర్దేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వేసవిలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) ఎండీ వీసీ సజ్జనార్ శుక్రవారం దిశానిర్దేశాన్ని చేశారు.

బస్టాండుల్లో తాగునీరు సదుపాయంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఫ్యాన్లు, కూలర్లు, బెంచీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేసవిలో ప్రయాణికులకు ఏర్పాట్లు, సంస్థలోని ఇతర అంశాలపై హైదరాబాద్ లోని బస్ భవన్ నుంచి ఆర్ఎంలు, డీఎంలు, ఉన్నతాధికారులతో సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఆన్‌లైన్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ప్రయాణి కులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని నిర్దేశించారు. ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే కాలంలో టీఎస్‌ఆర్టీసీకి ఎంతో కీలకమనీ, ఆ మేరకు అధికారులందరూ పూర్తిగా సన్నద్ధం కావాలని తెలిపారు. సంస్థ ఆర్థిక పుష్టికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించడమే తమ ప్రధాన విధి అని పేర్కొన్నారు.

ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను చెల్లించండి

మంత్రి హరీశ్‌రావుకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి హరీశ్‌రావుకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. బడ్జెట్ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చానని తెలిపారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అధ్యాపకులతోపాటు డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల జీతాలు, గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులు, జీవిత బీమా చెల్లింపులు, సరెండర్ లీవు వేతన చెల్లింపులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయంటూ సంబంధిత వ్యక్తులు, సంఘాల నాయకులు తన దృష్టికి తెచ్చారని వివరించారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను పూర్తి చేసి వారి ఖాతాల్లో జమ చేయించాలని కోరారు.

జీబ్రానిక్స్ నుంచి కొత్త స్మార్ట్ ఎల్ఈడీ ప్రొజెక్టర్



చెన్నై : ప్రముఖ ఎలక్ట్రానిక్ గృహోపకరణాల సంస్థ జీబ్రానిక్స్ తమ కంపెనీ నుంచి కొత్త స్మార్ట్ ఎల్ఈడీ ప్రొజెక్టర్‌ను తీసుకొచ్చింది. జీబ్రానిక్స్-పిక్సాప్లే 18ను ఆవిష్కరించింది. ఇంటిలో ఒక థియేటర్ అనుభవాన్ని ఈ కొత్త ప్రొజెక్టర్ కలిగిస్తుంది. ఇందులో శక్తిమంత మైన, చక్కని అనుభవాన్ని ఇచ్చే స్పీకర్లు కూడా ఉన్నాయి. 508 సెంటీ మీటర్ల భారీ సైజు కలిగి ఉన్న ఈ ప్రొజెక్టర్‌లో పలు స్మార్ట్ ఫీచర్లు కూడా ఉన్నాయి. 8జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో ఒక పవర్‌ఫుల్ ప్రాసెసర్‌ను అది కలిగి ఉంటుంది. ఆవిష్కరణ కార్యక్రమంలో సహ వ్యవస్థాపకులు, డైరెక్టర్ ప్రదీప్ జోషి పాల్గొని మాట్లాడారు. ఈ ప్రొజెక్టర్ ధర రూ. 21,999గా ఉన్నది. ఫ్లిప్‌కార్టులో అందుబాటులోకి రానున్నది.

జీపీ కార్మికులకు రూ.4వేల వేతనమా?

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

- జీవో నెంబర్ 51ని రద్దు చేయాల్సిందే: సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్
- ఇబ్రహీంపట్నంలో కొనసాగిన గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్ర



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

పొద్దంతా వెట్టిచాకిరి చేసిన పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం కేవలం నెలకు రూ.4వేల వేతనమే ఇస్తదా అని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ ప్రశ్నించారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని పలు గ్రామాలు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్, కప్పపహాడ్, ఎలిమినేడు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో భూపాల్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఏర్పడిన తెలంగాణలో గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టి చేయించుకోవడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పల్లె ప్రకృతి, పల్లెప్రగతి, గ్రామంలో అండర్ డ్రయినేజీలను, వీధులు ఊడ్చడం, ప్రభుత్వ పాఠశాల నిర్వహణలో గ్రామ పంచాయతీల అభివృద్ధిలో జీపీ కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. నిత్యం గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయంటే దానికి గ్రామ పంచాయతీ కార్మికులే మూల కారణమన్నారు. అలాంటి కార్మికులకు ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయకుండా పనులు చేయించుకుంటూ శ్రమదోపిడీకి ప్రభుత్వం పాల్పడుతుందని అన్నారు. కార్మికులకు రావాల్సిన కాస్మోటిక్స్ సరుకులు, వస్తువులు నెలనెలకు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 51ని రద్దుచేసి ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులకు ఇస్తున్నట్టుగా తెలంగాణ కార్మికులకు కూడా కనీస వేతనం రూ. 21వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు ప్రమాదవశాత్తు ఏదైనా సంఘటనలు జరిగితే భరోసాగా ఆరోగ్యబీమా అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే బహిరంగ సభకు కార్మిక లోకం పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు గ్యార పాండు, కార్యదర్శి వెంకటయ్య, నాయకులు మహేష్, వినోద్‌కుమార్, సోమయ్య, వృత్తిదారుల సంఘం అధ్యక్షులు పి.యాదయ్య, బుగ్గ రాములు, జీపీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోసిన ట్రాఫిక్ కానిస్టేబుల్

- అరాంఘర్ చౌరస్తాలో గుండెపోటుతో కుప్పకూలిన యువకుడు
- కానిస్టేబుల్‌ను అభినందించిన మంత్రి హరీశ్‌రావు, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీందర్



కానిస్టేబుల్ రాజశేఖర్ | గుండెపోటుతో కుప్పకూలిన యువకునిపై సీపీఆర్ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజశేఖర్

నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తి నిండు ప్రాణాన్ని కాపాడగలిగింది. గుండెపోటుతో యువకుడు కుప్పకూలడంతో వెంటనే స్పందించిన కానిస్టేబుల్ సీపీఆర్ చేశాడు. యువకుడి ప్రాణం కాపాడి అందరి మన్ననలు పొందాడు. వివరాల్లోకి వెళ్లితే.. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో శుక్రవారం ఉదయం ఎల్బీనగర్ వెళ్లే బస్టాప్‌లో బాలరాజు అనే యువకుడు గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజశేఖర్ గమనించి వెంటనే అతనిపై సీపీఆర్ చేశాడు. చాతిపై గట్టిగా నొక్కడంతో అతడు స్పృహ లోకి వచ్చాడు. అనంతరం 108లో సమీపంలోని అత్తాపూర్ జర్మన్ టెన్ ఆస్పత్రికి తరలించారు. అలాగే ఎల్బీనగర్‌లోని అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సకాలంలో బాలరాజును ఆస్పత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందించారు. అతను క్షేమంగా ఉన్నట్టు చెప్పారు.

రాజశేఖర్‌పై ప్రశంసలు

తన సమయస్ఫూర్తితో యువకుడి ప్రాణాన్ని కాపాడిన ట్రాఫిక్ కాని స్టేబుల్ రాజశేఖర్‌పై పలువురు ప్రశంసలు కురిపించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీందర్ సైతం రాజశేఖర్ సమయస్ఫూర్తిని అభినందించారు. గతంలో డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులు ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. ఇప్పుడు రాజశేఖర్ యువకుడి ప్రాణాన్ని కాపాడటానికి ఆ శిక్షణా తరగతులే కారణమని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ ఎన్నికల షెడ్యూల్ ఖరారు

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. ఏప్రిల్ 30న ఎన్నికలు నిర్వహించనున్నారు. మార్చి 28, 29 తేదీల్లో నామినేషన్లు స్వీకరించనున్నారు. శుక్రవారం బ్రిగే డియర్ సోమా శంకర్, బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ ప్రత్యేకంగా సమావేశమై ఎన్నికల అంశంపై చర్చించారు. బోర్డు సీఈవో మాట్లాడుతూ.. అర్హులైన కంటోన్మెంట్ నివాసులందరూ ఎలక్షన్‌లో పాల్గొనాలని కోరారు. ఓటరు లిస్ట్‌లో పేరు లేని వారు మార్చి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు సంబంధిత పత్రాలతో బోర్డు కార్యాలయంలో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 23న ఫైనల్ ఓటర్ లిస్టును అధికారులు విడుదల చేయనున్నారు. మార్చి 28, 29 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తారని, ఏప్రిల్ 6 వరకు నామినేషన్‌లు విత్ డ్రా చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 10న పోటీదారుల లిస్ట్‌ను ఖరారు చేయనున్నారు. ఏప్రిల్ 30న ఎన్నికలు జరుగుతాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మొత్తం 8 వార్డులున్నాయి. రిజర్వేషన్ల ప్రకారం 1,3,4,7 వార్డులు జనరల్ కేటగిరీ కాగా.. 2,5,6 వార్డులు మహిళలకు, 8వ వార్డు షెడ్యూల్ క్యాస్ట్‌కు కేటాయించారు.

ఎంసెట్‌లో వెయిటేజీ లేదు

ఇంటర్‌లో 45 శాతం మార్కులొస్తేనే అర్హులు

ఎంసెట్‌తోనే బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలు

- 28న నోటిఫికేషన్ జారీ
- మార్చి 3 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి
- షెడ్యూల్ విడుదల



ఎంసెట్ షెడ్యూల్

నోటిఫికేషన్ జారీ	ఈనెల 28న
దరఖాస్తు స్వీకరణ ప్రారంభం	మార్చి 3 నుంచి
వాటి సమర్పణకు తుది గడువు	ఏప్రిల్ 10
రాతపరీక్షల తేదీలు	
ఇంజనీరింగ్ విభాగం	మే 7 నుంచి 9 వరకు
అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం	మే 10, 11 తేదీల్లో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ రాతపరీక్షల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ ఈ ఏడాది లేదని అన్నారు. కరోనా నేపథ్యంలో గత మూడేండ్లుగా ఈ నిబంధనను వర్తింపచేయలేదన్నారు. భవిష్యత్తులో వెయిటేజీ ఉంటుందా? లేదా?అన్నది ప్రభుత్వం నిర్ణయం ఆధారంగా ఉంటుందని వివరించారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదన్నారు. ఇంకోవైపు ఇంటర్ బోర్డుతోపాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఇతర రాష్ట్రాలకు చెందిన బోర్డులకు చెందిన విద్యార్థుల మార్కులను క్రోడీకరించి వెయిటేజీ కలిపి ర్యాంకులు కేటాయించడం కొంత కష్టమని అన్నారు. అందుకే ఈసారి వెయిటేజీ ఇవ్వడం లేదన్నారు. ఎంసెట్‌కు దరఖాస్తు చేయాలంటే కనీస మార్కుల నిబంధన అమల్లో ఉంటుందని చెప్పారు. అంటే ఇంటర్ లేదా తత్సమాన పరీక్షల్లో 45 శాతం మార్కులుంటేనే ఎంసెట్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 70 శాతం, ద్వితీయ సంవత్సరం నుంచి వంద శాతం సిలబస్‌తో ఎంసెట్ ప్రశ్నాపత్రాలను రూపొందిస్తామని అన్నారు. కాళోజి నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విజ్ఞప్తి మేరకు ఎంసెట్ ద్వారానే బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలుంటాయని వివరించారు. ఇంటర్ బోర్డు సూచించిన సిలబస్ ప్రకారమే విద్యార్థులు సన్నద్ధం కావాలని కోరారు. ఈనెల 28న ఎంసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామన్నారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు తుది గడువు ఏప్రిల్ పదో తేదీ వరకు ఉందన్నారు. అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు సమర్పించిన దరఖాస్తుల సవరణకు అవకాశముందని చెప్పారు. ఆలస్య రుసుం రూ.250తో ఏప్రిల్ 15 వరకు, రూ.500తో అదేనెల 20 వరకు, రూ.2,500తో 25 వరకు, రూ.ఐదు వేలతో మే 2వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించేందుకు గడువుందని అన్నారు. ఏప్రిల్ 30 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు మే ఏడు నుంచి తొమ్మిది వరకు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలు అదేనెల 10,11 తేదీల్లో నిర్వహిస్తామని వివరించారు.

ఇంజినీరింగ్ లేదా అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఒకదానికి దరఖాస్తు చేయాలంటే ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు రూ.500, ఇతరులు రూ.900 పరీక్ష ఫీజు చెల్లించాలని కోరారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రెండింటికీ దరఖాస్తు చేయాలంటే ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు రూ.వెయ్యి, ఇతరులు రూ.1,800 కట్టాలని చెప్పారు. ఎంసెట్ రాతపరీక్షల నిర్వహణ కోసం తెలంగాణలో 16, ఏపీలో ఐదు కలిపి మొత్తం 21 ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 55 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఇతర వివరాలకు **https:eamcet.tsche.ac.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, పీజీఈసెట్ కన్వీనర్ బి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న పీజీఈసెట్ నోటిఫికేషన్

రాష్ట్రంలో ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 28న పీజీఈసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామన్నారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా వాటి సమర్పణకు ఏప్రిల్ 30 వరకు గడువుందని చెప్పారు. మే రెండు నుంచి నాలుగో తేదీ వరకు సమర్పించిన దరఖాస్తులను సవరించేందుకు అవకాశముందని అన్నారు. ఆలస్య రుసుం రూ.250తో మే ఐదు వరకు, రూ.వెయ్యితో పది వరకు, రూ.2,500తో 15 వరకు, రూ.ఐదు వేలతో అదేనెల 24వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. హైదరాబాద్, వరంగల్‌లోనే మే 29 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు రాతపరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ, వికలాంగులు రూ.600, ఇతరులు రూ.1,100 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు **https:pgecet.tsche.ac.in** వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కేంద్రం విధానాలతోనే బీఎస్ఎన్ఎల్‌కు నష్టాలు

- బీఎస్ఎన్ఎల్ సర్కిల్ కార్యదర్శి జి.సాంబశివరావు



నవతెలంగాణ- సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలతోనే బీఎస్ఎన్ఎల్ సంస్థ నష్టాల్లోకి కూరుకుపోయిందని బీఎస్ఎన్ఎల్ సర్కిల్ కార్యదర్శి జి.సాంబశివరావు అన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ లాంచింగ్‌కు మోడీ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. దేశంలో ఉన్న అన్ని ప్రైవేట్ కంపెనీలు తమ 5జీ సేవలను ప్రారంభిస్తుంటే, బీఎస్ఎన్ఎల్ సంస్థ 4జీని ప్రారంభించకపోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. 14 చార్టర్ ఆఫ్ డిమాండ్లను ప్రచారం చేసేందుకు ఏప్రిల్ అయిదో తేదీన న్యూఢిల్లీలో మజ్దూర్ కిసాన్ ర్యాలీ జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని కోరుతూ బీఎస్ఎన్ఎల్ఈయూ, ఎఐబీడీపీఏ, బీఎస్ఎన్ఎల్ సీసీడబ్ల్యుఎఫ్ కో ఆర్డినేషన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం బీఎస్ఎన్ఎల్ రంగంలో తెలంగాణ సర్కిల్‌లోని అన్ని జనరల్ మేనేజర్ ఆఫీసుల ముందు గేట్ మీటింగ్‌లు, ప్రదర్శనలు జరిగాయి. హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, నల్లగొండ సహా మొత్తం 18 సెంటర్లలో ఈ కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్ సర్కిల్ ఆఫీసు ముందు జరిగిన గేట్ మీటింగ్‌లో సాంబశివరావు మాట్లాడుతూ, బీఎస్ఎన్ఎల్ సంస్థ నష్టాల్లో కూరుకుపోయిందని, ఉద్యోగులకు వేతన సవరణను ప్రభుత్వం తిరస్కరించిం దన్నారు. నష్టాలకు ఎవరు కారణమని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగాన్ని రక్షించడానికి, ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక మరియు కార్పొరేట్ అనుకూల విధానాలను ఓడించేందుకు ఏప్రిల్ 5న జరిగే ర్యాలీలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓంప్రకాశ్ జైస్వాల్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వెంకట లక్ష్మి, జిల్లా అధ్యక్షులు, శేషిరెడ్డి, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ లేదంటూ వేధింపుల వల్లే...

(మొదటిపేజీ తరువాయి)

ఎందుకు వేధిస్తున్నా వని, ఏమైనా ఉంటే హెచ్‌ఓడీకి ఫిర్యాదు చేయమంటూ ప్రీతి సైఫ్‌కు మెసేజ్ చేసినట్టు చెప్పారు. ప్రీతి మానసికంగా ఇబ్బంది పడటంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని భావిస్తున్నట్టు తెలిపారు. వేధింపులు, అవమానించడం ర్యాగింగ్ కిందకు వస్తుందని భావించి ర్యాగింగ్ కేసుగా నమోదు చేశామన్నారు. ఈనెల 18న ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో ప్రీతి డ్యూటీ చేస్తుండగా, కేస్‌షీట్ విషయంపై ప్రీతిని వాట్సాప్ గ్రూపులోనే డాక్టర్ సైఫ్ తీవ్రంగా మందలించాడు. వారిద్దరి వాట్సాప్ ఛాటింగ్‌లతోపాటు సైఫ్ స్నేహితులతో చేసిన ఛాటింగ్‌లను కూడా పోలీసులు పరిశీలించారు. వృత్తిలో భాగంగా సబ్జెక్టుపై అవగాహన తీసుకురావడానికే ప్రీతితో మాట్లాడటం జరిగిందే తప్పా వేధించాలని కాదని సైఫ్ చెప్పినట్టు తెలిపారు. సైఫ్ తన స్నేహితులతో చేసిన ఛాటింగ్‌లో మాత్రం ప్రీతి ఎక్కువ చేస్తుందని, ఎవరూ సహకరించొద్దని కోరాడన్నారు. దీన్ని బట్టి ప్రీతిని లక్ష్యంగా చేసుకొని కామెంట్స్ చేసినట్టు అర్థమవుతోందని, దాంతో సున్నితమనస్కు రాలైన ప్రీతి ఆందోళనకు గురై విషయం ఎవరికీ చెప్పుకోలేక ఒత్తిడికి గురైనట్టు తెలిపారు. ప్రీతి ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ విషయాన్ని హెచ్‌ఓడీ డాక్టర్ నాగార్జునరెడ్డికి తెలపగా, హెచ్‌ఓడీ సైఫ్, ప్రీతితో మంగళవారం వేర్వేరుగా మాట్లాడి మరోమారు ప్రీతిపై ఎలాంటి కామెంట్స్ వాట్సాప్‌లో పెట్టొద్దని, డ్యూటీలు కూడా వేర్వేరుగా చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. అదేరోజు మధ్యాహ్నం నుంచి ఎంజీఎంలో ప్రీతి డ్యూటీ చేసింది. బుధవారం తెల్లవారుజామున 3.00 గంటలకు శైలేష్‌కు ప్రీతి ఫోన్ చేసి సైఫ్‌పై ఫిర్యాదు చేయడం వల్ల తన పట్ల అందరూ వ్యతిరేకతతో వున్నారా అని ఆరా తీసి.. చాలా క్యాజువల్‌గా మాట్లాడిందని, అలాంటిదేమీ లేదని చెప్పానని శైలేష్ చెప్పినట్టు సీపీ వివరించారు. బుధవారం ఉదయం 7.00 గంటల ప్రాంతంలో ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని భావిస్తున్నట్టు చెప్పారు. కాగా, ప్రీతి గదిలో మెటజోలెమ్ ఇంజక్షన్, పెంటనిల్ ఇంజెక్షన్ లభించినట్టు చెప్పారు. సక్సీనైల్ కోలిన్ అనే ఇంజక్షన్ లభించిందని ప్యాకెట్ సీల్ తెరవలేదన్నారు. మెడికల్ కాలేజీలో సీనియర్లను జూనియర్లు 'సార్' అని పిలవాలనే కల్చర్ ఉందని, ఇది సర్వసాధారణమేనని విద్యార్థులు, ప్రొఫెసర్లు చెప్పారన్నారు. దీన్ని ర్యాగింగ్ అని అనలేమని, కాని దీనివల్ల సీనియర్లు, జూనియర్ల మధ్య కొంత గ్యాప్ ఉందనిపిస్తుందన్నారు. ఈ కేసులో నిందితుడైన డాక్టర్ సైఫ్‌కు ఎలాంటి రాజకీయ నేపథ్యం, బంధుత్వం లేదన్నారు. అనవసరంగా రాజకీయ దుష్ప్రచారం చేయవద్దని కోరారు. సైఫ్‌ది సాదాసీదా కుటుంబమేనన్నారు. పెంచుకున్న తండ్రి వ్యవసాయ చేసేవాడని, ఆయన చనిపోయినట్టు తెలిపారు. కన్నతండ్రి రైల్వేలో ఫిట్టర్‌గా పనిచేస్తుంటాడని తెలిపారు.

పోలీసుల నిర్లక్ష్యం లేదు.. : ప్రీతి తండ్రి నరేందర్ ఎఎస్సైగా పని చేస్తున్నాడని, ఆయనతో స్వయంగా మాట్లాడానని, విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇప్పిస్తే సమస్య పరిష్కారమవుతుందని భావించాడని సీపీ తెలిపారు. ఎలాంటి లిఖితపూర్వక ఫిర్యాదు చేయలేదన్నారు. ఏసీపీ కిషన్‌కు ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో, తనకు తెలిసిన ఎస్ఐ శంకర్ నాయక్‌తో విషయం చెప్పారని, శంకర్‌నాయక్ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి బందోబస్తులో ఉండటంతో తర్వాత మాట్లాడతానని చెప్పి కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్‌కు సమాచారం అందించాడన్నారు. ప్రీతి టాక్సీ కాలజీ రిపోర్టు నిమ్స్ నుంచి వస్తే అన్ని విషయాలు బహిర్గతమవుతాయన్నారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ అబ్దుల్ బారీ, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ పాల్గొన్నారు.

ప్రీతికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం

- ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కేఎంసీ గేటు ఎదుట ధర్నా



నవతెలంగాణ-మట్టెవాడ

కేఎంసీ అనస్తీషియా పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసులో బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐద్వా ఆధ్వర్యంలో వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల గేటు ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. బాధితురాలికి న్యాయం చేయాలని, కళాశాలల్లో ర్యాగింగ్‌ను తరిమికొట్టాలని, మహిళలపై వేధింపులను అరికట్టాలని, ప్రీతి లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులతో పాటు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి మడికొండ వద్ద నున్న మిల్ట్రీ ట్రైనింగ్ బేస్ క్యాంపునకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రిన్ సుల్తానా, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నళిగంటి రత్నమాల, భవాని మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలో ప్రీతి ఆత్మహత్యాయత్నం సంఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ర్యాగింగ్‌పై పర్యవేక్షణ కమిటీ లేకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తుందని ఇలాంటి సంఘటనలు పదేపదే జరుగుతున్నాయని అన్నారు. మెడికో ప్రీతి వేధింపులకు సంబంధించి ఆరు నెలలుగా సీనియర్ పీజీ వైద్యుడు సైఫ్ మానసికంగా వేధిస్తున్నాడని బాధితురాలు కళాశాల ప్రిన్సిపాల్‌కు చెప్పినప్పటికీ పట్టించుకోకపోవడం వల్లే ప్రీతి కొన ఊపిరితో కొట్టుమిట్టాడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మెరిట్ విద్యార్థిని ఈ పరిస్థితికి తీసుకువచ్చిన ర్యాగింగ్, వేధింపులను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని వేధింపులకు బలవుతున్న బాధితుల పక్షాన పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పీజీ వైద్య విద్యార్థినికి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యారా ప్రశాంత్ రెడ్డి, కేడీసీ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, అభిలాష్, కరీమాబాద్ ఏరియా కార్యదర్శి రాజకుమార్, సందీప్, ఇర్ఫాన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయంలో చోరీ

- 15 కిలోల వెండి విగ్రహాలు మాయం
- నిందితులను పట్టుకోవడానికి 10 టీమ్‌లు ఏర్పాటు



నవతెలంగాణ-మల్యాల

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఆ డబ్బులు గుడిలోనే ఉంటాయన్న ఉద్దేశంతో దొంగలు చొరబడి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 కిలోల వెండి, బంగారు నగలు మాయమైనట్టు గుర్తించారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట 30 నిమిషాల సమయంలో ముగ్గురు వ్యక్తులు ప్రధాన ఆలయానికి వెనుక వైపున బేతాళ గుడి ప్రాంతం నుంచి లోపలకు చొరబడినట్టు తెలిపారు. వారి చేతుల్లో కటింగ్ ప్లేయర్స్‌తోపాటు ఇతరత్రా సామాగ్రి ఉన్నట్టు సీసీ పుటేజీలో గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున ప్రధాన అర్చకులు ఆలయం లోపలికి వెళ్లగా చోరీ విషయాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జగిత్యాల డీఎస్పీ ప్రకాష్ జాగిలాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆలయానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా 10 టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. స్వామివారి 2 కిలోల వెండి మకర తోరణం, అర్ధమండపంలోని 5కిలోల ఆంజనేయస్వామి వెండి ఫ్రేమ్, 3 కిలోల నాలుగు వెండి శఠగోపాలు, స్వామివారి 5 కిలోల వెండి తొడుగు, సుమారు 15 కిలోల వరకు వెండి దొంగతనం అయినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీని విలువ తొమ్మిది లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. కొండగట్టులో ఏఎస్ఐ, నలుగురు సిబ్బంది ఉన్నారని, వారి కండ్లుగప్పి చోరీ చేశారని చెప్పారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

నవతెలంగాణ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగి నగేష్‌కు పితృవియోగం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ ప్రింటింగ్ ప్రెస్ ఉద్యోగి పొన్న నగేష్ తండ్రి పొన్న లక్ష్మయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతికి నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, ఎడిటర్ సుధా భాస్కర్ సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బాగ్‌లింగం పల్లిలో లక్ష్మయ్య భౌతికకాయాన్ని నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి, జనరల్ మేనేజర్లు పి.నరేందర్‌రెడ్డి, రఘు, ఆర్.వాసు, మేనేజర్లు వీరయ్య రేణుక, ఉపేందర్‌రెడ్డి, గురుదీప్ సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెరువు అన్నారం గ్రామంలో శనివారం జరగనున్నాయి. లక్ష్మయ్య మృతికి హైదరాబాద్ జిందాబాద్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది.

ఇది ముమ్మాటికీ లవ్ జిహాదీ కేసే..

- వరంగల్ ఘటనపై బండి సంజయ్ దుష్ప్రచారం



నవతెలంగాణ - కరీంనగర్

వరంగల్‌లో మెడికల్ విద్యార్థిని ప్రీతి ర్యాగింగ్ వల్లే ఆత్మహత్యాయత్నం చేసుకుందని, ఇది ముమ్మాటికీ జీహాదీ కేసేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోలీసులు కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రీతి పలుమార్లు వేధింపులకు గురైందని ఆమె తండ్రే చెప్పారన్న విషయాన్ని గుర్తు చేశారు. దీనిని చిన్న కేసుగా మార్చి నీరుగార్చే కుట్ర జరుగుతోందన్నారు. ఇది ముమ్మాటికీ లవ్ జిహాదీ కేసేనని, హిందూ అమ్మాయిలను ట్రాప్ చేసే కుట్రలో భాగంగానే ప్రీతిని ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు. ప్రీతి ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు దమ్ముంటే తెలంగాణలో జరిగిన అభివృద్ధి, ఇచ్చిన హామీలతో పాటు కేంద్రం తెలంగాణకు ఎన్ని నిధులిచ్చిందనే అంశంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఎంపీ వివేక్ పాల్గొన్నారు.

సంపాదకీయం

చైనా పురోగమనాన్ని అడ్డుకోగలరా?

అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని ఆపగలమని అనుకొనే వారు బుర్ర తక్కువ కాదు అసలు లేని వారు. నా కోడి కూయకపోతే ఎలా తెల్లవారుతుందో చూస్తా అన్నాడట వెనుకటికెవడో. ఇప్పుడు సరిగ్గా అమెరికా కూడా ఇదే స్థితిలో ఉంది. జపాన్ మీద అణుబాంబును వేసి తనకు లొంగకపోతే మీకూ ఇదే గతి అని బెదిరించిన అమెరికాకు మా దగ్గర కూడా ఉంది చూడమంటూ నాలుగేండ్లలోనే చూపిన సోవియట్ నేత స్టాలిన్ సంగతి తెలిసిందే. ఇప్పుడు టెక్నాలజీ యుద్ధం నడుస్తోంది. మేము, మా మిత్రదేశాలు మీకు అవసరమైన చిప్స్‌ను అందించకపోతే మీరెలా ముందుకు పోతారో చూస్తాం అని అమెరికన్లు విసిరిన సవాలును తాడిని తన్నేవాడుంటే వాడి తలదన్నేవాడుంటాడన్నట్లుగా చైనా స్వీకరించింది. శాస్త్ర-సాంకేతిక రంగాల్లో స్వావలంబన సాధించేందుకు కావలసిన చర్యలన్నింటినీ చేపట్టాలని చైనా అధినేత షీ జింపింగ్ ఒక ఉన్నత స్థాయి సమావేశంలో కర్తవ్యనిర్దేశం చేశారు. జనవరి 31న కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో దీని గురించి చర్చించారు.

> కమ్యూనిస్టు చైనాకు ఇబ్బందులు, సవాళ్లు, వాటిని అధిగమించటం కొత్తేమీ కాదు. సాంకేతిక పరిజ్ఞానాన్నే కాదు, పెట్టుబడులను కూడా రాకుండా అడ్డుకున్న పశ్చిమ దేశాల కుట్రలను ఎదిరించి తాను ఎంచుకున్న మార్గంలో పురోగమించటంలో మరొక దేశానికి పోటీ కాదు, పోటీ లేదు.

నెల రోజులు కూడా గడవక ముందే ఫిబ్రవరి 21న పొలిట్ బ్యూరో పూర్తిగా ఈ అంశం గురించే చర్చించి అమెరికా విసిరిన సవాలును అధిగమించేందుకు దిశానిర్దేశం చేసిందంటే దానికి ఉన్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

అమెరికా ఎంతకు తెగించిందంటే ఒక వేళ చైనా గనుక తైవాన్ విలీనాన్ని బలవంతంగా అమలు చేస్తే అక్కడ ఉన్న చిప్స్ ఫ్యాక్టరీలన్నింటినీ పేల్చివేస్తామని బెదిరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అధునాతన మైక్రో చిప్స్ తయారీలో చైనాలోని కంపెనీలు తిరుగులేని ఆధిక్యతలో ఉన్నాయి. దేశీయంగా చైనాలో పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నప్పటికీ చిప్స్ రూపకల్పన ఒక ఎత్తైతే వాటి తయారీకి అవసరమైన ఆధునిక యంత్ర పరికరాల తయారీ, పరిజ్ఞానంలో పశ్చిమ దేశాలు, జపాన్‌దే పైచేయి. తైవాన్, దక్షిణ కొరియా, జపాన్, అమెరికాల నుంచి ఎక్కువ భాగం చైనా దిగుమతి చేసుకుంటున్నది. ఇదే సరఫరా గొలుసు కొనసాగితే త్వరలోనే చైనా ఆర్థిక అగ్రదేశంగా, మిలిటరీ రీత్యా మరింత పటిష్టంగా మారితే తన స్థానానికి ఎసరు వస్తుందని అమెరికా ఆందోళన చెందుతోంది. 2018లో డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య పోరు పేరుతో సాగిస్తున్న ప్రచ్ఛన్నయుద్ధంలో శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, చైనాకు అవసరమైన విడి భాగాల ఎగుమతులను అడ్డుకోవటం కూడా ఒకటి. జో బైడెన్ ఏలుబడిలో అది మరొక రూపం తీసుకుంది. తమతో పాటు ఏ దేశమూ కూడా చిప్స్ సాంకేతిక పరిజ్ఞానం, వాటి ఎగుమతి, తయారు చేసే యంత్రాలను కూడా చైనాకు ఇవ్వకూడదని ఇతర దేశాల మీద అమెరికా ఒత్తిడి తెస్తోంది. అలా చేస్తే విస్తారమైన చైనా మార్కెట్‌ను కోల్పోతే తమ కార్పొరేట్ల ప్రయోజనాలకు దెబ్బ అని ఒక వైపు చెబుతూనే సదరు దేశాలు అమెరికా ఒత్తిడికి లొంగుతున్నాయి. ఏడాది క్రితం బ్రిటన్‌లోని అతి పెద్ద చిప్స్ తయారీ కంపెనీ న్యూపోర్ట్ వాఫర్‌లో 86శాతం వాటాలను చైనా సంస్థ వింగ్‌టెక్‌కు విక్రయించేందుకు ఒప్పందం కుదిరింది. రెండుసార్లు భద్రతాపరమైన అంశాలపై సమీక్ష తరువాతే ఇదంతా జరిగింది. అలాంటి ఈ ఒప్పందం తమ దేశ భద్రతకు ముప్పు అంటూ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఇటీవల దాన్ని రద్దు చేశాడు.




ఇలాంటి పరిస్థితి ఏదో ఒక నాడు ఎదురు కానుందనే ముందు చూపుతో చైనా ఇటీవలి కాలంలో శాస్త్ర-పరిశోధనా రంగంలో పెద్ద మొత్తం ఖర్చు చేస్తున్నది. స్టాటిస్టా వెల్లడించిన సమాచారం ప్రకారం 2022లో అమెరికా 679 బిలియన్ డాలర్లు కేటాయిస్తే చైనా 551, జపాన్ 182 బి.డాలర్లు కాగా ఏడవ స్థానంలో ఉన్న మన దేశం 65 బి.డాలర్లని పేర్కొన్నది. ఈ లెక్కన త్వరలో అమెరికాను వెనక్కునెట్టేసి చైనా ముందుకు పోనుంది. పిండికొద్దీ రొట్టే అన్నట్లు ఖర్చును బట్టే ఫలితాలు కూడా ఉంటాయి. మన పరిశోధనలు మాత్రం ఆవు పేడ, మూత్రంలో బంగారాన్ని కనుగొనటం చుట్టూ తిరుగుతున్నాయి. 2012లో చైనాలో 49వేల హైటెక్ కంపెనీలు ఉంటే 2021 నాటికి మూడులక్షల 30వేలకు పెరిగాయి. ప్రపంచంలో పరిశోధనకు పెద్ద మొత్తాలలో ఖర్చు చేస్తున్న అగ్రశ్రేణి రెండున్నరవేల కంపెనీలలో చైనావి 680 ఉన్నాయి.

కరోనా అమెరికాతో వాణిజ్యపోరులో చైనా కొన్ని ఇబ్బందులను ఎదుర్కొన్నది. రానున్న మూడు దశాబ్దాల్లో కూడా కొన్ని ఇబ్బందులు వచ్చినప్పటికీ అధునిక దేశంగా మారనున్నదని చైనా డైలీ పేర్కొన్నది. ఇప్పటి వరకు ప్రపంచ వినియోగదారులకు సరుకులు అందించిన దేశంగా ఉన్నది కాస్తా అదే ఒక ప్రధాన వినియోగదారుగా మారనున్నది. అందుకు అవసరమైన వస్తూత్పత్తికి పథకాలు వేస్తున్నది. కమ్యూనిస్టు చైనాకు ఇబ్బందులు, సవాళ్లు, వాటిని అధిగమించటం కొత్తేమీ కాదు. సాంకేతిక పరిజ్ఞానాన్నే కాదు, పెట్టుబడులను కూడా రాకుండా అడ్డుకున్న పశ్చిమ దేశాల కుట్రలను ఎదిరించి తాను ఎంచుకున్న మార్గంలో పురోగమించటంలో మరొక దేశానికి పోటీ కాదు, పోటీ లేదు. అణుబాంబు పథకం నుంచి సోవియట్ అర్థాంతరంగా తప్పుకున్నప్పటికీ తొలి పది సంవత్సరాల్లోనే అణుబాంబును రూపొందించింది. అంతరిక్ష రంగంలో పరిశోధన లకు సోవియట్, తరువాత రష్యా మనకు అందించినమేరకు కూడా చైనాకు ఇవ్వలేదు. అమెరికా సంగతి చెప్పనవసరం లేదు, అది అడ్డుకున్నప్పటికీ విఫలమైంది. స్వంతంగా చైనా చంద్రుడు, అంగారకుడి మీదకు నౌకలను పంపటంతో పాటు స్పేస్ స్టేషన్ నిర్మాణం కూడా చేస్తున్నది. కృత్రిమ మేథలో సవాలు విసురుతున్నది. అందువలన కుక్కకాటుకు చెప్పుదెబ్బ మాదిరి ఇప్పుడు టెక్‌వార్‌లో అమెరికా దాని మిత్ర దేశాల కుట్రలను అధిగమించి స్వావలంబన సాధించనుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

నేడున్నది మతోన్మాద దేశభక్తి... హిందూత్వ జాతీయవాదం

ప్రముఖ గ్రామీణ జర్నలిస్టు, అవార్డు గ్రహీత పాలగుమ్మి సాయినాథ్ ఇటీవలి రచన "ద లాస్ట్ హీరోస్:ఫూట్ సోల్జర్స్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడం" భారతదేశ విముక్తి కోసం పోరాడిన సాధారణ ప్రజల అసాధారణ జ్ఞాపకాలని చెప్పవచ్చు. వీరి త్యాగాలు చరిత్ర పుస్తకాల్లో ఎక్కడా నమోదు చేయబడలేదు. వారి వాస్తవ గాథలు చెప్పకోడానికి చోటు కల్పించడం ద్వారా ఈ పుస్తకం భారత స్వాతంత్ర్యపోరాటంలో అధికార పత్రాల ధృవీకరణలోని ఖాళీలని పూరిస్తుంది. "పీపుల్స్ ఆర్చివ్ ఆఫ్ రూరల్ ఇండియా" (పీఏఆర్ఐ)కు సంస్థాపక సంపాదకుడైన సాయినాథ్ రానున్న ఐదు సంవత్సరాల కాలంలో తమ అనుభవాలను చెప్పేందుకు ఒక్క స్వాతంత్ర్యసమరయోధుడు కూడా బతికి ఉండడని చెప్పారు. భావజాలాలు, నాయకత్వాలలో ఉండే వైరుధ్యాలు, అణగారిన వర్గాల ప్రజలపై బ్రిటిష్ వారు సాగించిన దారుణ అకృత్యాలు, స్వాతంత్ర్యోద్యమానికి ఆదివాసీలు, దళితులు అందించిన సేవలను సాయినాథ్ తన రచనలో నమోదు చేశారు. "ఈ గాథలు వివిధ ప్రాంతాల, సంస్కృతుల, నేపథ్యాల నుండి ఉన్నాయి. ఈ మహోన్నత పోరాటంలో స్వాతంత్ర్యం సాధించాలనే తపన, కోర్కెలు ఎంత గాఢంగా ఉన్నాయో ఈ వాస్తవ గాథలు తెలియజేస్తాయని "భగత్ సింగ్ మేనల్లుడైన ప్రొఫెసర్ జగ్మోహన్ తన ముందుమాటలో చెప్పారు. ఈ రచనకు సంబంధించి **సాయినాథ్ "ఫ్రంట్ లైన్"**తో మాట్లాడిన విషయాలు...



ఫ్రంట్‌లైన్:- మీరు భారతదేశ వ్యవసాయరంగ సంక్షోభం గురించి కథనాలు నివేదించడం ప్రారంభించడానికి ముందు నుంచి అంటే మీరు విద్యార్థిగా, వృత్తిపరమైన బాధ్యతల్లో ఉన్నప్పటి నుండి కూడా భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆసక్తిగా ఉంటున్నారు. ఈ పుస్తకాన్ని ప్రచురించాలని ఎందుకు నిర్ణయించుకున్నారు?

సాయినాథ్:- "ద టైమ్స్ ఆఫ్ ఇండియా"లో 1997లో "ఫర్గాటెన్ ఫ్రీడమ్స్" పేరుతో వరుస కథనాలు చేసేనాటికే అది మొదలైంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పెద్ద తిరుగుబాట్లు జరిగిన ఐదు గ్రామాలను సందర్శించిన తరువాతే నేను ఆ వ్యాసాలు రాశాను. 2002లో "ద హిందూ"లో వరుస కథనాల ద్వారా వ్యక్తుల వాస్తవ గాథలను రాయడం మొదలు పెట్టాను. ఇది, వాటిని గ్రంథస్తం చేయాలనే ఆలోచనకు దారి తీసింది. వ్యవసాయ సంక్షోభం స్వాతంత్ర్య సమరయోధులపై చేస్తున్న పనికి అడ్డుపడింది. కాబట్టి దానితోపాటే పరిశోధన చేశాను. కానీ వ్యవసాయ సంక్షోభం మరింత దారుణంగా పెరిగిపోతుంది కాబట్టి ఆ కథనాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సివచ్చింది.

జైలు జీవితం గడిపిన ఇతర కుటుంబ సభ్యులు, మా తాతయ్య (మాజీ రాష్ట్రపతి వీ.వీ.గిరి) గురించి మా అమ్మతో పాటు అనేక మంది చెప్పిన కథల్ని వింటూ పెరిగాను. మా తాతయ్యను సందర్శించడానికి వచ్చే విభిన్న సామాజిక వర్గాలకు, నేపథ్యాలకు చెందిన ప్రజలను నేను గమనించేవాడ్ని. ఇలాంటి ప్రజలే మనకు స్వాతంత్ర్యం సాధించిపెట్టారని (వారు వెళ్ళిపోయిన తరువాత) ఆయన నాకు చెప్పేవారు.

ఇంత అత్యవసరంగా 2022లోనే (నవంబర్ 30,2022లో పుస్తకావిష్కరణ జరిగింది) ఈ పుస్తకం తీసుకొని రావడంలో ఉన్న ఉద్దేశ్యమేమంటే, సెప్టెంబర్ 2021 నుండి ఈ పుస్తకంలో (పాత్రధారులు) ఉదహరించబడిన వ్యక్తులు ఏడుగురు మరణించారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ 2022లో ఈ పుస్తకం రావాలి. ఈ పుస్తకంలో ఉదహరించబడిన అనేకమంది వ్యక్తులు వారి వాస్తవ గాథల్ని చూసుకోవాలనుకున్నారు. వారి కోసం నేను ఆ పని చేయాలనే పట్టుదల నాలో ఏర్పడింది.

ఫ్రంట్‌లైన్:- మీరు వ్యవసాయ సంక్షోభానికి సంబంధించి పని చేసినప్పుడు, వ్యవసాయసంక్షోభ గాథలు తీసుకొన్న ప్రాంతాలకు చెందిన, వ్యవసాయరంగానికి చెందిన, స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రజల కోసం మీరు చూశారా?

సాయినాథ్:- దేశంలో నాకు తెలిసిన ప్రధానమైన తిరుగుబాట్లు జరిగిన ప్రాంతాల్లో, స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములైన స్త్రీ పురుషుల కోసం నేను చూశాను. అంతేకాకుండా, అప్పటికే నేను దశాబ్ద కాలానికి పైగా ఒక గ్రామీణ రిపోర్టర్‌గా పని చేస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో నేను జర్నలిస్టులతో పాటు ఇతర సంబంధాలు కూడా కలిగి ఉన్నాను. '1857 తిరుగుబాటు' వ్యవసాయ సంక్షోభం కారణంగానే ఉత్పన్నమైంది. ఒక చరిత్ర విద్యార్థిగా నాకున్న నేపథ్యం వల్ల మంచి దృష్టికోణాన్ని కలిగి ఉన్నాను. నాకు భూమి సంబంధాలు, భూస్వాములు, రైతుల మధ్య ఉండే సంబంధాల గురించి కొంతవరకు తెలుసు. ఈ పుస్తకంలో ఉదహరించబడిన ప్రతీ ఒక్కరూ గ్రామాల్నుంచి వచ్చినవారే.

ఫ్రంట్ లైన్:- ఈ పుస్తకం రచించడంలో మీ లక్ష్యం ఏమిటి?

సాయినాథ్:- దీనిలో ఉదాహరించిన ప్రజల కోసమే నేనీ పుస్తకాన్ని రచించాను. 1947 తరువాత పుట్టిన మాలాంటి తరానికి మా జీవితాల్ని సరియైన రీతిలో రూపుదిద్దుకోవడానికి వారి గాథలు అవసరం. మేము ఎక్కడి నుండి వచ్చామో మాకు తెలియకపోతే, మేమెక్కడికి వెళ్తున్నామో కూడా మాకు తెలియదు. 17-25 సంవత్సరాల మధ్య వయస్సున్న వారే ఎక్కువగా చదువుతారనే విషయం ఇంతకు ముందు నా పుస్తకం ద్వారా పొందిన అనుభవం చెపుతుంది. నేను "ద లాస్ట్ హీరోస్"ను వారివైపే గురి పెట్టాను.వారి చరిత్రను, వారి కథలను, స్వాతంత్ర్యపోరాటంలో జరిగిన సంఘటనలు అన్నింటినీ దోచుకుంటున్నారు.

ఆజాదీ కా అమృత మహోత్సవ్ అనే ఒక ప్రభుత్వ వెబ్‌సైట్ ఉంది. ఈ వెబ్‌సైట్‌లో ఒక్క ఫొటో గానీ, వీడియో గానీ, జీవించి ఉన్న ఒక్క స్వాతంత్ర్య సమరయోధుని గురించి ఎలాంటి సమాచారం ఉండక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. దానిలో నరేంద్ర మోడీ ఫొటోలు, వీడియోలు ఉంటాయి. మోడీని ఒక స్వాతంత్ర్య సమరయోధునిగా భావించుకుంటున్నందుకు ఒక టీనేజ్ పిల్లవాడ్ని క్షమిస్తాం కానీ, దీనిని విశ్వసించే ప్రజానీకం కూడా ఉన్నారు. బ్రిటిష్ వలసవాదం గురించి, అది మనకు ఏమి చేసిందనే విషయం గురించి ఒక్క పేరా కూడా లేకపోవడం నన్నెంతో బాధించింది.మీరిది తెలుసుకోకుంటే, స్వాతంత్ర్యపోరాటం, స్వాతంత్ర్యం గురించి ఏమి తెలుసుకుంటారు?

ఫ్రంట్‌లైన్:- డెబ్భైఐదు సంవత్సరాల తరువాత కూడా ఒక స్వతంత్ర దేశంలో ఇప్పటికీ పేదరికంలో ఉన్నాం. "భూమి, భుక్తి, విముక్తి" పిలుపు ఇంకా తన ప్రాసంగితను కోల్పోలేదు. దీనిపై మీ ఆలోచనలు ఏంటి?

సాయినాథ్:- బ్రిటిష్ వలసవాదం 31కరువుల్ని తెచ్చిపెట్టిన కారణంగా అదనంగా 160-168 మిలియన్ల మరణాలు సంభవించాయన్న అంచనా ప్రజలకు తెలియదు. ఒకవేళ అదే ఒక యూరోపియన్ దేశంలో ఆ మరణాల్లో ఒకశాతం సంభవించినా, దానిని "జాతి సంహారం" అని ఉండేవారు. రెండు వందల సంవత్సరాల బ్రిటిష్ వలసవాదం భారతదేశంలో 44.6 ట్రిలియన్ డాలర్లు లూటీ చేసిందని ప్రముఖ ఆర్థికవేత్త ఉత్సాపట్నాయక్ అంచనా వేశారు.

మన దేశాభివృద్ధి సమస్యలు ఎక్కడి నుండి వస్తున్నాయో మీకు అర్థమై ఉండాలి. బ్రిటిష్ రాజ్యంలోని పెద్ద పెద్ద సమస్యల అనుకరణ కొనసాగుతున్నాయి. ఫోర్బ్స్ జాబితాలోని బిలియనీర్లలో భారతీయులు ఉన్నత స్థానాన్ని ఆక్రమించారు. 1920 నుంచి ఎన్నడూ చూడని విధంగా, నేడు మనం ఆశ్చర్యకరమైన అసమానతల స్థాయిని గమనిస్తున్నాం. గ్రామీణ పేదల సమస్యలు ఇంకా సమస్యలుగానే మిగిలి ఉన్నాయి. భయానకమైన వాతావరణ మార్పు కాలంలో అవి మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి.

ఫ్రంట్‌లైన్:- మహాత్మాగాంధీ, బి.ఆర్.అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్‌లు మీ అనేక పాత్రధారుల జీవితాల్లో ప్రధానమైన వ్యక్తులు. వారు, వారి నాయకులను కలిసినప్పటి సంగతులు చెప్తారా?

సాయినాథ్:- ఈ పుస్తక రచన సాగినంత కాలం నేను గమనించింది ఏమంటే, పోరాట కాలంలో గాంధీ స్థానం చాలా ప్రత్యేకంగా ఉండేది. ఉదాహరణకు థేలూ, లోఖీ మహతోలు గాంధీ, నేతాజీతో పాటు వారి స్థానిక ప్రాంతాలకు చెందిన చంబల్ బందిపోట్లకు వారు అంకితమయ్యారు. ఈ ముగ్గురిని ఆరాధించడంలో వారు ఎలాంటి వైరుధ్యాలను చూడలేదు.

గాంధీజీ మనుషుల్లో మంచిని మాత్రమే చూడాలని ప్రజలను కోరే మానవతా మూర్తి అనీ, థేలూ, లోఖీలు దానినే అనుసరించారు. అదే సమయంలో వారు పోలీస్ స్టేషన్లపై దాడికి పథకాలను కూడా రచించారు. "నేను గాంధీ, అంబేద్కర్‌లలో ఒకర్ని ఎంపిక చేసుకోవాలా? గాంధీలో, అంబేద్కర్‌లలో నాకు ఇష్టమైతే దాన్నే అనుసరిస్తానని" శోభారామ్ తన కథలో చెప్పారు.

ఫ్రంట్‌లైన్:- స్వాతంత్ర్యపోరాటంలో సహాయక పాత్ర పోషించిన సాలిహాన్ లేదా పురూలియాకు చెందిన భాబాని మహతో లాంటి మహిళల్ని తీసుకొనిరావడం ద్వారా 'స్వాతంత్ర్య సమరయోధుని' నిర్వచనాన్ని ప్రశ్నించారు గదా మీరు?

సాయినాథ్:- స్వాతంత్ర్యసమరయోధుని గుర్తించడమెలా అనే భావనను "ద లాస్ట్ హీరోస్" రచన సవాల్ చేస్తుంది. దానిలో వంట చేసేవారు, ఇంటిపనివారు, కొరియర్లు, రైతులు, కార్మికులు అందరు ఉంటారు. ఈ సాధారణ ప్రజలకు మనం గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉంది. పోరాటాన్ని ముందుకు నడిపించిన వారిలో మహిళలు ఉన్నారనే విషయాన్ని మనం తెలియజేయాలి. పోరాటంలో భాగస్వామ్యానికి పనికిమాలిన నిర్వచనాలిచ్చి, మహిళల్ని దాని నుండి మినహాయించారు.

నిర్బంధంలో ఉన్న విప్లవకారులకు వార్తలను చేరవేయడానికి చెక్కపెట్టెనుపయోగించి అర్ధరాత్రి నదిని దాటిన హౌసాబాయి గురించి ప్రజలు తెలుసుకోవాల్సి నవసరం ఉంది. "ద స్వతంత్ర సైనిక్ సమ్మాన్ పెన్షన్ స్కీమ్", "వితంతువు" గురించి మాట్లాడుతుంది. స్వాతంత్ర్యసమరయోధుడు అంటే ఎప్పటికీ పురుషుడే అని వారు భావిస్తున్నారు, కానీ ఆ యోధుల్లో మహిళలను చేర్చడం నాకు చాలా ముఖ్యం.

ఫ్రంట్‌లైన్:- స్వాతంత్ర్యోద్యమ వాస్తవ కథనం మారుతుండడం మీరు చూస్తున్నారా?

సాయినాథ్:- నేడు మీరు చూస్తున్న జాతీయవాదం వాస్తవానికి హిందూ జాతీయవాదం. గాంధీ, మండేలాలు ఇలానే ఉన్నారా? ఇది మతోన్మాద దేశభక్తి, దురభిమాన పూరిత దేశభక్తి, హిందూత్వ జాతీయ వాదం. జాతీయవాదాన్ని నిర్వచిస్తూ, ప్రసంగాల్లో అధికారాన్ని ప్రదర్శిస్తున్న వారెవరూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్రను పోషించలేదు. వారు దేశాన్ని తిరోగమన దిశకు తీసుకొనిపోతున్నారు.

("ఫ్రంట్ లైన్" సౌజన్యంతో)
అనువాదం బోడపట్ల రవీందర్, 9848412451

కేరళలో వివాదంగా మారిన ఆర్ఎస్ఎస్ - జమాతే చర్చలు!

ప్రస్తుతం మన దేశంలో ఆర్ఎస్ఎస్‌కు ఏదీ అసాధ్యం కాదు. గుర్రం, ఏనుగులను కూడా ఎగిరేట్లు, తాబేళ్లను పరుగెట్టేట్లు చేయగలదు. అలాంటిది ముస్లిం సంస్థలను తమదారికి తెచ్చుకోవటం అసాధ్యమా? కొద్ది వారాల క్రితం ఢిల్లీలో ఆర్ఎస్ఎస్‌తో కొన్ని ముస్లిం సంస్థల ప్రతినిధుల సమావేశం ఇప్పుడు కేరళలో వేడిపుట్టిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం కేరళ పట్ల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా అక్కడి సీపీఐ(ఎం) ఫిబ్రవరి 21 నుంచి నెల రోజులు సాగే జాతాను కోజికోడ్‌లో సిఎం పినరయి విజయన్ ప్రారంభించారు. ఆ సందర్భంగా సిఎం ముస్లింలను బుజ్జగించేందుకు చూసినట్లు బీజేపీ ధ్వజమెత్తింది. అంతకు ముందే ఆర్ఎస్ఎస్‌తో కేరళకు చెందిన జమాయతే ఇస్లామిక్ హింద్ సంస్థ ప్రతినిధులు దేన్ని గురించి చర్చించారో చెప్పాలంటూ పినరయి విజయన్ లేవనెత్తిన ప్రశ్న అంతర్మథనంలో పడేసింది. దాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ ఎదురుదాడికి పూనుకుంది. సదరు సమావేశం గురించి ఇంతవరకు ఆర్ఎస్ఎస్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. తమంత తాముగా వెళ్లి కలవలేదని ఆర్ఎస్ఎస్ ఆహ్వానం మేరకు వెళ్లినట్లు జమాతే వివరణ ఇచ్చుకుంది. అది వాస్తవం కాదని వార్తలు చెబుతున్నాయి.

జమాతే సంస్థ ప్రధాన కార్యదర్శి టి ఆరిఫ్ జనవరిలో ఆర్ఎస్ఎస్‌తో జరిపిన చర్చల గురించి వెల్లడించారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్న మూక వధలు, అట్టడుగున ఉన్న తరగతుల అణచివేత అంశాలను చర్చించినట్లు పేర్కొన్నారు. ఇది జమాతే వంచన తప్ప మరొకటి కాదని విజయన్ ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నారు. "ఆర్ఎస్ఎస్‌తో విభేదించే అంశాలున్నప్పటికీ చర్చలు జరపాల్సి ఉందని జమాతే చెప్పటం దాని వంచనను వెల్లడిస్తున్నది. ఏమి చర్చించారో, సమావేశం ఏ అంశం మీద జరిగిందో వివరించాలి. జమాతే తర్కం ప్రకారం ఆర్ఎస్ఎస్ ఒక సంస్థ, చర్చల ద్వారా దాన్ని సంస్కరించవచ్చు, మార్చవచ్చు. ఇదెలా అంటే తోడేలు మచ్చలను నీటితో కడిగి పోగొట్టవచ్చు అన్నట్లుగా ఉంది. భారత్‌లోని మైనారిటీలు ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యలను దేశ యంత్రాంగాన్ని అదుపు చేస్తున్న ఆర్ఎస్ఎస్ ముందుంచుతామన్న వాదన చేస్తున్న జమాతేకు అసలు దేశ మైనారిటీల ప్రతినిధిగా ఎవరు అధికారమిచ్చారు. ఏ అంశం గురించి చర్చించినప్పటికీ అది దేశంలోని మైనారిటీలకు సాయపడదు. మైనారిటీల రక్షణ అంటే మత స్వేచ్ఛకు రక్షణ. దాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదెవరో చర్చల్లో పాల్గొన్నవారికి తెలియదా? అలాంటి వారితో చర్చించి లౌకికవాదాన్ని, మైనారిటీలను ఎలా రక్షించగలం? సంఘ పరివార్ తీవ్రవాద హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా నేడు దేశంలోని లౌకిక శక్తులు పోరాడుతున్నాయి. ఇటువంటి దశలో అలాంటి చర్చలు ఆర్ఎస్ఎస్ అజెండాకు మద్దతు ఇస్తాయి. మతశక్తులు కుమ్మక్కై ఐక్యంగా లౌకికవాదాన్ని, ప్రజాస్వామిక విలువలను అణచివేస్తున్నాయ నేందుకు ఇంతకంటే రుజువు అవసరం లేదు. లౌకిక శక్తులకు ఇదొక సవాలు" అని విజయన్ పేర్కొన్నారు. జమాతే వైఖరిని కేరళలోని కేరళ ముస్లిం జమాత్, సమస్త కేరళ జమైతుల్ ఉలేమా, ముస్లిం లీగ్, కేరళ నదవతుల్ ముజాహిదీన్, సున్నీ యువజన సంఘం విమర్శించాయి.

ఆర్ఎస్ఎస్‌కు భయపడి దానితో సఖ్యత కోరుకుంటున్నట్లు స్వార్థ ప్రయోజనాలున్నట్లు కొందరు జమాతేను విమర్శించారు. స్నేహపూర్వక చర్చల ద్వారా జమాతే చారిత్రక తప్పిదం చేసిందని కేరళ ముస్లిం జమాత్ కాంతాపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చెప్పారు. ఆర్ఎస్ఎస్ భారత్‌కు, దేశ లౌకిక విలువలకు శత్రువని అటువంటి సంస్థతో చర్చలు శత్రువును కౌగలించుకోవటంతో సమానమని ముస్లిం జమాత్ పేర్కొన్నది. మతవాదం ఈ రెండు బృందాలను ముడివేస్తున్నది. భారత వ్యతిరేక ఫాసిస్టు శక్తుల నిజరూపాన్ని కప్పి పుచ్చేందుకు జమాతే ఇస్లామీ హింద్ ఒక పనిముట్టుగా మారుతున్నది" అని విమర్శించింది. ఆర్ఎస్ఎస్‌తో చర్చించాల్సినంత



ప్రత్యేక పరిస్థితులేమీ లేవని ముస్లింలీగ్ నేతలు పికె కున్హాలీకుట్టి, ఎంకె మునీర్ పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్-జమాతే ఇస్లామీ హింద్ ప్రతినిధుల చర్చలు వెల్ఫేర్ పార్టీ బుర్రలో పుట్టిన ఆలోచనకాదా అని సిఎం విజయన్ కోజికోడ్ సభలో విమర్శించారు. కాంగ్రెస్‌లోని కొంత మంది ఆర్ఎస్ఎస్ పట్ల సానుకూల వైఖరితో ఉంటారు. వెల్ఫేర్ పార్టీ, జమాతే పట్ల ముస్లింలీగ్‌లోని కొందరు అదే విధంగా ఉంటారని, అందువలన ఆ మూడు పార్టీల మధ్య ఉన్న ప్రత్యేక బంధం ఏమిటో చర్చల గురించి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి కేరళ అభివృద్ధి పట్టదు, ప్రతిపక్ష కూటమి మౌనంగా ఉంటుంది, కేంద్రం మీద ఒక్క మాట కూడా మాట్లాడదు అన్నారు. ఈ సభలో సిఎం పినరయి విజయన్ ప్రస్తావించిన మూడు సార్ల తలాక్ అంశంపై బీజేపీ, కొన్ని మీడియా సంస్థలు వక్రీకరణలకు పూను కున్నాయి. మూడు సార్లు తలాక్ చెప్పి భార్యను వదలి వేయటానికి సీపీఐ(ఎం) వ్యతిరేకం అన్న సంగతి తెలిసిందే. అది చెల్లదని సుప్రీం కోర్టు కూడా చెప్పింది కనుక దాని మీద వేరే చట్టం అవసరం లేదన్నది సీపీఐ(ఎం) వైఖరి. అందువలన దాని మీద చట్టం చేసేందుకు ఆర్డినెన్స్ జారీ చేయటాన్ని సీపీఐ(ఎం) ఖండించింది. తరువాత పార్లమెంటు బిల్లును ఆమోదించింది. దాని ప్రకారం అలా ఎవరైనా విడాకులు తీసుకుంటే మూడు సంవత్సరాల వరకు శిక్ష వేయవచ్చు. ఇతర మతాలకు చెందిన వారి విడాకుల వివాదాన్ని సివిల్ కేసులుగా పరిగణించి ముస్లిం పట్ల క్రిమినల్ కేసుగా పరిగణించటాన్ని మాత్రమే సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది తప్ప మూడుసార్ల తలాక్‌ను సమర్థించలేదు. సిఎం పినరయి విజయన్ దాన్నే చెప్పారు తప్ప ముస్లింలను సంతుష్టీకరించలేదు.

ఖురాన్‌లో మూడుసార్లు తలాక్ అనే పద్ధతే లేదని చెబుతున్నారు. అనేక దేశాల్లో అది లేని మాట నిజం. ఖురాన్‌లోని లేని దాని మీద మరి కేంద్ర ప్రభుత్వం ఎందుకు చట్టం చేసినట్లు? అన్ని మతాల్లో అనేక అంశాలను కొత్తగా చొప్పించినట్లుగా మూడు సార్లు తలాక్ అనేదాన్ని కూడా చొప్పించారు. దాన్ని ఎవరూ సమర్థించటం లేదు. వేదకాలంలో కులాలు లేవని చెబుతారు, చేసే వృత్తిని బట్టి కులం అన్నారు అంటారు. ఇప్పుడు కులవృత్తులు లేకున్నా, సదరు వృత్తులు చేయకున్నా అదే కులాలతో పిలుస్తున్నారు, కించపరుస్తున్నారు. ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భగవత్ సెలవిచ్చినట్లుగా కులాలను సృష్టించింది పండితులు (బ్రాహ్మలు కాదు మేధావులని తరువాత వివరణ ఇచ్చుకున్నారు) అన్నదాని ప్రకారం ఉనికిలో ఉన్న కులాలను ఏం చేస్తారో కూడా చెప్పాలి కదా! వాటి గురించి ఎందుకు మాట్లాడటం లేదు. వాటి మీద చట్టాలను ఎందుకు చేయటం లేదు. కులాలను, వివక్షను, కొందరిని కించపరిచే వాటిని సమర్థించే మనుస్మృతి, ఇతర పురాణాలను సమర్థించటాన్ని క్రిమినల్ నేరంగా పరిగణిస్తారా? వాటిని ప్రచురించి ప్రచారం చేసే వారి మీద ఎలాంటి చర్యలు తీసుకుంటారు? సీపీఐ(ఎం) ప్రారంభిం చిన నెల రోజుల యాత్రలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని జనం ముందుకు తీసుకు వెళుతున్నారు. వివిధ అంశాలను ప్రస్తావిస్తున్నారు.

- సత్య

> మూడు సార్లు తలాక్ చెప్పి భార్యను వదలి వేయటానికి సీపీఐ(ఎం) వ్యతిరేకం అన్న సంగతి తెలిసిందే. అది చెల్లదని సుప్రీం కోర్టు కూడా చెప్పింది కనుక దాని మీద వేరే చట్టం అవసరం లేదన్నది సీపీఐ(ఎం) వైఖరి. అందువలన దాని మీద చట్టం చేసేందుకు ఆర్డినెన్స్ జారీ చేయటాన్ని సీపీఐ(ఎం) ఖండించింది. తరువాత పార్లమెంటు బిల్లును ఆమోదించింది. దాని ప్రకారం అలా ఎవరైనా విడాకులు తీసుకుంటే మూడు సంవత్సరాల వరకు శిక్ష వేయవచ్చు. ఇతర మతాలకు చెందిన వారి విడాకుల వివాదాన్ని సివిల్ కేసులుగా పరిగణించి ముస్లిం పట్ల క్రిమినల్ కేసుగా పరిగణించటాన్ని మాత్రమే సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తున్నది తప్ప మూడుసార్ల తలాక్‌ను సమర్థించలేదు. సిఎం పినరయి విజయన్ దాన్నే చెప్పారు తప్ప ముస్లింలను సంతుష్టీకరించలేదు.



'బండి' హామీల్లో సమాధానంలేని ప్రశ్నలెన్నో!?

'అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యం అందిస్తాం.' ప్రతి సమావేశంలోనూ బీజేపీ ఇస్తున్న ప్రధాన హామీ ఇది. ప్రజాసంగ్రామ యాత్ర సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇచ్చిన హామీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఇప్పటికే అధిష్టానం కింది స్థాయి క్యాడర్‌ను ఆదేశించింది. విద్య, వైద్యం ఉచితంగా అందితే ఒక కుటుంబానికి నెలకు ఏ స్థాయిలో డబ్బులు మిగులుతాయో కూడా వివరించాలని చెప్పింది. హామీ సరే... మరి దీనిని ఎలా అమలు చేస్తారో విడమరిచి చెప్పేందుకు పార్టీ సిద్ధం కావడం లేదు. ఎందుకంటే దానిపై ఆ పార్టీ దగ్గరే సరైన ప్రణాళిక లేనట్టు అర్థమవుతున్నది.

ప్రస్తుతం రాష్ట్రంలో అనేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. వాటన్నింటిలో విద్య ఉచితంగానే అందుతున్నది. ఆలస్యమవుతున్నా... ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ లాంటి స్కీమ్స్ కొనసాగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం తల్లిదండ్రులు ఛాయిస్ ప్రకారమే ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను ఎంపిక చేసుకుంటున్నారు. టీచర్ల కొరత, సౌకర్యాల లేమి అంశాలలో కొన్ని లోటుపాట్లు ఉన్నప్పటికీ ప్రస్తుతానికి పర్వాలేదు. దీనిని పరిగణనలోకి తీసుకోకుంటే ఉచిత విద్య కావాలనుకున్న వాళ్లు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించుకునే వీలుంది. అయితే ఇప్పుడు బీజేపీ ఇస్తున్న ఉచిత విద్య హామీ అమలు ఎలా చేస్తారోననే సందేహం అందరిలో ఉన్నది. ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలన్నింటినీ ప్రభుత్వ ఆధీనంలో తీసుకుంటారా? ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల సంఖ్యను పెంచేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తారా? లేకుంటే తల్లిదండ్రులకే ఛాయిస్‌ను విడిచిపెట్టి ప్రయివేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివించిన వారికి ఫీజును పూర్తిస్థాయిలో ప్రభుత్వమే కడుతుందా? ఇవన్నీ సమాధానంలేని ప్రశ్నలే.

ఆరోగ్యానికి ఆయుష్మానే మందా?

ఉచిత వైద్యాన్ని ఎలా అందిస్తారనేది కూడా మిలియన్ డాలర్ల ప్రశ్నే. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకొని సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే 50 నుంచి 70శాతం బిల్లును ప్రభుత్వం సంబంధిత వ్యక్తులకు చెల్లిస్తున్నది. అయితే బీజేపీ ఇస్తామన్న ఉచిత వైద్యం ఎలాంటిదనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ప్రయివేటు హాస్పిటల్స్ అని తమ ఆధీనంలోకి తీసుకొని, వాటిని ప్రభుత్వ ఆస్పత్రులుగా మార్చేస్తారా? లేకపోతే ఏదైనా ప్రత్యేక ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ఉపయోగించి అందరికీ ఆరోగ్య బీమా చేయించి... రోగాలు వచ్చి ట్రీట్‌మెంట్ చేయించుకుంటే వాటికి బిల్లులు చెల్లిస్తారా? లేకపోతే సర్వ రోగాలకు సవాలక్ష నిబంధనలున్న ఆయుష్మాన్ భారత్‌ను నివారిణిగా చూపిస్తారా? ఇవి కూడా బీజేపీ చెప్పడానికి ఇష్టపడని ప్రశ్నలు.

జీహెచ్ఎంసీ 'కొత్త వాహనం' హామీలాగేనా..!

జీహెచ్ఎంసీ ఎలక్షన్ కంటే ముందు హైదరాబాద్‌లో వరదలు వచ్చాయి. వేలాది వాహనాలు ఆ వరదల్లో కొట్టుకుపోయాయి. అయితే జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో బండి సంజయ్ ఒక హామీ ఇచ్చారు. బీజేపీ గెలిస్తే వరదల్లో కొట్టుకుపోయిన, దెబ్బతిన్న వాహనాలకు బదులు ఆ యజమానులకు కొత్త వాహనాలను కొనిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ హామీపై విడమరిచి చెప్పి నవ్వుల పాలయ్యారు. వాహనాలకు ఉన్న ఇన్సూరెన్స్‌ను ఇప్పిస్తామని చెప్పారు. బండి సంజయ్ నోటి వెంట వచ్చిన ఉచిత విద్య, వైద్యం హామీ కూడా సేమ్ అలాగే ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఉచితాలకు వ్యతిరేకమని చెబుతూనే...

తెలంగాణలో అధికారం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ నోటికొచ్చిన హామీలు ఇస్తున్నా... వాటిని ఎలా అమలు చేస్తామని మాత్రం ప్రజలకు వివరించలేకపోతున్నది. అంతేకాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలవుతున్నా హామీలను కొనసాగిస్తామని చెబుతున్నా... వాటికి బడ్జెట్ ఎక్కడి నుంచి వస్తుందో చెప్పలేకపోతున్నది. ఇప్పటికే వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించాలని రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నది. అయితే ఇప్పటికే రాష్ట్రంలో వ్యవసాయానికి అందుతున్న ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తుందా లేదా అన్నది రాష్ట్ర యూనిట్ చెప్పలేకపోతున్నది. రుణమాఫీ గురించి అసలు మాట్లాడడానికే ఆ పార్టీ ఇష్టపడదు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీ కేంద్ర నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఎనిమిదిన్నరేండ్లు గడుస్తున్నా ఆ హామీ జోలికే వెళ్లడం లేదు.

ఊహాజనిత అధికారం!

అధికారంలోకి వస్తామని మభ్యపెడుతూ బీజేపీ రాష్ట్రనాయకత్వం కార్యకర్తలతో పని చేయించుకుంటుంది. రాష్ట్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాదని కేంద్ర నాయకత్వానికి తెలిసినా... ఇప్పటికి ఉన్న నాలుగు ఎంపీ సీట్ల సంఖ్య ఆరుకు పెరగొచ్చనే అంచనాతోనే రాష్ట్రంపై కాన్సెంట్రేషన్ పెంచింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో దాదాపు సగానికి పైగా సెగ్మెంట్లలో బీజేపీకి అభ్యర్థులే లేరనే విషయం బహిరంగ రహస్యమే. బీజేపీకి ఎంపీలున్న నాలుగు పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలో 28 అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో పార్టీ ఎన్ని గెలవచ్చో కచ్చితంగా చెప్పే వారు కూడా లేరు.



ఫిరోజ్ ఖాన్
9640466464

నవతెలంగాణ
5 ఖమ్మం
శనివారం 25 ఫిబ్రవరి 2023
www.praja.khammam@gmail.com

కంటి వెలుగు పథకం దేశానికి ఆదర్శం

రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధి రెడ్డి



నవతెలంగాణ- వేంసూరు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశానికి ఆదర్శంగా ఉందని రాజ్య సభ సభ్యుడు బండి పార్థసారధి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్న పిల్లల నుండి వృద్దుల వరకు కంటి సమస్యలు లేకుండా చేయడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా సిఎం కేసిఆర్ అన్ని వర్గాల ప్రజలకోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఇప్పటికే కేరళ, ఢిల్లీ, సిఎంలు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీ రమేష్, ఈఓఆర్డి రంజిత్ కుమార్, సర్పంచ్ బూరుగు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సజ్జ రాజగోపాల్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు చావా అప్పారావు మృతి

తమ్మినేని వీరభద్రం నివాళి



నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని మోటా పురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నేత చావా అప్పారావు(78) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్, సిపిఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు హుటాహుటిన ముటాపురం చేరుకొని అప్పారావు భౌతిక కాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ అప్పారావు పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఆయన మరణం పార్టీ అభివృద్ధికి తీరని లోటు అన్నారు. పార్టీ అభివృద్ధికి అప్పారావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి.రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, తోటకూరి రాజశేఖర్, ఇంటూరి అశోక్, బెల్లం లక్ష్మి, ఏలూరి రంగారావు, గుగులోతు వీరు నాయక్, గ్రామస్తులు నున్న రవికుమార్, గుడిమళ్ల మధు, చావా అజయ్, చావా కిరణ్, చావ లెనిన్, ఏలూరి రామారావు తదితరులు ఉన్నారు.

మోడీ పాలనలో అవినీతికి చట్టబద్ధం

నవతెలంగాణ-పెనుబల్లి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం చలమాల సూర్యనారాయణ భవనంలో మండల సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ మోడీ పాలనలో చట్టబద్ధమైన అవినీతి నడుస్తుందని 75 ఏండ్ల ప్రజాస్వామ్య భారత వనిలో బిజెపి 8 ఏళ్ల పాలనలో అత్యంత అవినీతి, ఆర్థిక నేరాలు వెలుగు చూశాయని అన్నారు. కార్పొరేట్ దోపిడీ, మతతత్వాన్ని డబల్ ఇంజన్‌గా చేసుకొని బిజెపి పాలన సాగిస్తుందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్ లు మాట్లాడుతూ కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేదల జీవనోపాధిని దెబ్బతీసే అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలులో అలసత్వం ఉందని దానిని వదిలించుకోకపోతే ప్రజా వ్యతిరేకత చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చలమాల విట్టల్ రావు, రైతు సంఘం ఉపాధ్యక్షులు కొప్పుల వెంకటేశ్వరరావు, సిఐటియూ మండల కన్వీనర్ చీపు వెంకటేశ్వరరావు, బెజవాడ సాయి శేషు, కండె సత్యం, మామిళ్ళ సోమయ్య, బాజీ గుడిమెట్ల బాబు, వర్ధిపోయిన రాంబాబు, పాల్గొన్నారు.

పల్లె నుండి ప్రపంచ స్థాయికి ఎదిగిన క్రీడాకారిణి

ప్రపంచ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-ఎర్రుపాలెం

పల్లె నుండి ప్రపంచ స్థాయి కబడ్డీ పోటీలకు యరమల యజ్ఞితా రెడ్డి తన ప్రతిభను కనపరచి అవకాశాన్ని తన సొంతం చేసుకుంది. ఎర్రుపాలెం మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన యరమల శ్రీనివాస రెడ్డి, విజయ నిర్మల దంపతుల పెద్ద కుమార్తె యజ్ఞితా రెడ్డి చిన్న తనం నుండి కబడ్డీపై ఆసక్తి కనబరుస్తూ ఒకటి నుండి 8 తరగతి వరకు బనిగండ్లపాడు పాఠశాల నందు విద్యను అభ్యసిస్తూనే కబడ్డీ పోటీలలో పాల్గొనేది. అనంతరం 9,10 తరగతులు గురుకుల పాఠశాలలో చదువుతున్న సమయంలో వరంగల్, ఖమ్మం, పరకాలలో, జిల్లా, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని అవార్డులను సాధించింది. ఇంటర్ మధిర సుశీల కాలేజీ నందు పూర్తి చేసి, అనంతరం మల్లారెడ్డి ఉమెన్స్ కాలేజీ హైదరాబాద్ నందు బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువు తున్న యజ్ఞితారెడ్డి ఈ నెల 16 నుండి సోమవారం వరకు నిర్వహించిన ఇండియా -నేపాల్ కబడ్డీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచింది. ప్రపంచ కబడ్డీ పోటీ లకు భారత జట్టు నుండి ఎంపికైనట్లు స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ తెలిపింది. యజ్ఞితారెడ్డికి పలువురు అభినందనలు తెలియ జేసారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పురుగు మందు తాగిన గోపాలరావు



నవతెలంగాణ-వైరా

ఇటీవలి కాలంలో సంచలనాలకు కేరాఫ్‌గా నిలిచిన వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు గుంటల స్థలం విషయంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి రిజిస్ట్రార్ ను పరేషాన్ కు గురిచేశాడు. మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన ఇండ్ల గోపాలరావు తనకు చెందిన రెండు గుంటల స్థలాన్ని గ్రామానికి చెందిన సామినేని కృష్ణ మూర్తి ద్వారా చింత నిప్పు మురళీ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నాడని కొందరు విలేఖరులను వెంట బెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. మురళీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలం నాదని రిజిస్ట్రార్‌తో వాదించాడు. అందుకు సబ్ రిజిస్ట్రార్ మోయిజ్ అలీ స్థలం నీకు చెందినట్లు ఎటువంటి పేపరు తెచ్చినా రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తానని చెప్పాడు. లింక్ డాక్యుమెంట్‌తో సహా అన్ని ఆధారాలు ఉంటే రిజిస్ట్రేషన్ ఆపే అధికారం నాకు లేదని చెప్పినా వినిపించుకోకుండా వెంట తెచ్చుకున్న పురుగు మందు అక్కడే తాగే ప్రయత్నం చేశాడు. ఈ గందర గోళంలో మందు కొంత తాగాడని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ కార్యాలయం జరిగిన సంఘటన అయినందున ఖమ్మం వెళ్ళటం మంచిదని డాక్టర్ తెలుపగా గోపాలరావును తరలించారు. వివరాల్లోకి వెళితే ఇండ్ల గోపాలరావు వైరా గ్రామ పంచాయతీ, ఆ తర్వాత మునిసిపాలిటీలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తూ తన భార్య వసంతను గ్రామ పంచాయతీ సభ్యురాలిగా గెలిపించుకున్నాడు. 2019లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో మరలా తన భార్య వసంతను 11 వ వార్డు లో కౌన్సిలర్ గా పోటీకి నిలిపాడు. అందుకు అవసరమైన డబ్బు కోసం చింత నిప్పు మురళీని ఆశ్రయించాడు. 5 లక్షలు తీసుకుని తనదని చెబుతున్న రెండు గుంటల స్థలాన్ని భూ యజమాని సామినేని కృష్ణ మూర్తి ద్వారా మురళికి అప్పుడే అగ్రిమెంట్ చేయించాడని, భూ యజమాని నుండి గోపాలరావు ఏ విధమైన అగ్రిమెంట్ చేయించుకోలేదని తెలుస్తుంది. మూడు సంవత్సరాల తర్వాత మురళీ గోపాల రావును డబ్బులు అడగటం, పోలీస్ స్టేషన్ వరకు పంచాయితీ వెళ్ళింది. అక్కడ నాకు మూడు నెలల సమయం కావాలని కోరినట్లు, అందుకు మురళీ నాలుగు నెలలకు డబ్బులు ఇచ్చినా నా స్వంత ఖర్చులతో తిరిగి నీ ప్లాటును నీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పినట్లు, అందుకు అంగీకరించినట్లు తెలుస్తుంది.

శుక్రవారం ఉదయం రెండు గుంటల స్థలాన్ని సామినేని కృష్ణ మూర్తి ముందు చేసిన అగ్రిమెంట్ ప్రకారం తనకున్న లింక్ డాక్యుమెంట్ తో సహా వచ్చి మురళికి రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత అక్కడికి వెళ్లి న గోపాల రావు పురుగుమందు తాగాడు.

ఎస్‌బిఐటిలో రెండవ రోజు కొనసాగిన శిక్షణ

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువత నాయకత్వ లక్షణాలు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అనే అంశంపై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం రెండవ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా కెయుఈసి మెంబర్ సీతారాం మాట్లాడుతూ ఏదైనా అంశాన్ని విన్న తర్వాత దానిని సరైన విధంగా అర్థం చేసుకొని వ్యక్తపరచడం వంటి లక్షణాలు అలవర్చుకుంటే నాయకులుగా తయారు అవుతారన్నారు. అధ్యాపకులు పరశురామ ప్రసాద్ మాట్లాడుతూ నాయకులకు దీర్ఘకాలిక ప్రణాళికపై అవగాహన, సమస్య పరిష్కారంలో తగిన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. అధ్యాపకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాయకునికి ప్రేరణ, విషయ విశ్లేషణ, సమస్యను ఎదుర్కొని దానిని పరిష్కరించే తత్వం కలిగి ఉండాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రీ, ప్రిన్సిపాల్ జి.రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాస రావు, ఎకడమిక్ డైరెక్టర్లు ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జి. సుభాష్ చందర్, జె. రవీందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటుకు ధీటుగా మోమినన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రూ.67.59 లక్షలతో నూతన స్కూల్ నిర్మాణం
- నాణ్యమైన విద్య అందించాలనే ధృడసంకల్పంతో 'మన ఊరు మనబడి'





నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

అందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే దఢసంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనఊరు. మనబడి ద్వారా పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మన ఊరు-మన బడి"లో భాగంగా ఖమ్మం నగరంలోని స్థానిక 40వ డివిజన్ లో మోమినన్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల రూ.67.59 లక్షలతో నూతనంగా నిర్మించిన తరగతి గదులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీద ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దటమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనఊరు-మనబడి, మనబస్తీ-మనబడి కార్యక్రమాలను ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోందన్నారు. పాఠశాలల్లో ప్రధానంగా 12 మౌళిక వసతులను కల్పించి ప్రభుత్వ విద్యకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పాఠశాల గోడలపై ఏర్పాటు చేసిన పలు చిత్రాలు చూసి మంత్రి పువ్వాడ సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ దాదే అమృత మాట్లాడుతూ.. విద్యాలయాలు దేవాలయాలాంటివని వాటిని కార్పొరేట్ స్కూల్ కంటే గొప్పగా ప్రభుత్వ పాఠశాలను తయారు చేసేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ కు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ ఫాతిమా జోహార, డీఈఓ సోమశేఖర్ శర్మ, బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జామా మస్జీద్‌కు మంత్రి పువ్వాడ విరాళం

ఖమ్మం నగరంలోని కమన్ బజార్‌లో ఉన్న జామా మసీదును మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ మత పెద్దలు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కి పలు సమస్యలపై నివేదించారు. తక్షణమే స్పందించిన మంత్రి పువ్వాడ మస్జీద్ అభివృద్ధి కోసం పువ్వాడ ఫౌండేషన్ ద్వారా 2 లక్షల రూపాయల నగదును ప్రకటించారు. నగదును మంత్రి పువ్వాడ క్యాంపు కార్యాలయం నందు మత పెద్దలకు అందజేశారు. అదేవిధంగా మస్జీద్ ప్రహరీ గోడ నిర్మాణానికి అంచనా వ్యయం వేసి ఇవ్వాలని మంత్రి పువ్వాడ జామా మస్జీద్ మత పెద్దలను కోరారు.

అంగన్వాడిల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

వైరా : మూడు నుంచి ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలకు అంగన్వాడి కేంద్రాల్లో తప్పనిసరిగా అక్షరాభ్యాసం చేయించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్కే బీజాన్బీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గన్నవరం అంగన్వాడి-2,3 కేంద్రాల్లో టీచర్స్ అనిత, నరసమ్మ ల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అందించే బాలామృతం ప్యాకెట్లలో ఉండే పోషక విలువలు గురించి తల్లులకు వివరించారు. అనంతరం గ్రామ సర్పంచ్ వేమిరెడ్డి విజయలక్ష్మి ఐదు సంవత్సరాల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి యరమల సౌజన్య కార్యదర్శి నాగశ్రీ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

సోమవరం అంగన్వాడిలో

మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం అంగన్వాడి-1 కేంద్రంలో టీచర్ మైబూబ్ బీ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలామతం ప్యాకెట్లలో ఉండే పోషక విలువలు గురించి తల్లులకు వివరించారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ పి. మాలతి చేతుల మీదుగా ఐదు సంవత్స రాల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. .

ఏఐసీసీ సభ్యునిగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ నియామకం

తల్లాడ : ఏఐసీసీ సభ్యునిగా నియమితులైన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌కు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ శుభాకాంక్షలు తెలియజేసింది. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాప సుధాకర్ మాట్లాడుతూ.. రాజకీయాలలో నిబద్ధతగా నిస్వార్థంగా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు గుర్తించి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నియమించారని తెలిపారు.

ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో జిల్లా కాంగ్రెస్ నేతలు

ఖమ్మం : ఛత్తీస్ ఘడ్ రాజధాని రాయ్ పూర్ లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్లీనరీ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గా ప్రసాద్ తో పాటు నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్, పాలేరు నియోజక వర్గ పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వర్ రావు, వడ్డే నారాయణ రావు లు పాల్గొన్నారు. ఈ ఏడాది 8 రాష్ట్రాల ఎన్నికలు, 2024 లోక్ సభ ఎన్నికలే లక్ష్యంగా చేసుకుని సమావేశం నిర్వహించారు.

పేదల సమస్యలపై... ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

జయప్రదం చేయండి : ప్రజా సంఘాల నేతల పిలుపు

- మారని పేదల బతుకులు
- ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం



నవతెలంగాణ-నేలకొండపల్లి

బ్రిటీష్ బానిస పాలనపై భగ్గుమన్న నాటి ఉద్యమ వీరులు పోరాడి సాధించుకున్న 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో నేటికీ పేదల బతుకులు మారకపోగా బానిస బతుకులు కొనసాగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక పరిపుష్టికి సర్వతో ముఖాభివృద్ధికి ఆయువుపట్టుగా నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా దారాదత్తం చేస్తుందని మండిపడ్డారు. దేశంలోని 140 కోట్ల మంది జనాభాకు చెందిన సంపద మొత్తం కేవలం 10 శాతం మంది కార్పొరేట్ శక్తుల చేతుల్లో పోగుబడి ఉందన్నారు. ఫలితంగా దేశంలో నానాటికి పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫారసులన అమలు చేసి వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలవాల్సిందిపోయి వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తుందన్నారు. సేంద్రియ సాగు ముసుగులో వ్యవసాయ రంగానికి అందించాల్సిన ఎరువులు, విత్తనాల సబ్సిడీలను ఎత్తివేస్తుందన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేయి శిరసుల విషపు నాగులాంటిదని అభివర్ణించారు. అటువంటి బిజెపి శిరస్సులను ఖండించి కోరలు పీకాల్సిన సమయం ఆసన్నమైనదన్నారు. బిజెపి అసమర్థ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని, ఈ సందర్భంగా చేపట్టిన మహార్యాలీని జయప్రదం చేయాలని, అందులో భాగంగా ప్రతి గ్రామంలో వినూత్న రూపంలో ప్రజలను చైతన్యవంతం చేసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఇంటూరి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కేవీ రామిరెడ్డి, దుగ్గి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, సిరికొండ ఉమామహేశ్వరి, మారుతి కొండలరావు, మందడపు మురళీకృష్ణ, దేగల వెంకటేశ్వరరావు, బండి రామమూర్తి, ఎరదేశి నరసింహారావు, శివరాజు, గాదె వెంకటేశ్వరరావు, చింతలపాటి భాస్కర్, దండా సూర్యనారాయణ, సిరికొండ నాగేశ్వరరావు, సామల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

అభ్యుదయం కోసం ప్రతి వ్యక్తి

మూఢ విశ్వాసాలను సవాలు చేయాలి



నవతెలంగాణ-వైరాటౌన్

అభ్యుదయం కోసం ప్రతి వ్యక్తి మూఢ విశ్వాసాలను సవాలు చేయాలని వైరా మాజీ ఎంపిపి బొంతు సమత అన్నారు. శుక్రవారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో వైరా స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జాతీయోద్యమంలో భగత్ సింగ్ కృషి, జీవితం, త్యాగం పైన విస్తృత అధ్యయనం నిర్వహించారు. ఈ సందర్భంగా సమత భగత్ సింగ్ వీలునామా పైన పారుపల్లి కృష్ణారావు, నారికొండ అమరేందర్, భగత్ సింగ్ జీవిత చరిత్రపైన సుంకర సుధాకర్, బోడపట్ల రవీందర్ జాతీయ విప్లవ భగత్ సింగ్ అవగాహన పైన వివరించారు. ఈ సందర్భంగా బొంతు సమత మాట్లాడుతూ వాస్తవిక దృష్టితో పరిశీలించి సమాజ అభివృద్ధికి అడ్డుగా ఉన్న అంశాలను సవాలు చేయాలని అన్నారు. భారత సమాజంలో సనాతన ధర్మం పేరుతో సాగిన అణిచివేత సామాజిక వెనుకబాటుకు కారణం అన్నారు. కొన్ని సమూహాలను ఉత్పత్తి ప్రక్రియకు దూరంగా ఉంచి ఆర్థిక వ్యత్యాసాలను మూలం అయిందని అన్నారు. భారత దేశం అభివృద్ధికి సరళీకరణ ఆర్థిక విధానాలు తోపాటు, సనాతన సంప్రదాయం ఆటంకం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, మందడపు రామారావు, అనుమోలు రామారావు, మల్లెంపాటి ప్రసాదరావు, వడ్లమూడి మధు, తోట కృష్ణవేణి, కురుగుంట్ల శ్రీనివాసరావు, దేవభక్తిని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

వైద్య విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని ప్రభుత్వ ఉమెన్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి. ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ లో జరిగిన కె.యం.సి కళాశాల విద్యార్థి ప్రీతి పైన ర్యాగింగ్ పాల్పడినటువంటి వారి పైన కళాశాల ప్రిన్సిపల్ పై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ ని సస్పెండ్ చేయాలని అదే విధంగా ఎవరైతే ర్యాగింగ్ కు పాల్పడ్డారో వారి పైన ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్ నాయకులు విచిత, కావ్య, షరీఫా, సమీరా, నవ్య, రాగిణి, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది దొంగల అరెస్టు


- 67 లక్షల సొత్తు రికవరీ
- విలేకరుల సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనర్





నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని దారి దోపిడీలకు పాల్పడే ఏడుగురు ముఠా సభ్యులు, ఇండ్లల్లో చోరీ చేసే ఓ దొంగను, ఈ రెండు కేసుల్లో ఒక కేజీ బంగారం, రూ. 17,50,000 నగదు రికవరీ చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు వారియర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి మాట్లాడుతూ ఖమ్మం అర్బన్ మండలం పాండురంగాపురంనకు చెందిన సంపటి ఉమా ప్రసాద్ 8 ఇళ్లల్లో దొంగతనం చేశాడు. ఎక్కువగా రాత్రి సమయంలో చేశాడు. ఇతని నుంచి 900 గ్రాములు బంగారం, రూ.3 లక్షల నగదు మొత్తం 45 లక్ష రూపాయల విలువ గల సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు. జల్సాలు, బెట్టింగ్‌లకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేసినట్లు వివరించారు. అదేవిధంగా ఖమ్మం అర్బన్ మండలం ధంసలాపురంనకు చెందిన బైక్ మెకానిక్ పగడాల విజయ్ కుమార్, ఆటో డ్రైవర్స్ సండేం లక్ష్మీనారాయణ, దానవాయిగూడెంనకు చెందిన కార్ డ్రైవర్ ఎస్‌కె సైదులు, ఖమ్మం బికె బజార్ కు చెందిన పంచర్ షాప్ లో పనిచేసే ఎస్.డి షీబాజీ సిద్ధికి, బోనకల్ మండలం చిన్న బీరవల్లి గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ పాకాలపాటి ధర్మ తేజ, ఖమ్మం ప్రకాష్ నగర్ కుమ్మరి బజారుకు చెందిన కార్ డ్రైవర్ ఎస్.కె పర్వేజ్, ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేటకు చెందిన కార్ డ్రైవర్ పసుపులేటి సాయి ముఠాగా ఏర్పడ్డారు. ఖమ్మం నగర శివ ప్రాంతాల్లో కార్లు, బైకులు ఆపి వారిని బెదిరించి వారి వద్ద ఉన్న బంగారం, నగదు దోపిడీ చేశారు. మొత్తం 8 చోట్ల దోపిడీలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని, వారి నుంచి 150 గ్రాముల బంగారం, రూ.14,50,000 నగదు మొత్తం 22 లక్షల సొత్తు రికవరీ చేసినట్లు తెలిపారు. కేసు చేధించిన పోలీసులకు కమిషనర్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో సిసిఎస్ ఎసిపి రవి, ఖమ్మం నగర ఎసిపి గణేష్, ఖమ్మం రూరల్ ఎసిపి బస్వా రెడ్డి, సిఐలు మల్లయ్య స్వామి, నవీన్, శ్రీనివాసరావు, శ్రీధర్, రామకృష్ణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక కర్షక మహా ప్రదర్శన

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-కల్లూరు

రైతుల చేతుల్లో ఉన్న వ్యవసాయంను కేంద్ర ప్రభుత్వ విధానాలతో బుల్డోజ చేస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం ముదిగొండ అంజయ్య అధ్యక్షతన మండల కార్మిక కర్షక సదస్సులో రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి నిధులు భారీ కోత విధించిందని అన్నారు. ఎరువులు సబ్సిడీ ఏభై వేల కోట్ల రూపాయల కేటాయింపు తగ్గించడం, కేంద్ర వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు, ధరలు స్థిరీకరణ నిధికి నిధులు కేటాయింపు చేయకపోవడం, భారత పత్తి సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసిఐకు లక్ష రూపాయల కేటాయింపు వ్యవసాయ రంగం కార్పొరేట్ కంపెనీలు పరం చేయుటకు అన్నారు. ఆహార భద్రతకు నిధులు కేటాయింపు పెంచాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న ఢిల్లీలో పది లక్షల మంది రైతులు కార్మికులు మహా ప్రదర్శన జరుగుతుందని అన్నారు. వ్యవసాయ రంగంలో సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు ఈ సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు తన్నీరు కృష్ణార్జున్, రైతు సంఘం జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు, సామేనేని హనుమయ్య, బట్టు నరసింహారావు, రేసు నాగేశ్వరరావు, నాయుడు, వల్లే బోయిన రామనాథం, రావి వెంకటసత్యం, ముంత మాధవరావు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు

నవతెలంగాణ-మధిర

మధిర మున్సిపాలిటీలో రోడ్డు పక్కన ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న బడ్డీ కొట్లను తొలగించారు. వారికి ప్రత్యామ్నాయంగా మున్సిపల్ ఆఫీస్ పక్కన సుమారు 60 షాపులు ఏర్పాటు చేశారు. ఆ షాపులను శుక్రవారం జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్పర్సన్ మొండితోక లతాజయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

తక్కువ ఖర్చుతో ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా సరుకు రవాణా

నవతెలంగాణ-మధిర

అతి తక్కువ ఖర్చుతో వేగంగా భద్రంగా మీకు అతి చేరువగా టిఎస్ఆర్టిసి లాజిస్టిక్ ద్వారా సరుకు రవాణా చేయబడునని లాజిస్టిక్స్, ఏటీఎం వేణు గోపాల్ అన్నారు. శుక్రవారం మధిర బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన లాజిస్టిక్ నూతన పిసిసి ఏజెంట్ కౌంటర్ ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా సరుకు రవాణా సుదూర ప్రాంతాలకు సైతం తక్కువ సమయంలో చేరవేయడం జరుగుతుందని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలలో కూడా లాజిస్టిక్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మధిర పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం మధిర పురవీధులలో మైకుల ద్వారా లాజిస్టిక్ కరపత్రాలు అందజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ దేవదానం, లాజిస్టిక్స్ ఏటీఎం ఎం వేణుగోపాల్, రీజనల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హరి వర్మ, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.వెంకటేశ్వరరావు, కార్గో పాయింట్ ఇంచార్జి లక్ష్మీనారాయణ, ఇతర డిపోల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.

కంటి వెలుగును ప్రారంభించిన జెడ్పిటిసి

నవతెలంగాణ-రఘునాథపాలెం



మండల పరిధిలోని భద్య తండ గ్రామపంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా శాఖమంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు జడ్పిటిసి, మాలోతు ప్రియాంక శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ కార్యక్రమంలో బద్య తండ సర్పంచ్ భూక్య సుగుణ, ఉపసర్పంచ్ మనావతు గౌస్, గ్రామ నాయకులు, భూక్యా దేవా, మాలోతు ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

ముచ్చర్లలో కోతులు పట్టివేత

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో కోతుల బెడదతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్ లూసి స్పందించారు. గ్రామంలోని కోతులను పట్టుకోని ఆటోలో ఇల్లెందు సమీపంలోని అడవిలో వదిలారు. అనంతరం గ్రామంలో ఇంటి పన్ను వసూళ్లు, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ చిదంబరం, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మధిరలో ఉచిత వైద్య శిబిరం

నవ తెలంగాణ-మధిర

బోడేపుడి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మధిర బోడేపుడి భవన్ నందు (సిపియం ఆఫీస్) నిపుణులైన వైద్యుల సమక్షంలో రూ. 100/- లకే బి.పి, షుగర్ మందులను నెలకు సరిపడా అందించబడును. ఈ కార్యక్రమం ఉదయం 7-00 నుండి 9 గంటల వరకు నిర్వహించబడుతుంది. వివరాలకు 9705192947, 7780166010 సంప్రదించండి.

ఎంపీ నామా పర్యటన

నవతెలంగాణ-కొణిజర్ల

మండలంలో పలు గ్రామాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. అనంరతం ఆయా గ్రామాల్లో వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు దొడ్డపనేని రామారావు, తాళ్లూరి చిన్న పుల్లయ్య, పొట్టపల్లి జీడయ్య, ఏలూరి శ్రీనివాసరావు, బాణాల వెంకటేశ్వరరావు, సుడా డైరెక్టర్ బండారు కృష్ణ, లకావత్ దేవేందర్, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు బురా ప్రసాద్, ఎంపీటీసీలు మదన్ లలిత కుమారి, సర్పంచులు రోషన్ బేగ్, అద్దంకి చిరంజీవి, మూడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ వార్షిక బడ్జెట్ సమావేశం

నవతెలంగాణ-మధిర

వ్యవసాయ మార్కెట్ కమిటీ మధిర నందు శుక్రవారం వార్షిక బడ్జెట్ 2023-24 సమావేశం వరంగల్ డివిజన్ జేడీ అజ్మీర.రాజు నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిడి ఈ.మల్లేశం, కొత్తగూడెం డిఎంఓ, ఎంఏ.అలీమ్, ఖమ్మం డిఎంఓ నాగరాజు పాల్గొన్నారు.

అశాస్త్రీయ టార్గెట్లపై 'పోస్టల్' ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

అశాస్త్రీయ టార్గెట్ లపై పోస్టల్ ఉద్యోగులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో తపాలా ఉద్యోగులను టార్గెట్ల పేరుతో వేధించడం సర్వసాధారణమైనది ఎన్ఎఫ్ పీఈ ఆధ్వర్యంలో గాంధీచౌక్ లోని పోస్టల్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఒక టార్గెట్ పూర్తి కాగానే వారం తిరగకుండానే మరో స్కీం పేరుతో వేధిస్తున్నారని సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు బి.రవీందర్ ధ్వజమెత్తారు. వయసు మళ్ళిన ఉద్యోగుల ను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని, తద్వారా అనారోగ్యం బారిన పడి ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోతున్నారని వాపోయారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా పోస్టుమన్, గ్రామీణ తపాలా ఉద్యోగులు, క్లాస్ 3 ఉద్యోగులు సంయుక్తంగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు లెనిన్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు అట్టడుగు ఉద్యోగులైన గ్రామీణ తపాలా ఉద్యోగులను బానిసలుగా చేసేలా ఉన్నాయన్నారు. ఇచ్చేది ఇసుమంత చేయించేది మోయలేనంతగా ఉందన్నారు. గత జీతభత్యాల సవరింపుకు సంబంధించిన అంశాలను అమలు చేయడం లేదన్నారు. ఆరోగ్య సంబంధిత పథకము అమలుతో పాటు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా న్యాయమైన సమస్యల పరిష్కారంతో పాటు పాత పెన్షన్ విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా తపాలా అధికారికి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.కనకయ్య, హబీబ్, సురేష్. ప్రసాద్, రామారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి

రైతు సంఘం జిల్లా నాయకులు మందా సైదులు

నవతెలంగాణ-మధిర



మధిర మండలంలోని పలు గ్రామాల చెరువులను సాగర్ జలాలతో నింపాలని, సాగర్ ఆయకట్టు చివరి పొలాల వరకు జలాలు అందించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు మందా సైదులు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో వరి, మిర్చి, మొక్కజొన్న, చెరుకు పంటలకు నీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. పంట చేతికందే సమయంలో నీళ్ల అందక పంట నష్టం జరుగుతుందన్నారు. వారాబంధిని ఎత్తివేసి నిరాటంకంగా సాగర్ జలాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వంగవీడు, అల్లినగరం గ్రామస్తులు ఆందోళన బాట పట్టారని అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కుక్క మోహన్ రావు, కార్మిక సంఘం నాయకులు పడకంటి మురళి, విద్యార్థి యువజన సంఘం నాయకులు వడ్రానపు మధు, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు... విజ్ఞాన భాండాగారాలు

- సత్తుపల్లిలో లైబ్రరీ నిర్మించే అవకాశం నాకు రావడం భగవధానుగ్రహం
- ఆధునిక హంగులతో డిజిటలైజ్డ్ చేయిస్తా రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధిరెడ్డి

బండి మన ప్రాంతవాసి కావడం అదృష్టం

ఎమ్మెల్యే సండ్ర

- సత్తుపల్లిలో జీప్లస్‌వన్ స్థాయి లైబ్రరీకి శంకుస్థాపన

నవతెలంగాణ- సత్తుపల్లి



గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, సరస్వతీ నిలయాలని రాజ్యసభ సభ్యులు, హెటిరో డ్రగ్స్ అధినేత డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి అన్నారు. సత్తుపల్లి నడిబొడ్డున సొంత నిధులతో చేపట్టనున్న అత్యాధునిక (డిజిటల్) లైబ్రరీకి బండి శనివారం స్థానిక ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్థసారధిరెడ్డి మాట్లాడారు. సత్తుపల్లిలో గ్రంథాలయాన్ని నిర్మించే అవకాశం తనకు రావడం భగవధానుగ్రహం అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా సత్తుపల్లిలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయాన్ని నిర్మించి సత్తుపల్లి, పరిసర ప్రాంత ప్రజలకు అంకితం చేస్తానన్నారు. రాబోయే తరాల అవసరాలకు అనుగుణంగా సత్తుపల్లి లైబ్రరీని తీర్చిదిద్దుతానన్నారు. శంకుస్థాపన చేయడం ముఖ్యం కాదని, త్వరగా నిర్మాణం చేపట్టి ప్రారంభించడమే ముఖ్యమన్నారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలను సమకూర్చడం జరుగుతుందన్నారు. విద్యార్థిగా ఎంతో కష్టాలు చవిచూశానన్నారు. 6 కిలోమీటర్ల దూరం నుంచి సైకిలుపై సత్తుపల్లికి వచ్చేవాడినన్నారు. ఆరోజు మంచిగా చదవుకోబట్టే స్వశక్తితో అభివృద్ధి చెందానన్నారు. చదువు లేకుంటే అభివృద్ధి చెందడం సాధ్యపడదన్నారు. విద్యకు తాను అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, ఆ ఉద్దేశంతోనే ఈ ప్రాంత విద్యార్థులకు, ప్రజలకు జ్ఞాన సంపదను అందించేందుకు గ్రంథాలయాన్ని నిర్మించేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. మనమెంత అభివృద్ధి చెందినా సమాజానికి ఏ విధంగా సహకరించామన్నదే ప్రధానమన్నారు. సంపాదనతో పేరు ప్రఖ్యాతలు రావని, సంపద గుర్తింపుకు కొలమానం కాదని, చేసే సేవా కార్యక్రమాలే నాలుగు కాలాల పాటు గుర్తుండి పోతాయన్నారు. ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ బండి పార్థసారధిరెడ్డి మన ప్రాంతవాసి కావడం మన అదృష్టమన్నారు. ఆయన చేసిన, చేస్తున్న సేవలు సమాజహితం కోరే విధంగా ఉంటున్నాయన్నారు. ఇక్కడి లైబ్రరీ నిర్మాణమే కాకుండా ఆయన జన్మించిన సొంత ఊరు వేంసూరు మండలం కందుకూరులో అత్యాధునిక సౌకర్యాలతో జూనియర్ కళాశాలకు ఇటీవలే శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఆయన సేవలు ఈ ప్రాంత ప్రజలకు మరింతంగా అందించాలని ఆకాంక్షించారు. వచ్చే ఆగస్టు 15 నాటికి గ్రంథాలయ నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా సండ్ర అన్నారు. గ్రంథాలయం నిర్మాణానికి అడగ్గానే స్థల సేకరణ జరిపి అందరికి అందుబాటులో ఉండే స్థలాన్ని చూపించిన కలెక్టర్ గౌతమ్‌కు సండ్ర ధన్యవాదాలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కూసంపూడి మహేశ్, ఆత్మ చైర్మెన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ, కమిషనర్ కోడూరు సుజాత, బీఆర్ఎస్ నాయకులు చల్లగుండ్ల కృష్ణయ్య ఎస్కే రఫీ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం సత్తుపల్లిలోని పలు వార్డుల్లో సీసీరోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే సండ్ర ఎంపీ బండితో కలిసి శంకుస్థాపనలు చేశారు.



ఇదేం నిర్మాణం... పాత ఇండ్లను మరిపిస్తున్నాయ్

- లబ్ధిదారులకు ఇస్తే తీసుకుంటారా?
- ఐటీడీఏ జేఈపై కలెక్టర్ గౌతమ్ ఆగ్రహం
- పర్యవేక్షణ జరపమని ఆర్డీవోకు ఆదేశం

నవతెలంగాణ- సత్తుపల్లి

సత్తుపల్లిలోని వేంసూరు రోడ్డులో నిర్మాణం జరుగుతున్న జీప్లస్‌టూ స్థాయి డబుల్ బెడ్రూం ఇండ్లను జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శనివారం పరిశీలించారు. మొదట్నుంచీ ఇక్కడ చేపట్టిన డబుల్ నిర్మాణం నాసిరకంగానే జరుగుతోందని పలు విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం సత్తుపల్లి పర్యటనకు వచ్చిన కలెక్టర్ నిర్మాణ సముదాయాని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవనాలు మొత్తం కలియదిరిగిన కలెక్టర్ పనులను చూసి ఐటీడీఏ జేఈ సుబ్బరాజుపై నిప్పులు చెరిగారు. భవన సముదాయం ముందు ఉన్న డస్ట్‌ను చూసి దేనికి వాడుతున్నారని ప్రశ్నించగా, కాంక్రీట్‌లో డస్ట్‌ను వాడుతున్నట్లు సుబ్బరాజు చెప్పారు. దీంతో కలెక్టర్ నిర్ఘాంతపోయారు. ఇదేం నిర్మాణం అని నిలదీశారు. ఎప్పుడు పూర్తి చేస్తావ్. నీవల్ల అవుతుందా, అంటూ గరమయ్యారు. ఎప్పుడు అడిగినా ఇదిగో అదిగో అంటున్నావ్ అంటూ మండిపడ్డారు. ఎక్కడ చూసినా దుబ్బకొట్టుకు పోయినా ప్లాట్లు, నాసిరకం మెటీరియల్, మొక్కుబడి పనితీరుపై పెదవి విరిచారు. లబ్ధిదారులకు ఇలాంటి ఇండ్లు ఇస్తే తీసుకుంటారా అని ప్రశ్నించారు. కలెక్టర్ ప్రశ్నలకు జేఈ సుబ్బరాజు నీళ్ల నమిలారు. సార్ సార్ అనడం తప్ప మరే సమాధానం చెప్పలేకపోవడం గమనార్హం. పనితనం మార్చుకోకుంటే తొలగించడం తప్ప మరో దారిలేదని హెచ్చరించారు. ఇక్కడి నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలంటూ ఆర్డీవో సూర్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు.





టీజీఎస్ మహాసభలకు కారేపల్లి ముస్తాబు

గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా ర్యాలీ

బయ్యారం ఉక్కు పరిశ్రమతో యువతకు ఉపాధి

నవతెలంగాణ-కారేపల్లి

గిరిజనుల సమస్యలపై ఉద్యమ ప్రణాళికతో ముందుకెళ్ళటానికి నిర్వహిస్తున్న తెలంగాణ గిరిజన సంఘం 3వ జిల్లా మహాసభకు వేదికైన కారేపల్లి ముస్తాబైంది. నేడు జరగనున్న మహాసభలకు వచ్చే అతిధుతులు, పోరాట భాగస్వాములకు కారేపల్లి వీధులు, ప్రధాన కూడళ్ళ గిరిజన సంఘం తోరణాలు ఆహ్వానం పలుకుతున్నాయి. మహాసభ ల ఏర్పాట్లను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మూడు శోభన్. ఆహ్వానం సంఘం అధ్యక్షులు ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ఏజన్సీలో గిరిజన యువత ఉపాధి లేక వలస పోతున్నారన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తో ఈప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు ఏజన్సీ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు కు ఉద్యమించాల్సి అవసరం ఉందన్నారు. కారేపల్లిలో జరిగే మహాసభలకు ప్రతి గిరిజన కుటుంబం తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వజ్జా రామారావు, అజ్మీర శోభన్‌నాయక్, భూక్యా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో అంబులెన్స్ అందజేయాలి

నవతెలంగాణ-కారేపల్లి

మాధారం డోలమైట్ మైన్స్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో మాధారం పంచాయతీకి అంబులెన్స్, వైకుంఠరథం ఏర్పాటు చేయాలని ఎంపీవో రాజారావు, సర్పంచ్ అజ్మీర నరేష్‌లు కోరారు. శుక్రవారం మాధారంలో డోలమైట్ మైన్స్ పర్సనల్ మేనేజర్ చిట్టి రాజు, సివిల్ మేనేజర్ నారాయణలను వారు కలిశారు. మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాధారంకు అంబులెన్స్ సేవలు అవసరం ఎంతో ఉందని మైన్స్ అధికారులకు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సీఎస్ఆర్ నిధులతో అంబులెన్స్, వైకుంఠరథంను అందజేసేలా చర్యలు తీసుకోవాలని మైన్స్ అధికారులను కోరగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మైన్స్ అధికారులను కలిసిన వారిలో కార్యదర్శి తిలక్ ఉన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలి

నవతెలంగాణ-కల్లూరు

మోసపూరిత లాటరీ విధానం ద్వారా కల్లూరులో రెండు పడకల ఇళ్ళు కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ వేగవంతంగా జరపాలని జిల్లా కలెక్టర్ పివి గౌతమ్‌కు బాధితులతో కలిసి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానవతరాయ్ వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా రెండు పడకల ఇళ్ళు నిర్మించిన పక్కనే ఉన్న 30గుంటల ఎన్ఎస్‌పి స్థలంలో అర్హులైన పేదలకి, విలేకరులకు పంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు ఎంపిటీసి దామాల రాజు, షేక్ జానీ పాషా, ఉమామహేశ్వరి, ఉమర్, రమాదేవి, కోటేశ్వరి ఉన్నారు.

తెలంగాణలో వలసలు లేవు

- సంక్షేమ పథకాలలో నెంబర్ వన్
- కలిసి కట్టుగా పనిచేస్తే వార్ వన్ సైడ్
- ఎంపీ నామా నాగేశ్వరరావు

నవతెలంగాణ-వైరా



రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు మరే రాష్ట్రంలో లేవు. వాటిని పదే పదే ప్రజలకు గుర్తు చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన మండల పార్టీ సమావేశానికి నామా నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రం ఏర్పాటు కాక ముందు 20 లక్షల మంది వలసలు పోయే దుస్థితిని రూపు మాపి మన రాష్ట్రంలోకి 12 లక్షల మంది వలస వచ్చే విధంగా అభివృద్ధి చేశారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్ని పథకాలు ఉంటే చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ మూడవ సారి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కలిసి కట్టుగా పనిచేస్తే వార్ వన్ సైడ్ అన్నారు. జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. 2014, 2018 లో కూడా ఒక్కొక్క సీటే గెల్చుకున్నామని గుర్తు చేస్తూ మనం ఎప్పుడు పార్టీలో చేరినా గౌరవించి పదవులు ఇచ్చారని అన్నారు. అటువంటి పదవులు, హెూదాలు అనుభవిస్తూ ఎమ్మెల్యే రాములు నాయక్ ను మేమే గెలిపించామని చెప్పటం అహంకారం అన్నారు. ఆనాడు టిఆర్ఎస్ నాయకులుగా ఉండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన రాములు నాయక్ ను ఎలా గెలిపించారని బిఆర్ఎస్ బహిష్కృత నాయకులనుద్దేసించి విమర్శించారు. ఆనాడు ఏదో చేశామని ఇప్పుడు బిఆర్ఎస్‌ను ఏదో చేయాలని చూస్తే కుదిరే పని కాదని, ఐరన్ పిల్లర్స్ తో నిర్మించ బడిన పార్టీని ఢీ కొట్టాలని చూస్తే తలలు పగిలి చస్తారని పరోక్షంగా పొంగులేటి వర్గాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రగతి భవన్ ను పేల్చేస్తామని ఒకడు, కూల్చేస్తాం అని ఇంకొకడు జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుడు ఈటెల రాజేందర్ ఒక టివికి ఇంటర్వ్యూ ఇస్తూ ముఖ్యమంత్రి అపర చాణక్యుడు అని కీర్తించటం మనం చూస్తున్నామని అటువంటి నాయకుడు ఉన్న బిఆర్ఎస్‌ను ఒకరిద్దరు అమాంబాపతు ఏం చేస్తారని అన్నారు. ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ మాట్లాడుతూ మనపై అవాకులు చవాకులు వాగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సామ దాన భేద దండోపాయలను సవి చూడాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర రావు, ఎంపీపీ వేల్పుల పావని, జడ్పిటిసి నంబూరి కనకదుర్గ, మార్కెట్ కమిటీ చైర్మన్ బిడికె రత్నం, మునిసిపల్ వైస్ చైర్మన్ ముళ్ళ పాటి సీతారాములు, దిశా జిల్లా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున రావు, పసుపులేటి మోహన్ రావు మచ్చా బుజ్జి, పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి తదితరులు పాల్గొన్నారు.

మోడీ నుండి దేశాన్ని కాపాడుకుందాం

- చలో ఢిల్లీని జయప్రదం చేయండి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

మాచర్ల భారతి

నవతెలంగాణ-వేంసూరు



మోడీ నుండి దేశాన్ని కాపాడుకునేందుకు కార్మికులు కర్షకులు కలిసి రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఎర్ర రామయ్య భవనం నందు జరిగిన సెమినార్‌లో భారతి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ అంబానీ, అదాని కోసమే పనిచేస్తున్న మోడీ విధానాలను అరికట్టేందుకు అన్ని వర్గాలు ముందుకు వచ్చి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనిలో బాగాంగా ఏప్రిల్ 5న కార్మిక సంఘాలు తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. వేంసూరు మండలం పోరాటాలకు పెట్టిందే పేరు అని అదే దారిలో నాయకులు ప్రజా సమస్యలపై పని చేస్తూ పోరాటాలలో ముందుండాలని సూచించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ నిధులను దారి మళ్లిస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చలమాల విఠల్రావు మాట్లాడుతూ మోడీ ఒలంపిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిపిఎం పార్టీ అనుబంధ సంఘాలు పల్లెల్లో పాదయాత్రలు చేసేందుకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని ఆదేశాల మేరకు గ్రామాలలో పాదయాత్రకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అరవపల్లి జగన్మోహన్రావు, సిఐటియు మండల కన్వీనర్ మల్లూరు చంద్రశేఖర్, రైతు సంఘం మండల కార్యదర్శి అరవపల్లి గోపాలరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, మోరంపూడి వెంకటేశ్వరరావు, కొత్త సత్యనారాయణ, ప్రసాద్, వెలిగినేని రాంబాబు, గడిపర్తి మోహన్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాస్ నిర్మించాలి..

కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన ఎంపీ రవిచంద్ర

నవతెలంగాణ - ముదిగొండ



ముదిగొండ -సువర్ణపురంల మధ్య అండర్ పాస్ నిర్మించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కోదాడ-కురవి నేషనల్ హైవే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ముదిగొండ మండలం ఖానాపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలను పరామర్శించిన అనంతరం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుతో కలిసి శుక్రవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పసుపులేటి వెంకట్ తదితరులు నేషనల్ హైవే కారణంగా ముదిగొండ -సువర్ణాపురం రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని అండర్ పాస్ నిర్మించాల్సిన అవసరాన్ని తెలిపారు. ఎంపీ రవిచంద్ర వెంటనే స్పందించి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేషీ అధికారులతో వీడియో ఫోన్ ద్వారా అక్కడి పరిసరాలను చూపుతూ వివరించగా, వారు సానుకూలంగా స్పందించారు.

చట్టాలపై అవగాహనతో నేరాల నియంత్రణ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి టీ.శ్రీనివాసరావు

కారేపల్లి : చట్టాల అవగాహనతో నేరాల నియంత్రణ జరుగుతుందని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి టీ.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు, బాలల పనిలో పెట్టడం వంటివి చట్టాలపై అవగాహన లేకనే జరుగుతున్నాయన్నారు. ఆవేశాలతో జరిగే పొరపాట్లు నేరస్తులను చేస్తుందన్నారు. భూతగాదాలు, వరకట్న వేధింపుల కేసులు అధికంగా వస్తున్నాయని వాటిని లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం చేసుకుంటే ఇరువర్గాలకు శ్రేయస్సుకరమన్నారు. నిందితులుగా ఉన్న పేదలకు ఉచిత న్యాయం అందించటానికి న్యాయ సేవా సంస్థ సహకరిస్తుందన్నారు. పేదల పక్షన ఉచితంగా న్యాయవాదిని నియమించి వారికి న్యాయం జరిగేలా చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, తహసీల్దార్ తూమటి శ్రీనివాస్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్సై పుష్పాల రామారావు తదితరులు పాల్గొన్నారు.





రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది

• సెంట్రల్ లైటింగ్ శంకుస్థాపనలో ఎమ్మెల్యే వనమా

నవతెలంగాణ-సుజాతనగర్

ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల కేంద్రలో రూ.38 లక్షలతో తన చిరకాల వాంఛ అయినా సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయడం చాలా సంతోషం కలిగించిందని అన్నారు. సోమేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేందర్, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, ఎంపీపీ భూక్యా విజయలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ బుక్య రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఇల్లందు

గత మూడేళ్లుగా నివసిస్తున్న రాజీవ్ నగర్ గుడిసె వాసులకు తాగునీరు, మౌలిక సదుపాయాలు కరెంటు, ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బస్టాండ్ నుండి ప్రదర్శన చేసి ఎండీఓ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం మండలాధి కారిణికి వినతిపత్రం సమర్పించారు. జరిగిన సభలో మండల కార్యదర్శి అబ్దుల్ నబి మాట్లాడుతూ సిఎస్పి బస్తి పంచాయతీలోని రాజీవ్ నగర్ శివారు ప్రాంతంలో పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు గుడిసెలు తొలగించాలని వారికి తాగునీరు కరెంటు మౌలిక సదుపాయాలు కల్పించకూడదని హుకుం జారీ చేసి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. ధారావత్ రాందాస్ అధ్యక్షతన జరిగిన సభలో మన్యం మోహన్ రావు, పాషా వీరస్వామి వీరభద్రం వెంకన్న ఖాదర్ ఖాజా రజియా వైకుంఠం, ఖైరున్, విజయ, సరిత, అమ్మి పద్మ గొబ్రియ, కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-బూర్గంపాడు

మండలంలోని సారపాకలోని గాంధీ నగర్‌లో నివాసం ఉంటున్న కిడ్నీ బాధితుడు కొప్పుల నాగేశ్వరరావు కుటుంబానికి పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్‌లు ఈ సాయాన్ని అందజేశారు. సారపాక గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న కొప్పుల నాగేశ్వరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. అతని ఆర్థిక పరిస్థితి బాగోలేక, పాప పదవ తరగతి ఫైనల్ పరీక్షలకు సిద్ధం అవుతున్న సమయంలో స్కూలు ఫీజు కట్టడానికి ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని వారికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ విషయాన్ని విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావుకు దృష్టికి తీసుకు వెళ్లి రెండు లక్షల యాభై వేలు ఇప్పించారు. కిడ్నీ బాధితుడు కొప్పుల నాగేశ్వ రరావు కుటుంబానికి పదివేల ఆర్థిక సహాయం చేసిన బిక్కసాని శ్రీనివాసరావు, జలగం జగదీష్‌లను పలువురు అభినందించారు.



వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి : టీడబ్ల్యూజేఎఫ్

నవతెలంగాణ-చంద్రుగొండ

వర్కింగ్‌లో ఉన్న జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, పక్కా ఇండ్లు ఇవ్వాలంటూ శుక్రవారం చంద్రుగొండ రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎల్.ప్రసన్నను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్ట్‌లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించిన విధంగా వర్కింగ్‌లో ఉన్న జర్నలిస్టులందరికీ అక్రిడేషన్‌తో సంబంధం లేకుండా ఇండ్ల స్థలాలు, పక్కా ఇండ్లు, ఇవ్వాలన్నారు. కొంతమంది అక్రిడేషన్ సాకుగా చూపించి అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీనిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు షేక్ జాఫర్, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఎస్డి నూర్ రబ్బాని, డి.లక్ష్మణ్, కే.కృష్ణ ప్రసాద్, రామదాసు, బండి శ్రీకాంత్, బి.వీరభద్రం, గణేష్, పూసం రాంబాబు, సవడం వెంకటేశ్వర్లు, కుక్కుముడి దినేష్, బడికల శ్రావణ్ కుమార్, దయాకర్, వెంకటచారీ, బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతబడి నేపంతో కొట్టిన ఐదుగురికి జైలు శిక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

చేతబడి చేశారని నేపముతో కొట్టిన ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపాల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బత్తుల రామారావు శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా.... ములకలపల్లి మండలం ముగురాళ్ల గొప్ప గ్రామస్తుడు కీసరి శ్రీను, 2017 జూలై 6న ఇచ్చిన తన ఫిర్యాదులో తన గ్రామానికి చెందిన గుండె రమేష్ అనే కూతురు అశ్వానికి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్, ఖమ్మం ఆస్పత్రులకు చూపించి తిరిగి వచ్చారు. 2017 జులై 5న సత్తుపల్లి హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళి చికిత్స చేయించుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయింది. అందుకు కారణం కేసరి రామచంద్రం చేతబడి చేయడం వల్లనేనన ఆ రోజు అర్ధరాత్రి 11:30కు వారి ఇంటి మీదకు భువనగిరి గ్రామానికి చెందిన గుండి రమేష్, గుండు వెంకటేష్, గుండి రాజేష్, గుండు శ్రీను, గుండి భద్రయ్య, గుండి నాగరాజులు మూకుమ్మడిగా వెళ్లి ఇష్టం వచ్చినట్లు కర్రతో తల పగలగొట్టి, గొడ్డలి కర్రతో పన్నులు ఊడగొట్టినారని ములకలపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ బి.రామ చంద్రన్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి ఎస్సై ఎల్.రవీందర్ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కేసు విచారణంచే సమయంలో గుండి భద్రయ్య చనిపోయాడు. కోర్టులో ఆరుగురు సాక్షుల విచారణ అనంతరం వాదోపవాదాల విన్న న్యాయమూర్తి మిగతా ఐదుగురిపై నేరం రుజువైందని భావించి 143, 147, 148 సెక్షన్ల వారీగా మూడు సెక్షన్లకు ఒక నెల చొప్పున, మొత్తం అందరికీ రూ.100 జరిమాన 324 ఒక సెక్షన సంవత్సరం తదుపరి 342 R/w.149 ఐపీసీ సెక్షనకు ఆరు నెలలు, మొత్తం 1300 ఐదుగురికి అందరిపై జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎ.రాజారాం నిర్వహించగా, వీరబాబు, హరి గోపాల్, కోర్టుపిసి బిక్కులాల్ సహకరించారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-భద్రాచలం టౌన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వెనుకబడిన గిరిజన కొండా రెడ్డి గ్రామాలలో 200 మంది పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమం రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో 'స్మైల్ ఫౌండేషన్' వారి సహకారంతో పూసుకుంటా, పాత రెడ్డిగూడెం, సుద్దగోతులగూడెం, నిడివిరెడ్డిగూడెం, బండారు గుంపు, తిరుమలకుంట గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన వారికి ఆయా గ్రామాల సర్పంచులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, సర్పంచులు యట్ల మహేశ్వర్ రెడ్డి, ఉమ్మలా దుర్గ, కే.రవి, కే.బాబు, టీ.పవన్ తదితరులు పాల్గొన్నారు.



పోలవరం పోరాట కేసు కొట్టివేత

16 సంవత్సరాలు కోర్టు చుట్టూ తిరిగిన ఉద్యమకారులు

నాడు సీపీఐ(ఎం) చెప్పిందే నేడు నిజమవుతుంది

నవతెలంగాణ-భద్రాచలం టౌన్

'పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే 450 గ్రామాలు జల సమాధి అవుతాయని 9 మండలాలు, మూడు లక్షల ఎకరాల సాగు భూమి, రెండు లక్షల ఎకరాల అటవితో పాటు పాపికొండల అందాలు, దక్షిణ అయోధ్యగా పిలిచే భద్రాద్రి రామాలయం కనుమరుగవుతాయని ముందే అధ్యయనం చేసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఐ(ఎం) పోరాటం చేయగా సుమారు 79 మందిపై పోలీసులు పెట్టిన హత్యాయత్నం కేసు 16 సంవత్సరాలు అనంతరం శుక్రవారం కొత్తగూడెం జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి సరైన సాక్షా ఆధారాలు లేవని కొట్టివేశారు.'

వివరాలకు వెళ్తే 2006లో రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మించ తలపెట్టింది. ఈ ప్రాజెక్టు వల్ల భద్రాచలం డివిజన్‌లోని చింతూరు, విఆర్ పురం, కూనవరం, భద్రాచలం రూరల్, భద్రాచలం పట్టణంతో పాటు కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలు పూర్తిగా జల సమాధి అయిపోతాయని ఇన్ని లక్షల మంది ప్రజలను నిర్వాసితులు చేసే ప్రమాదకర పోలవరం ప్రాజెక్ట్ నిర్మించవద్దని, తప్పని పరిస్థితుల్లో నిర్మించిన డిజైన్ మార్చి ముంపు తగ్గించే విధంగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక రకాల పోరాటాలు నిర్వహించింది.

పోలవరం సర్వేని అడ్డుకోవటంతో పాటు గ్రామ గ్రామాలలో పంచాయతీ పాలకవర్గాలు ప్రాజెక్టుకు వ్యతిరేక తీర్మానాలు చేయించారు. అప్పటి ఎమ్మెల్యే సున్నం రాజయ్య నాయకత్వంలో ముంపు ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. తహసీల్దార్లకు, ఐటిడిఏ పీవోలకు, జిల్లా కలెక్టర్లకు తోపాటు అన్ని ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు అందించారు. నిరాహార దీక్షలు, నిరసన దీక్షల చేశారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం స్పందించకపోగా ప్రాజెక్టు నిర్మాణం పనులను వేగవంతం చేశారు.

అసలు ఆ రోజు ఏం జరిగింది

2007 జనవరి 29 నాడు ఎన్ని పోరాటాలు నిర్వహించిన ప్రభుత్వం దిగి రాకపోవడంతో సీపీఐ(ఎం) భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అప్పటి డివిజన్ కార్యదర్శి బండారు రవికుమార్ నాయకత్వంలో పార్లమెంట్ సభ్యులు మిడియం బాబురావు పాటు ముంపు మండలాలలోని సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులు, పోలవరం నిర్వాసిత ప్రజలతో కలిసి భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. పోలవరానికి వ్యతిరేక ఉద్యమానికి ప్రజల్లో పెరుగుతున్న మద్దతుని పసిగట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాన్ని ఏ విధంగా అయినా అణిచివేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండా లాఠీచార్జితో కార్యకర్తలపై పోలీసులు దాడికి దిగారు. సీపీఐ(ఎం) కార్యకర్తలను, ప్రజలనూ గాయపరిచారు. లాఠీఛార్జీనీ నిరసిస్తూ ఉద్యమకారులు బ్రిడ్జి సెంటర్‌లో శాంతియుతంగా రాస్తారోకో నిర్వహించారు.

దాంతో జిల్లా ఏఎస్పీ రమేష్ కుమార్, ఇతర ప్రాంతాల నుండి వచ్చిన పోలీస్ అధికారులచే ఉద్యమకారులపై లాఠీచార్జీతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అంతటితో ఆగకుండా ఇటువంటి హెచ్చరిక లేకుండా కాల్పులు ప్రారంభించారు. కాల్పుల్లో సీపీఐ(ఎం) కార్యకర్త కుంజ నర్సయ్య కాలికి బుల్లెట్ తలిగి కాలును కోల్పోయాడు. అనేకమంది కార్యకర్తలకు గాయాలయ్యాయి. సిపిఎం ప్రధాన నాయకత్వాన్ని అక్రమంగా అరెస్ట్ చేసి అనేక రకాల కేసులతో పాటు పోలీసులను హత్యా చేసే ప్రయత్నం చేశారని 307 సెక్షన్ సహా 12 సెక్షన్లు కింద 79 మంది ప్రధాన నాయకత్వం పైన తప్పుడు కేసు నమోదు చేసి వరంగల్ సెంట్రల్ జైలుకి తరలించారు.



17 రోజులు అనంతరం కండిషన్ బెయిల్ పై జైల్లో నుండి విడుదలైన నాయకులు నేటి వరకు కోర్టు చుట్టూ తిరిగారు. ఈ కేసులో ఉన్న వారిలో 12 మంది ఈకాలంలో చనిపోగా 67 పోలీసులు చేసిన అభియోగాలకి సరైన సాక్ష్యా ఆధారాలు లేని కారణంగా శుక్రవారం కొత్తగూడెం జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి నీరజ కేసుని కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. ఉద్యమకారుల తరపున న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, కే.పుల్లయ్య వాదించారు.

నాడు సీపీఐ(ఎం) చెప్పిందే నేడు నిజమవుతుంది

పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే భద్రాచలం జల సమాధి అవ్వటం ఖాయమని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్మిస్తుంటే ఏ ఇతర రాజకీయ పార్టీలు స్పందించకపోగా, అవహేళన చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఆరోజు సిపిఎం నాయకత్వం చెప్పిన మాటలు నేడు అక్షర సత్యంగా కనిపిస్తున్నాయి. 2022 జూలై, ఆగస్టు నెలలో వచ్చిన వరదలకు భద్రాచలంతో పాటు తొమ్మిది మండలాలు గోదావరి ముంపు గురైన విషయం తెలిసిందే. కేవలం ప్రాజెక్టు వద్ద కాపర్ డ్యాం పూర్తి అయితేనే ఈ స్థాయిలో ముంపు ఉంటే ప్రాజెక్టు పూర్తిగా నిర్మిస్తే భద్రాచలం భవిష్యత్తు ఏంటని ఇప్పుడు కలవరం మొదలైంది. అంతేకాకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలానికి ముంపు తప్పదని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే అంగీకరించిన పరిస్థితి కనిపిస్తుంది. 2014లో కూడా ముంపు పేరుతో మండలాలను ఆంధ్రాలో కలపడంతో కేంద్ర ప్రభుత్వ కుట్ర స్పష్టమైనది.

ముంపు నివారణ చర్యలు చేపట్టాలి



పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలానికి కలిగే నష్టాన్ని అంచనా వేసి ముందు నుంచి ఉద్యమిస్తున్న సిపిఎంకి అన్ని రాజకీయ పార్టీలు ఐక్య ఉద్యమానికి కల్సి రావాలి. ముంపుని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో పోరాటం ప్రారంభించాలి. ముంపు తగ్గించేందుకు కరకట్ట ఎత్తు వెడల్పు పెంచేందుకు నిధులు వెంటనే మంజూరు చేయాలి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీర్ల బృందంచే సర్వే చేసిన సందర్భంలో కరకట్ట ఎత్తు వెడల్పు పొడవు పెంచటానికి 832 కోట్లు ఖర్చు అవుతుందని అదేవిధంగా భూసేకరణకు 237 కోట్లు మొత్తంగా సుమారు 1600 కోట్ల ఖర్చు అవుతుందని ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని పోలవరం జాతీయ ప్రాజెక్టు కాబట్టి ఆ నిధులను కేంద్రమే విడుదల చేసి వెంటనే పనులు చేపట్టాలి. పోలీసులు పెట్టిన కేసులు, నిర్బంధాలు సిపిఎం పోరాటాన్ని ఏమాత్రం ఆపలేవని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో భద్రాచలం ఏజెన్సీ పరిరక్షణ కోసం సిపిఎం ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు కార్యకర్తలు సిద్ధమవుతున్నారని తెలియజేశారు.

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



హిటాచి ఏటీఎం సెంటర్‌ను ప్రారంభించిన రేగా

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం జానంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన హిటాచి ఏటీఎం సెంటర్‌ను విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంకు విచ్చేసిన రేగాకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామంలో బ్రాంచ్ ఓపెన్ చేయడం ద్వారా సౌకర్యవంతమైన సేవలు ప్రజలకు అందించాలని కోరుకుంటున్నామని విప్ రేగా అన్నారు. అనంతరం జానంపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. జానంపేట గ్రామానికి చెందిన వ్యాపారవేత్త కన్నెగంటి దుర్గాప్రసాద్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ భద్రయ్య, సహకార సంఘం డైరెక్టర్ కామేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల కుమార్, బోడ ఈశ్వర్, తదితర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల ప్రోత్సహానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది

• కలెక్టర్ దురిశెట్టి అనుదీప్

నవతెలంగాణ-కొత్తగూడెం



వికలాంగుల ప్రోత్సహానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం క్రీడా మైదనాంలో ఎలక్ట్రానిక్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సిఎస్ఆర్ నిధులతో వికలాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ పాల్గొని ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఈసిఐఎల్ కంపెనీ ఉపకరణాలు అందచేయడం చాలా సంతోషమన్నారు. మనిషికి వైకల్యం అడ్డుకాదని విధి ఆడిన వింత నాటకంలో కొందరు అవయవ లోపాలకు గురయ్యారన్నారు. సహాయ పరికరాలను మంచిగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో సహాయ పరికరాలు కావాలని వికలాంగులు విజ్ఞాపనలు ఇచ్చేవారని చెప్పారు. విజ్ఞాపనల ప్రకారం వికలాంగుల ఎంపిక కొరకు ఆరు నెలల క్రింతం కసరత్తు ప్రారంభించి క్యాంపులు నిర్వహించి అర్హులను ఎంపిక చేసినట్లు చెప్పారు. 405 మంది దివ్యాంగులకు వివిధ పరికరాలు అందచేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఈసిఐఎల్ కంపెనీ దివ్యాంగులకు అవసరమైన పరికరాలు ఇచ్చేందుకు ముందుకు రావడం చాలా సంతోషమని చెప్పారు. 40 లక్షల సిఎస్ఆర్ నిధులతో 741 పరికరాలను నేడు అందచేస్తున్నామని చెప్పారు. శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఈ పరికరాలు చాలా ఉపయోగపడతా యని చెప్పారు. ఈసిఐఎల్ కంపెనీ ఇచ్చిన ఈ పరికరాలు 405 మంది జీవితాలకు ఉపయోగపడు తున్నాయని చాలా సంతోషమని చెప్పారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి మరికొంత మంది వికలాంగులకు ఉపయోగపడే పరికరాలు అందచేస్తామని చెప్పారు. కంపెనీలు లాభాల్లో కొంత మొత్తాన్ని సమాజికంగా సమాజానికి ఉపయోగపడా లన్నదే సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు.

ఈసిఐఎల్ కంపెనీ ప్రజలకు ఉపయోగ పడే ఎన్నో పరికరాలు తయారు చేశారని చెప్పారు. ఈసిఐఎల్ ఓటు హక్కు వినియోగించే కంపెనీ ఓటింగ్ యంత్రాలను తయారు చేసిన ఘనత ఉన్నదని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ కాపు సీతాలక్ష్మి, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మహిళా శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా, ఈసిఐఎస్ అడిషనల్ జనరల్ మేనేజర్ మునికృష్ణ, అలీం, సీనియర్ మేనేజర్ రాజేష్, ఈసిఐఎల్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ విశ్వనాధరెడ్డి, పర్సనల్ అధికారి సునీల్ కుమార్, సీనియర్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, యూనిట్ మేనేజర్ బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్ లక్ష్మణ్ వికలాంగుల సంక్షేమ సంఘ అధ్యక్షులు గుండపునేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు మారినా రాని వంతెన

• మంత్రి సాబ్ ఓ సారి ఇటు చూడండి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

రాష్ట్రం, మంత్రులు మారినా వాగుకు వంతెన మాత్రం రావడం లేదు. మండల పరిధిలోని మర్రిగూడెం రాజపురం మధ్య గల వాగుకు వంతెన రావడం లేదని ఇరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజపురం నుండి మార్రిగూడెం మధ్య సుమారు 3 కిలోమీటర్లు తారు రోడ్డు కిలోమీటరు కోటిన్నర ఖర్చు పెట్టి పోశారు. కానీ సుమారు 30 మీటర్లు వంతెన నిర్మాణం మాత్రం మర్చిపోయినారు అధికారులు. కోట్లు రూపాయలు ఖర్చు పెట్టిన రోడ్డు అంత నాశనం అయి పోయే దశకు వస్తున సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు వంతెన గురించి పట్టించుకోవడం లేదని, గతంలో ఎన్నికైన శాసన సభ్యులు తాటి వెంకటేశ్వర్లు ఇప్పుడు వున్న శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరావు, గతంలో రోడ్లు భవనాలు శాఖ మంత్రిగా పని చేసిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనేక సార్లు ఈ రోడ్డు మీదిగా వెళ్ళిన ఒక దశలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కారు వాగుకు వంతెన లేకపోవడంతో అదే వాగులో నుండి కారు దిగి నడిచిపోయిన సంఘటనలు ఉన్నాయి. అయినా ఏ ఒక్కరూ కూడా వాగుకు వంతెన గురించి పట్టించుకోవడం లేదని సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రిగూడెం రైతులు మండల కేంద్రానికి, వరి పొలాలు దగ్గరకు, పండించిన పంట ఇంటికి తీసుకుపోవాలన్నా వాగుకు 30 మీటర్లు వంతెన లేక సుమారు 12 కిలోమీటర్లు చుట్టూ తిరిగి అబ్బుగుడేం గ్రామం నుండి గాని, అన్నపురెడ్డిపల్లి నుండి గాని మర్రిగూడెం రావాల్సి వస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబధిత మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అబ్బుగూడెం ధ్వజస్తంభం కార్యక్ర మానికి వస్తున్న నేపథ్యంలో మండలంలో ప్రజా ప్రతినిదులు, అశ్వారావుపేట శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరావు మంత్రి దృష్టికి వంతెన నిర్మాణం గురించి తీసుకుపోయి, వంతెన నిర్మాణం అయ్యే విధంగా చూసి రైతులు కష్టాలు తీర్చాలని మండలంలోని పలువురు రైతులు ప్రజలు కోరుకుంటున్నారు.



వాగుకు వంతెన ఏర్పాటు చేయండి : రైతు అప్పయ్య



వర్షా కాలంలో వాగు దాట లేక ఒక యువకుడు వాగులో కొట్టుకుపోయి చెట్టు కొమ్మ పట్టుకొని ప్రా ణాలు కాపాడుకున్నాడు. వర్ష కాలంలో మర్రిగూడెం నుండి అంబులెన్స్ యర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాగు దాట లేక చుట్టూ తిరిగి వెళ్ళిన సంఘటనలు చాలా వున్నాయి. నూతన మండలంగా అన్నపురెడ్డిపల్లి ఏర్పడిన తరువాత రాజపురం, మర్రిగూడెం మధ్య వాహనాలు అధిక సంఖ్యలో వెళు తున్నాయి. మర్రిగూడెం నుండి రాజపురం ప్రైవేట్ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు వ్యాన్ వాగు దాట లేక వర్ష కాలంలో వంతెన లేక అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు. వెంటనే సంబధిత అధికారులు వంతెన నిర్మాణం చేపట్టి ప్రజలకు రవాణా సమస్య తీర్చాలి.

సీసీ రోడ్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-చంద్రుగొండ

మండల పరిధిలోని రావికంపాడు గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ సర్పంచ్ భానోత్ రణ్య భూమిపూజా చేశారు. మంజూరైనా 15లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు భూపతి రమేష్, వార్డ్ నెంబర్ భద్రు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నీటి ఎద్దడి నివారిస్తాం..!

• రివ్యూ మీటింగ్‌లో చైర్మెన్, కమిషనర్

నవతెలంగాణ-ఇల్లందు

వేసవికాలంలో పట్టణ ప్రజలకు నీటి సమస్య లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ అంకుల్ షావలి తెలిపారు. ప్రజాక్షేత్రంలో పర్యటనలో భాగంగా శాసనసభ్యులు బానోత్ హరిప్రియ హరి సింగ్ నాయక్ వార్డులలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న క్రమంలో ప్రధానంగా నీటి సమస్యను ప్రజలు లేవనెత్తారు. దీంతో నీటి సమస్యను పరిష్కరించేందుకు వారు యుద్ధ ప్రాతిపదికంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వాటర్ సెక్షన్ అధికారులు, సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పడక ముందు నీటి సమస్య ఎంతుందో ప్రజలందరికీ తెలుసు అని తెలిపారు. పాలకవర్గం ఏర్పడిన తర్వాత ప్రధానంగా నీటి సమస్యపై దృష్టి పెట్టి ఎమ్మెల్యే సూచన మేరకు రోజు విడిచి రోజు పట్టణ ప్రజలకు నీళ్లు అందిస్తున్నామని తెలిపారు. గత మూడు, నాలుగు నెలల నుంచి కొంత ఇబ్బంది లేవనెత్తిన విషయం వాస్తవమేనని దాని అధిగమించేందుకే నేడు ఈ రివ్యూ మీటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కృషితో నిరుపయోగంగా ఉన్న కళాంజలి ట్యాంకు, కాళీ మాత వాటర్ ట్యాంకులను ఉపయోగంలోకి తీసుకువచ్చామని, నూతనంగా నిర్మించిన మిషన్ భగీరథ 12వ వార్డు వాటర్ ట్యాంక్ కూడా ఉపయోగంలోకి వచ్చిందని, అతి త్వరలో కాకతీయ నగర్, కోర్టు ట్యాంక్ కూడా అందుబాటులోకి రానున్నాయని తెలియజేశారు. వేసవికాలంలో ఎట్టి పరిస్థితిలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలని అధికారులకు తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఆజాం, నవీన్ కుమార్, పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుదినం...జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.praja.khammam@gmail.com
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం 25 ఫిబ్రవరి 2023

దొంగనోట్ల వ్యాపారం ముఠా అరెస్టు



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం 1టౌన్ పోలీసులు చాకచక్యంగా దొంగ నోట్ల ముఠాను పట్టుకున్నారని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. కేసుకు సంబంధించి శుక్రవారం ప్రకటనలో వివరాలు వెల్లడించారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కొత్తగూడెం ఒకటవ పట్టణ ఎస్ఐ టి.లచ్చయ్య, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఘని, సురేష్, వీరన్న కామేష్ సిబ్బందితో కలిసి బస్ స్టాండ్ సెంటర్ ప్రాంతం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానస్పదంగా ఒక కారు టిఎస్-09, ఎఫ్‌క్యూ-5695 నెంబర్‌గల కారు లోపల నుండి నలుగురు వ్యక్తులు దిగి, కంగారు పడుతు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకొని విచారించగా వారు దొంగ నోట్ల వ్యాపారం చేస్తున్న మూఠాగా గుర్తించారు. వారి పేర్లు జూలూరుపాడు, మండలం కొమ్ముగూడెం ప్రాంతానికి చెందిన బానోత్ బోజ్యా నాయక్, ఖమ్మం, వేంసూరు మండలంకు చెందిన తనమళ్ళ రాజ శేఖర్, ఆంధ్రప్రదేష్‌కు చెందిన గంపల గూడెం మండలంకు చెందిన బీరేవెల్లి రాంబాబు, కొత్తగూడెం, బాబుక్యాంపుకు చెందిన జలమనీ భాస్కర్‌గా గుర్తించామని డిఎస్పీ తెలిపారు. వారిని విచారించగా విచారణలో మేము, కారు ఓనర్ అయిన కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం, విద్యానగర్‌కు చెందిన పున్నం ప్రసాద్ అందరమూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి ప్రజలను మోసం చేయాలనీ పథకం వేసుకొని జన సంచారం ఉన్న ప్రాంతాలైన సంతలు, కూరగాయాల మార్కెట్ ఏరియాలో ఈజీగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యంతో దొంగనోట్ల వ్యాపారం చేయాలనీ నిర్ణయం తీసుకున్నామని తెలిపారని చెప్పారు. గతంలో చాలా సార్లు ఈ విధంగా మోసాలు చేసి డబ్బులు సంపాదించామని, కొత్తగూడెం కూరగాయల మార్కెట్ ఏరియాలో నకిలీ నోట్లతో అక్కడ ఉన్న ప్రజలను మోసగించి కుట్ర పూరితంగా నకిలీ నోట్లతో చూపించి ఒరిజినల్ నోట్లు సంపాదించాలని నిర్ణయించుకొని బయలుదేరామని, ఇంతలో పోలీసులు వచ్చారని, కారు ఓనర్ పారిపోయారని తెలిపారు. కారులో రూ.3 లక్షల (ఒరిజినల్ నోట్లు), దొంగ నోట్లు తయారు చేయడానికి ఉపయోగించే నల్ల పేపర్ బండిల్స్ ఐదు కట్టలు, నకిలీ నోట్లకు ఉపయోగించే యాసిడ్ బాటిల్స్ రెండు, చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఉపయోగించే రూ.500 నోట్లు నకిలీ కట్టలు 33 కలవు, ఒక కారు టిఎస్-09, ఎఫ్‌క్యూ-5695, వీటిని స్వాధీన పరచుకుని 1టౌన్ సిఐ బి.సత్యనారాయణ కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచారని చెప్పారు.

గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఎస్సైకు సన్మానం



నవతెలంగాణ-పినపాక

మండల పరిధిలోని ఏడుళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా నాగుల్ మీరా ఖాన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా మండల గ్రామీణ వైద్యుల బృందం ఆయనను కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎస్సై నాగుల్ మీరా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ వైద్యుల సేవలను మరువలేనివన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామీణ వైద్యులు ప్రజలకు ఎంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. పరిమితిని మించి వైద్యం కూడా చేయవద్దని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు శ్రీరామ్, నరసింహారావు, శివ శంకర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



నవతెలంగాణ-అశ్వాపురం

మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో స్థానిక సర్పంచ్ కాక అశోక్ ఆయుర్వేద సృష్టి కర్త అయినటువంటి భగవాన్ ధన్వంతరికి జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరంను ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి జి.అరుణ సుమారు 195మంది రోగులను పరీక్షించి ఆయుర్వేద మందులు అందజేశారు. అలాగే రోగులకు ఆయుష్ ఆరోగ్య కరదీపికలు అందించి ఆయుర్వేద జీవన శైలి, ఔషధాల విశిష్టత వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ తౌఫీక్, భవాని, నాగమణి, శ్రీనివాస్, ఎస్ఎన్ఓ జి.రాధిక, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

సమ్మె విరమణ

- నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన ఏటీడబ్ల్యూఓ



నవతెలంగాణ-ఇల్లందు

52 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న పీఎంహెచ్ హాస్టల్ ఔట్సోర్సింగ్ వర్కర్ల వేతన సాధన కోసం చేసిన పోరాటంలో విజయం సాధించారు. ఫలితంగా శుక్రవారం ఏటిడబ్ల్యూఓ రూపాదేవీ చేతుల మీదుగా నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. అనంతరం తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ సీఐటీయూ పోరాట ఫలితంగా వేతన సాధన కోసం నిరవదిక సమ్మె చేశారని ప్రభుత్వం వేతనాలు విడుదల చేసిన ఫలితంగా సమ్మె విరమణ చేశారని 52 రోజులు సమ్మె చేసిన కార్మికులకు సీఐటీయూ జిల్లా కమిటీ తరుపున అభినందనలు తెలిపారు. ఈ సభలో సీఐటీయూ నాయకులు మరియా, మన్యం మోహన్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జయా, ఈసం భద్రమ్మ, ఏదలపల్లి అంజమ్మ, శైలజ విజయ, సుధ, బిజ్జా దీప, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-ఇల్లందు

ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించుతున్న ఇల్లందు లేక్ పార్క్ నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు పరిశీలించారు. త్వరగతిన పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. అతిత్వరగా ప్రారంభ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే విధంగా పార్కును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కటకం పద్మావతి , అంకె పాక నవీన్ కుమార్, కుమ్మరి రవీందర్, మున్సిపాలిటీ ఏఈ శంకర్, టిఆర్ఎస్ పార్టీ పట్టణ యువజన అధ్యక్షులు మెరుగు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఖదీర్ ఖాన్ మృతి కేసులో బాధ్యులపై హత్య కేసు నమోదు చేయాలి : బీఎస్పీ



నవతెలంగాణ-కొత్తగూడెం

మెదక్ జిల్లాలో లాకప్ డెత్‌కు గురైన ఖదీర్ ఖాన్ మృతికి కారకులైన పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ శ్రేణులు, ముస్లింలతో కలిసి రైల్వే మస్జిద్ ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడారు. కూలి చేసుకుని బతికే ఖదీర్ ఖాన్‌కు ఎలాంటి ఆధారాలు లేకపోయినా చైన్ స్నాచింగ్ చేశారని అక్రమంగా అరెస్టు చేసి కొట్టారన్నారు. నాలుగు రోజుల వరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేదని, తీవ్రంగా గాయపడి ఆరోగ్యం క్షీణిస్తే గుట్టు చప్పుడు కాకుండా ట్రీట్ మెంట్ చేయించి రిపోర్టులు తగులబెట్టారని ఆరోపించారు. గతంలో అడ్డగుడూర్ పోలీసు స్టేషన్‌లో ఇలాగే మరియమ్మను చంపేశారన్నారు. పోలీసు దెబ్బలకు మృతి చెందిన ఖదీర్ ఖాన్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్ గ్రేషియాతో పాటు వారి పిల్లలకు ఉచిత విద్య అందించాలని, డబుల్ బెడ్ రూం ఇల్లు, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ సలీం,షేక్ ఫారూఖ్, ఎండీ.అప్రోజ్, సజీద్, సమీర్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రాష్ట్రాల అటవీశాఖ అధికారుల సమావేశం



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం అటవీ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం అంతరాష్ట్ర అటవీ సంరక్షణపై నాలుగు రాష్ట్రాల ఉన్నతాధికారుల సమావేశం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారి లక్ష్మణ్ రంజిత్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చత్తీస్గఢ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా అటవీ అధికారులు పాల్గొన్నారు. అనేక అంశాలపై చర్చించారు. అంతరాష్ట్రాల అటవీ సరిహద్దులలో అక్రమ కలప రవాణా నివారణ చర్యలు, అంతరాష్ట్రాల అటవీ సరిహద్దుల నిర్వహణపై చర్యలు, అటవీ ఉత్పత్తుల సేకరణలో నాణ్యత పాటించుట, అక్రమ పోడు వ్యవసాయంపై నివారణా చర్యలు, గుత్తి కోయలు అక్రమ చొరబాటు, అటవీ ఆక్రమణపై తగు చర్యలు గురించి సుదీర్ఘంగా చర్చించారు.

ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- సీఎస్ శాంత కుమారి
- పోడు కంటి వెలుగు కార్యక్రమాల తీరుపై కలెక్టర్‌ను అభినందించిన సీఎస్



నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మునిసిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు, పట్టణ ప్రాంతాలలో రెండు పడక గదుల నిర్మాణం, 58, 59, 76, 118, ప్రభుత్వ జీఓల ప్రకారం చేయవలసిన క్రమబద్దీకరణ, పోడు భూములు, ఆయిల్ పామ్ సాగు, హరితహారం, ఐడీఓసి కార్యాలయాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టర్ అనుదీప్, అటవీ అధికారి రంజిత్ నాయక్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి సమీకృత కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుండి పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పట్టాలు లేకుండా ఇళ్ల నిర్మించుకున్న భూముల వివరాలను ప్రోఫార్మా 1 ప్రకారం సేకరించామని, సదరు భూమి క్రమబద్ధీకరణ చేసేందుకు గల అవకాశం, ప్రాతిపదిక, అనుసరించాల్సిన విధానంపై నివేదిక తయారు చేయాలని కలెక్టర్‌లకు సీఎస్ సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చి 15 వరకు పూర్తి చేస్తామని తెలిపారు. పామ్ ఆయిల్ సాగుకు 16860 ఎకరాలు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఇప్పటివరకు 13575 ఎకరాలు పూర్తి చేశామని మిగిలిన 3285 ఎకరాలు ప్రక్రియను వచ్చే నెల 15వ తేదీ వరకు పూర్తి చేస్తామని చెప్పారు. మొక్కలు కూడా సిద్ధంగా ఉన్నాయని వేగంగా లక్ష్యాన్ని పూర్తి చేయుటకు చర్యలు చేపడతామని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమం గురించి ప్రస్తావిస్తూ పరీక్షలు నిర్వహణలో రీడింగ్ అద్దాలను తక్షణమే పంపిణీ చేస్తున్నామని, కంటి అద్దాలు అవసరమైన వారి వివరాలు పోర్టల్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. పోర్టల్‌లో నమోదు ఆధారంగా వచ్చిన ప్రీస్కిప్షన్స్ కంటి అద్దాలు తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేసి వివరాలను కోర్టులో నమోదు చేసినట్లు చెప్పారు.

జీవో నెంబర్ 76లో పెండింగ్లో ఉన్న 231 దరఖాస్తులను విచారణ భక్తులు పూర్తి చేస్తామని చెప్పారు. లబ్ధిదారులకు పట్టాలు పంపిణీను పూర్తి చేస్తామని తెలిపారు. పట్టాలు జారీకి సంబంధించి జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసిన పట్టాలు ప్రింటింగ్ ప్రక్రియను చేపట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి రంజిత్ నాయక్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, ఉద్యాన అధికారి మరియన్న, వ్యవసాయ అధికారి అభిమన్యుడు, డీఆర్ఓ అశోక్ చక్రవర్తి, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు స్వర్ణలత, రత్న కళ్యాణి, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





నేడు మండలంలో మంత్రి పర్యటన

- అచ్యుతాపురంలో మన ఊరు మన బడి ప్రారంభం
- నారంవారిగూడెంలో నూతక్కి విగ్రహం ఆవిష్కరణ
- గతంలో ఉపముఖ్యమంత్రి మహ్మద్ ఆలీ, స్పీకర్ సందర్శన

నవతెలంగాణ-అశ్వారావుపేట

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శనివారం మండలంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసారు. మండలంలోని అచ్యుతాపురంలో మన ఊరు మన బడి నిధులతో పునరుద్ధరించిన ప్రాథమిక పాఠశాలను 11.30 ప్రారంభిస్తారు. అనంతరం 12 గంటలకు నారంవారిగూడెంలో ఏర్పాటు చేసిన అశ్వారావుపేట పరపతి సంఘం మాజీ అధ్యక్షులు నూతక్కి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 12.20కి అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం ఆంధ్రా పర్యటన చేయనున్నారు. అయితే అచ్యుతాపురంలో 2016లో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పర్యటించి ఇక్కడ ఫాం ఆయిల్ క్షేత్రాలను సందర్శించారు. 2018లో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మహ్మద్ ఆలీ రైతులకు పట్టాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

వాహనాలకు సరైన ధృవపత్రాలు లేకపోతే కేసులు

నవతెలంగాణ-పినపాక

రోడ్లపై ప్రయాణించేటప్పుడు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని ఈ బయ్యారం ఎస్సై నాగుల్ మీరాఖాన్ హెచ్చరించారు. శుక్రవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో వాహన తనిఖీలను చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారులకు కేసులు నమోదు చేశారు. ప్రతిరోజు వాహన తనిఖీలను చేపడతామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దిలీప్ కుమార్, పోలీస్ సిబ్బంది, సిఆర్పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం ఉద్యమం కేసు కొట్టివేత పట్ల హర్షం

16 సంవత్సరాలుగా కొనసాగిన కేసు

- భద్రాచలం ప్రాంత అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఉద్యమం కొనసాగుతుంది
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



నవతెలంగాణ-భద్రాచలం

2007లో పోలవరం ఉద్యమంపై భద్రాచలం బ్రిడ్జి సెంటర్లో జరిపిన పోలీస్ కాల్పుల కేసు శుక్రవారం జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి కొట్టివేయడం జరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం భద్రాచలం పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన పాత్రికేయ సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించి అనేక విషయాలు వెల్లడించారు. నిర్వాసిత ఉద్యమకారుల తరుపున సీనియర్ న్యాయవాదులు కొల్లి సత్యనారాయణ, కె.పుల్లయ్య వాదించడం జరిగిందని పేర్కొన్నారు. పోలీసులు ఉద్యమకారులపై మోపిన అభియోగాలు నిరాధారమైనవని కోర్టు నమ్ముతున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నాట్లు వెల్లడించారు. గత 16 సంవత్సరాల కాలంలో ఈ కేసులో ఉన్న మొత్తం 79 మందిలో 11 మంది చనిపోవడం జరిగిందని, మిగిలిన 67 మందిని నిరపరాదులుగా కోర్టు తీర్పు వెలువడించిందన్నారు. పోలవరం కాల్పుల కేసు కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2004లో సీపీఐ(ఎం) నాయకత్వంలో పోలవరం ముంపు నుండి భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాన్ని, భద్రాచలం పట్టణాన్ని రక్షించాలని పెద్ద ఎత్తున నిర్వహించిన ఉద్యమం పట్ల నాటి ప్రభుత్వం ప్రదర్శించిన ధమనకాండలో భాగంగా 2007 జనవరి 29వ తేదీన భద్రాచలం బ్రిడ్జి సెంటర్లో పోలీసులు ఎటువంటి హెచ్చరికలు లేకుండా భాష్పవాయువు గోళాలు ప్రయోగించటం, లాటి చార్జీ చేయటం, పోలీసు కాల్పులు నిర్వహించడం ద్వారా తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం జరిగిందన్నారు. ముంపు లేని ప్రత్యామ్నాయం చూడాలని అనేకమంది ఇంజనీరింగ్ నిపుణులు చెప్పినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగానే భద్రాచలం ప్రాంతం ముక్కలైనదని, రాముని జపం చేసే బీజేపీ ప్రభుత్వం మోడీ ప్రధాని అయిన తరువాత నియోజకవర్గంలోని నాలుగు మండలాలను ఆంధ్రాలో కలుపుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఈ ప్రాంతానికి బిజెపి ద్రోహం చేసిందని అన్నారు. పోలవరం నిర్మాణం ముంపు ప్రమాదం గత సంవత్సరం వరదల్లో ప్రజలు చవి చూశారని ఇప్పటికి భద్రాచలం పట్టణానికి పోలవరం బ్యాక్ వాటర్ ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ ఇంజనీరింగ్ నిపుణులు భద్రాచలం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలు పోలవరం బ్యాక్ వాటర్‌తో ముంపు గురికాకుండా కరకట్టల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, సుమారు 1600 కోట్ల రూపాయలు నిధులు అవసరమవుతాయని నివేదికలు పంపిన నేపథ్యంలో తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత తీసుకొని నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ పత్రిక విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, పార్టీ సీనియర్ నాయకులు జిఎస్ శంకర్రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, పి.సంతోష్ కుమార్, నాదెళ్ల లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు జీవనజ్యోతి, జి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.





ఆట 'కెక్కుతున్న' స్థలాలు

- చింతగుప్పలో స్మశాన వాటికలో క్రీడా ప్రాంగణం
- తుప్పపట్టిన బోరింగ్ పైపులతో పెరాలాల్ బార్ ఏర్పాటు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

గ్రామీణప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామాలలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కోసం స్థలాల ఎంపిక, క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో కింది స్థాయి అధికారుల నిర్లక్షంతో అవి అటకెక్కుతున్నాయనే చెప్పవచ్చు.

మండల పరిధిలోని చింతగుప్ప గ్రామ పంచాయతీలోని చింతగుప్ప గ్రామంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ఆదేశాల మేరకు పంచాయతీ అధికారులు ఆఘ మేఘాల మీద ఉన్నతాధికారుల మెప్పు కోసం క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఈజిఎస్ నిధులు ద్వారా చేపట్టిన ఈ క్రీడా ప్రాంగణాన్ని కనీస ఆట స్థలం లేని స్మశాన వాటికలో ఏర్పాటు చేయడం పై పంచాయతీ ప్రజలనుండి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్మశాన వాటిక నిర్వహణకు సరిపడా స్థలం లేని చోట క్రీడా ప్రాంగణం ఎలా ఏర్పాటు చేశారని ప్రజలు పంచాయతీ అధికారులను నిలదీస్తున్నారు. క్రీడా ప్రాంగణాలు ఆహ్లాదకరమైన సుశిశాలమైన ప్రదేశాలలో ఉండాలే తప్ప స్మశాన వాటికలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం ఏమిటి అని యువత సైతం ప్రశ్నిస్తున్నారు.

తుప్పు పట్టిన బోరింగ్ పైపులతో : చింతగుప్ప గ్రామంలో స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం స్థలంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటుతో పాటు సింగల్ బార్, డబుల్ బార్ ఏర్పాటు చేశారు. పెరాలాల్ బార్ ఏర్పాటు కోసం తుప్పు పట్టిన బోరింగ్ పైపులను వెల్డింగ్ చేసి మరీ ఏర్పాటు చేశారు. పెరాలాల్ బార్ సైతం వ్యాయామానికి సైతం అనూకూలంగా లేవనే చెప్పవచ్చు. ఏది ఎమైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేస్తున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు చూస్తే క్రింది స్థాయి అధికారుల నిర్లక్షం వలన అవి ఆటకెక్కుతున్నాయనే ఆరోపణలు గ్రామీణ ప్రాంత ప్రజల నుండి వెల్లువెత్తుతున్నాయనే చెప్పవచ్చు.

తుప్పు పట్టిన పైపులు తొలగిస్తాం : ఎంపీడీఓ యం.చంద్రమౌళి

క్రీడా ప్రాంగణంలో పెరాలాల్ బార్ కోసం ఏర్పాటు చేసిన తుప్పు పట్టిన పైపులు వెంటనే తొలగిస్తాం. స్మశాన వాటికలో క్రీడా స్థలం ఏర్పాటు చేసిన మాట వాస్తవమే, ఆట స్థలం క్రీడలకు అనుకూలంగా ఉందో, లేదో చూస్తాం. విషయాన్ని ఎంపీఓ ముత్యాలరావుకు తెలియజేసి తగు చర్యలు తీసుకుంటాం.

మాదిగలు రాజకీయంగా ఎదగాలి

నవతెలంగాణ-మణుగూరు

మాదిగలు రాజకీయంగా ఎదగాలని నియోజకవర్గ అధ్యక్షులు రావులపల్లి రామ్మూర్తి అన్నారు. శుక్రవారం మాదిగ ఐక్యవేదిక కార్యాలయంలో కమిటీ సమావేశం గంగారపు రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో దళితులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రకాలుగా వెనకబడి ఉన్నారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు దళితులను ఓటు బ్యాంకు గానే చూశారన్నారు. ఏ రాజకీయ పార్టీ కూడా దళితులను నాయకుడుగా చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక నియోజకవర్గ నాయకులు పోడుతూరి విక్రం, ప్రసాదు, రాజు, చుక్క శంకర్, రాములు, రాము, కృష్ణ, చిరంజీవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే ఇవ్వాలి

- నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల ఆందోళన
- నిరవధిక నిరసన కార్యక్రమాలు జేఏసీ పిలుపు
- పీఆర్‌సీ ఇచ్చే వరకు పోరాటం : జేఏసీ


కొత్తగూడెం


మణుగూరు

నవతెలంగాణ-కొత్తగూడెం

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2022 పీఆర్‌సీ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పిఈ జేఏసీ) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల ఆందోళన నిర్వహించారు. శుక్రవారం ఎలక్ట్రిల్ డివిజినల్ కార్యాలయంలో ముందు ఆందోళన నిర్వహించారు. పీఆర్సీ సాధించేందుకు జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన కార్యక్రమాలకు జేఏసీ పిలుపు నిచ్చింది. టిఎస్‌పిఈ జేఏసీ పిలుపులో బాగంగా జిల్లా సర్కిల్ ఆఫీస్‌లో నిరసన కార్యక్రమం తెలిపారు. సర్కిల్ ఆఫీస్ స్టాఫ్, ఈ కార్యక్రమంలో జెఏసీ నాయకులు రాంప్రసాద్, శివరంజని, ప్రసాద్, పులి గణేష్ బాబు, కూనూ రాజు శ్రీనివాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర టీఎస్‌పిఇ జేఏసీ పిలుపు మేరకు జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 3 వేల మంది ఉద్యోగులు ఉన్నారని, అన్ని కార్మిక సంఘాలు, అధికారుల, అన్ని అసోసియేషన్ నాయకులు సెక్షన్ లీడర్ నుండి జిల్లా లీడర్ వరకు ఆర్టిజన్ నుండి ఎస్ఇ వరకు ఈ నెల 24 నుండి చేయబోయే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనే విధంగా చూడాలన్నారు. రోజు వారి కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. ఈ నెల 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు నాలుగు రోజులు బ్లాక్ బాడ్జెస్‌తో ప్రతి ఒక్క ఉద్యోగి విధిగా విధులకు హాజరు కావాలి. జిల్లాలోని సంబంధిత ఆఫీసులో ఉండే నాయకులు కో-ఆర్డినేట్ చేసుకొని ప్రతి ఒక్కరూ బ్లాక్ బాడ్జెస్ పెట్టుకునే విధంగా చూడగలరని కోరారు.

పాల్వంచ : పీఆర్‌సీ (వేతన సవరణ) ఈపీఎఫ్ నుండి జీపీఎఫ్ సాధించేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జయంతి యాక్షన్ కమిటీ నాయకులు అన్నారు. విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సిని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కర్మాగారం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలో భాగంగా ఉద్యోగ కార్మిక సంఘాలు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేశారు. వేల సంఖ్యలో పాల్గొన్న కార్మికులు నినాదాలు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి పీఆర్‌సీ ప్రకటించాలని వారి డిమాండ్ చేశారు. ఈ నెల 25, 27, 28 తేదీలో కూడ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మంగీలాల్ బ్రహ్మాజీ, 1104 యూనియన్ నాయకులు సుధీర్ కోటేశ్వరరావు, రాజేందర్, సీఐటీయూ నాయకులు అంకిరెడ్డి నరసింహారావు, 1535 నాయకులు రాధాకృష్ణ, రాము, ధనయ్య వెంకటేశ్వర్లు, 327 నాయకులు మజీద్, లక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించాలని రాష్ట్ర ఎంప్లాయిస్ ఉద్యోగులు ఆధ్వర్యంలో జరుగుతున్న దశల వారి ఆందోళనలో భాగంగా శుక్రవారం బీటీపీఎస్‌లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట జరిగిన సమావేశంలో నాయకులు ప్రసంగించారు. వచ్చే నెల ఒకటి నుంచి నాలుగు వరకు ధర్నాలు ఉంటాయని వివరించారు. జేఏసీ రీజియన్ చైర్మన్ వి.ప్రసాద్, అధ్యక్షులు రవి ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవితేజ, కార్మిక సంఘం-1104 ప్రధాన కార్యదర్శి బి.సత్య నారాయణ, కార్మిక సంఘం-327 అధ్యక్షులు కే.ప్రేమ్ కుమార్, సీఐటీయూ నాయకులు వీరస్వామి, నాయకులు రాజబాబు, దయాకర్, కే.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.


పాల్వంచ

ప్రేమను మాటల్లో చెప్పండి



నచ్చినవి చేసిపెట్టడం, అడగకుండానే అన్నీ సమకూర్చడం అంతెందుకు తప్పు చేసినప్పుడు వేసే దెబ్బ.. ప్రతిదీ మనం పిల్లలపై చూపే ప్రేమే. కానీ ఈతరం చిన్నారులకు ఈ తరహా ప్రేమ అర్థమవుతుందా? అందుకే చూపడం కాదు.. మాటల్లో చెప్పమంటున్నారు నిపుణులు..

- బోసినవ్వుల నుంచి వాళ్లు చెప్పే కబుర్ల వరకు ప్రతీదీ అపురూపమే. అది మన మనసులో అనుకుంటే సరిపోదు. 'నా జీవితంలో సంతోషం నింపావు. నా బంగారు కొండవి' అంటూ చెప్పేయండి. వాళ్ల సంబరం మీకే అర్థమవుతుంది. అర్థం చేసుకునే వయసు లేకపోయినా 'అమ్మ ఆనందంగా' ఉన్నదైనా తెలుస్తుంది.
- మనం కోపంగా ఉన్నప్పుడు చుట్టేసుకోవడం, పనిలో సాయం చేయడం.. ఇవీ వాళ్ల ప్రేమను మీకు చూపే మార్గాలే. చెప్పిన మాట విన్నా. బుద్ధిగా నడుచుకున్నా మెచ్చుకోండి. భవిష్యత్తులో మెప్పుకోసమైనా కొనసాగిస్తారు. స్నేహితులొచ్చినప్పుడు వాళ్ల పిల్లలను పొగడటం.. మనవాళ్ల తప్పులు ఎంచడం చేస్తుంటాం కదా! అలా చేయకుండా వాళ్ల నైపుణ్యాలు, అర్థం చేసుకునే తీరు వంటివి చెప్పండి. ఇవీ వాళ్లను మంచి మార్గంలో నడిచేలా చేసేవే!
- మౌనంగా చేసుకుంటూ వెళ్లడం కాదు. 'చూడు.. నీకిది ఇష్టమని గుర్తుంచుకొని మరీ తెచ్చా, నువ్వంటే నాకు చాలా ఇష్టం. అందుకే నీతోనే ఉండాలని, ఆడుతోంటే చూడటానికి వచ్చా' అంటూ ప్రేమని మాటల్లో చెప్పండి. భద్రతే కాదు.. అన్నీ మనసు విప్పి పంచుకోవడమూ అలవాటు చేసిన వారవుతారు.
- చిన్నగా ఉన్నప్పుడు బుగ్గలు గిల్లి ముద్దు చేయడం, ఆడటం లాంటివి చేస్తాం. పెద్దయ్యాక ప్రేమగా దగ్గర కూర్చోబెట్టుకొని మాట్లాడటమే మానేస్తాం. 'పెద్దదానివయ్యాం, ఇంకా చిన్నపిల్లవా' అని మనం అన్నా.. చిన్నగా ఉన్నప్పుడే ప్రేమ, పెద్దయ్యాక అమ్మానాన్నలకు నచ్చం అనే అభిప్రాయానికి వస్తారట. రూపురేఖలపైనా అసంతృప్తి ఏర్పడుతుందట అప్పుడప్పుడైనా మెచ్చుకుంటూ ఉండటం మరవొద్దు.

మురికివే వాడుతున్నారా?



వివిధ రకాల గృహోపకరణాలు, ఇతర వస్తువుల్ని మైక్రోఫైబర్ క్లాత్ లేదంటే కాటన్ క్లాత్‌తో శుభ్రం చేయడం మనకు అలవాటే! అయితే పని పూర్తయ్యే సరికి అవి మురికిగా తయారవుతాయి. వాటిని సాధారణ డిటర్జెంట్‌తో ఉతికి ఆరేసి తిరిగి వాడుకోవడం చాలామంది చేసే పని. అయితే ఇలా పైపైన ఉతకడం వల్ల అవి పూర్తిగా శుభ్రపడవు.. సరికదా.. వాటిపై బ్యాక్టీరియా వృద్ధి చెందే ప్రమాదమూ లేకపోలేదు. అలాగే వాటి నుంచి అదో రకమైన వాసన కూడా వస్తుంటుంది. అందుకే అలాంటి మురికి క్లాత్స్, టవల్స్‌ని ప్రత్యేకంగా శుభ్రం చేయాల్సి ఉంటుంది. వేడి నీళ్లలో టేబుల్‌స్పూన్ వెనిగర్ వేసి ఈ క్లాత్స్‌ని అరగంట పాటు నానబెట్టి.. ఆ తర్వాత ఉతికి ఎండలో ఆరేయాలి. ఇలా ఉతికితే అవి శుభ్రపడడంతో పాటు వాటిపై ఉన్న మరకలు కూడా తొలగిపోతాయి. ఆపై తిరిగి వీటిని ఉపయోగించుకోవచ్చు.

మార్పు రావాలంటే
అక్షరమే అసలైన ఆయుధం

బడంటే చచ్చేంత భయాన్ని గుప్పెట్లో పెట్టుకొని బలవంతంగా బయలుదేరేది. ఆటలు అల్లరికి మారు పేరై ప్రతి ఇంటిగడపను ఆత్మీయంగా తొక్కేది. వీధి పిల్లలతో స్నేహం చేస్తూ ఆకలినే మరిచేది. స్వేచ్ఛగా వాడవాడల్లో విహరిస్తూ బొమ్మరిల్లు కట్టుకొనేది. వాగులు వంకలు పొలాలతో దోస్తీకట్టి ప్రకృతిని ప్రేమించేది. మురిపెంగా చంకన ఎత్తుకొని బయలు దేరిన అక్కను విదిలించుకొని ఇంటిదారి పట్టే ప్రయత్నం చేసేది. వారించిన పంతులమ్మ చేతులనే కొరికి ఇంటికి పరుగుతీసేది. పిట్టకొంచెం కూత ఘనమని కొందరు... అల్లరి పిడుగని కొందరు... తేలుకొండి అని మరొకొందరి బిరుదులను నెత్తి మోసేది. ఆమె ఎవరో కాదు నేడు మనకు సుపరిచితమైన అనుశ్రీ కలంతో సాహితీ ప్రస్థానం మొదలుపెట్టిన **అయిత అనిత.**



అనిత మంచిర్యాల జిల్లాలోని చెన్నూరులో పుట్టారు. తల్లి కనకలక్ష్మి, తండ్రి వసంతం. వీరికి ఆరుగురు సంతానం. అందరికంటే అనిత చిన్నది. తండ్రి ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. తొమ్మిదేండ్లు వచ్చే వరకు తండ్రి గారాబంతో చిలిపిగా సాగింది ఆమె బాల్యం. నాల్గవ తరగతి పరీక్షలు ముగిసాయి. వేసవి సెలవుల ఆనందం తనివితీరక ముందే పిడుగు లాంటి సంఘటన. "అమ్మ పని మీద ఊరెళ్లింది. నేను వస్తానని మారాం చేసినా ఎందుకో ఇంట్లోనే ఉండమంది. ఆ రోజు అరుగుపై ఆడుకుంటున్నాను. అకస్మాత్తుగా మామయ్య వచ్చి చాప తీసుకురా అన్నాడు. నేను తేలేదు. మరో ఐదునిమిషాల్లో చాపపై నాన్న పడుకున్నారు. ఎందుకో..? నాన్న ఎంత లేపినా లేవనేలేదు. రోజు పడుకునే ముందు నేను పాడే పద్యాలను, అభినయ గేయాలను వింటూ నాతో ముచ్చటించే నాన్న ఆరోజెందుకో నా మాటలు వినకుండానే నిద్రలోకి జారుకున్నారు. అది మామూలు నిద్రలా లేదు శాశ్వత నిద్ర. ఆ విషయం నా మట్టి బుర్రకు అర్థమవడానికి చాలా సమయం పట్టింది. బంధువులంతా చుట్టూ చేరి ఏడుస్తున్నారు. నేను మాత్రం ఏడ్చినట్టు గుర్తులేదు. ఎందుకంటే ఏం జరుగుతుందో తెలుసుకోలేని పసితనం అది. అప్పటి నుండి అమ్మ ప్రతిరోజు ఏడుస్తూనే ఉండేది. ఆమె కను చెలిమలో నీరింకేవే కావు. అశ్రుధారలు చెక్కిలి దాటి ప్రవహిస్తూనే ఉండేవి." అంటూ తండ్రి తనకు దూరమైన రోజులను కన్నీటితో గుర్తు చేసుకున్నారు.



సాహిత్యం దోహదపడుతుంది


"సమాజంలో మార్పు రావాలంటే అక్షరమే అసలైన ఆయుధం. యువతకు మార్గదర్శకం చేయాలన్నా, కనుమరుగవుతున్న సంస్కృతిని రక్షించాలన్నా, మానవ విలువలు కాపాడాలన్నా, మహిళల్లో ఆత్మవిశ్వాసం నూరిపోసి సాధికారత సాధించాలన్నా సాహిత్యం దోహదపడుతుంది. మనం రాసే ఏ ఒక్క వాక్యమైనా, ఏ ఒక్క మనిషినైనా మార్చగలదు. వ్యక్తిత్వ పరిపుష్టికి, అనుబంధాల పటిష్టతకు, నవసమాజ నిర్మాణానికి సాహిత్యం చాలా అవసరమని' ఆమె అభిప్రాయం.

తల్లి మాటల ప్రభావంతో...

అప్పటి నుండి అన్నీ తల్లే. భర్తకు వచ్చే పెన్షన్ డబ్బుతో ఇంట్లోనే ఉంటూ పూలు అల్లుతూ, మిషన్ కుడుతూ పిల్లల్ని పోషించుకున్నారు. తల్లి ఆ పిల్లలకు ఎప్పుడూ ఒకే మాట చెప్తూ ఉండేది. "ఆడ పిల్లైనా, మగపిల్లలైనా ఎవరికాళ్లపై వారు నిలబడాలి. అందుకు చదువే ఉత్తమమైన మార్గం" అని. ఆ మాటలను పూర్తిగా విశ్వసించిన అనిత కష్టపడి చదువుకుంది. ఆ తల్లి బోధనల ఫలితమేమో, ఎదుర్కొన్న పేదరికపు వెతల ప్రభావమేమో ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మలిచాయి. ఓ కవయిత్రిగా చెక్కాయి.

తెలుగుపై మక్కువతో...

అనితకు బాల్యం నుండి తెలుగు పట్ల ఆసక్తి ఎక్కువ. దీనికి కారణం అప్పట్లో తెలుగు పాఠాలు బోధించిన టీచర్. దాంతో చిన్నతనం నుండే కవితలు రాస్తుండేది. 5వ తరగతిలో మొదటి కవిత రాసి నట్టుగా గుర్తు చేసుకున్నారు. 2015లో తెలంగాణ జాగృతి వారు నిర్వహించిన జగిత్యాల జిల్లా స్థాయి కవిసమ్మేళనంలో మొదటిసారి తన కవితను వినిపించారు. 2017 ప్రపంచ తెలుగుమహాసభల సందర్భంగా ధర్మపురిలో జరిగిన కవిసమ్మేళనంతో కవయిత్రిగా సాహితీ ప్రపంచానికి పరిచయం అయ్యారు.








2018 నేటి కవిత వాట్సప్ ద్వారా ఆమెలోని కవిత్వ సృజన మరింత పుంజుకుంది. తాను రాయడమేకాకుండా జగిత్యాలలో కళాశ్రీ సాహితీ వేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక మహిళా కవిసమ్మేళనం, పుస్తకావిష్కరణలు, కవుల జయంతులు, సాహితీ సమాలోచనలు వంటి వివిధ సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఏదో తెలియని ఉత్తేజం



మనసు స్పందించినప్పుడల్లా ఏదో రాయాలని మనసు తపిస్తుంటుంది. అంతే పదాలు అలా కలం నుండి జాలువారుతూనే ఉంటాయి. పాఠశాల, కళాశాల స్థాయిలో ఉన్నప్పుడు తన స్నేహితుల పుట్టినరోజులకు, వీడ్కోలప్పుడు ఆటోగ్రాఫ్‌లుగా కవితలు రాసి వారికి ఇస్తూ ఉండేవారు. శ్రీశ్రీ కవితలు చదువుతున్నప్పుడు అనితలో ఏదో తెలియని ఉత్తేజం కలిగేది. యువత, మహిళల సమస్యలు, సాధికారతపైనే ఎక్కువగా ఆమె కవిత్వం ఉంటుంది.

సాహిత్యం చాలా అవసరం

పండుగలు, కవుల జయంతులు, వర్ధంతులతో పాటు వివిధ సందర్భాలలో వ్యాసాలు రాస్తుంటాను. అవి అనేక పత్రికల్లో ప్రచురింపబడ్డాయి కూడా. అలాగే 3000లకు పైగా వచన కవితలు, వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారు. వీటిలో కొన్నింటిని ఎంపిక చేసుకుని ఇప్పటి వరకు నాలుగు పుస్తకాలు ప్రచురించారు. అవి మన పండుగలు (వ్యాస సంపుటి), రాయంచరత్నం (ఆటవెలదుల నక్షత్రమాల), జీవన సౌరభం (కైతికాలు), ఆగిపోకు (వచన కవిత్వం). వీటిని అచ్చువేయడంలో తన భర్త మోటూరి శ్రీనివాస్ సహకారం మరువలేనిదని చెబుతారు ఆమె. రాయడం, ఉద్యోగం, కుటుంబం ఈ మూడింటిని సమన్వయం చేసుకోవడమంటే అంత సులభమైన విషయం కాదు.



అయితే ఒక ప్రణాళిక ద్వారా మూడింటిని సమన్వయ పరుచుకోవచ్చంటున్నారు అనిత. అవసరమైన దగ్గర కుటుంబ సభ్యుల సహకారం తప్పక తీసుకుంటారు.

పేద విద్యార్థులకు అండగా...

"విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి, సంస్కృతి, సంప్రదాయాల, మానవ విలువలను పెంచి మూర్తిమత్వ పౌరులుగా తీర్చిదిద్దడం. సమాజ మార్పును కాంక్షించడం. యువతకు మహిళలకు స్ఫూర్తి నివ్వడం" ఒక రచయితగా, ఉపాధ్యాయురాలిగా తన కర్తవ్యం అంటున్నారు అనిత. ముఖ్యంగా పేద విద్యార్థులకు సహాయం చేయాలనేది ఆమె లక్ష్యం. ఎందుకంటే విద్యార్థి దశలో వారికి చేయూతనందిస్తే అవకాశాలను అందిపుచ్చుకొని, భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకుంటారని ఆమె నమ్మకం. "ప్రతి ఒక్కరికి ఒక లక్ష్యమంటూ ఉండాలి. ఆ లక్ష్యాన్ని చేరడానికి ఆత్మవిశ్వాసమే తోడుగా నిరంతరం కృషి చేయాలి. ఎంత కష్టమైనా మంచిదారిలోనే నడుస్తూ నలుగురికీ ఆదర్శంగా ఉండాలి. ముఖ్యంగా మహిళలు సమస్యవచ్చినప్పుడు సహనంతో పాటు ధైర్యంగా ముందడుగువేయాలి. యువత వ్యసనాలకు లోనుకాకుండా చదువుపై శ్రద్ధవహిస్తూ విలువలు, సంస్కృతి సంప్రదాయాలను అలవరుచుకోవాలి" అంటూ ఆమె తన మాటలు ముగించారు.

- సలీమ

ఖర్గే చేతికి సర్వాధికారాలు

రాయ్‌పూర్ : కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి సభ్యులందరినీ నామినేట్ చేసే అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు కట్టబెడుతూ పార్టీ స్టీరింగ్ కమిటీ శుక్రవారం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నది. సీడబ్ల్యూసీకి ఎన్నికలు అవసరం లేదని అభిప్రాయపడింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నది.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, సీడబ్ల్యూసీ ఎన్నికల గురించి కాంగ్రెస్ స్టీరింగ్ కమిటీ స్వేచ్ఛగా, అరమరికలు లేకుండా చర్చించిందన్నారు. సీడబ్ల్యూసీ సభ్యులందరినీ నియమించే అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు అప్పగించాలని స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిందన్నారు. స్టీరింగ్ కమిటీ సమావేశంలో 45 మంది సభ్యులు (అందరూ) పాల్గొన్నారని తెలిపారు. వీరిలో కొందరు సీడబ్ల్యూసీ ఎన్నికలకు అనుకూలంగా, మరికొందరు వ్యతిరేకంగా తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ పోషించాల్సిన పాత్రను దృష్టిలో ఉంచుకుని, రాజకీయ సవాళ్లను ఎదుర్కొవాలని నిర్ణయించింది. అందువల్ల ప్రస్తుతానికి సీడబ్ల్యూసీకి ఎన్నికలు నిర్వహించరాదని నిర్ణయించినట్టు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు, మాజీ ప్రధాన మంత్రులను సీడబ్ల్యూసీలో నియమిస్తారన్నారు. సీడబ్ల్యూసీలో 50 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, మైనారిటీలు, యువతకు కేటాయించినట్టు తెలిపారు. స్టీరింగ్ కమిటీ తీసుకున్న ఈ ఏకగ్రీవ నిర్ణయాన్ని ఏఐసీసీ, పీసీసీ ప్రతినిధులంతా మద్దతిస్తారనే సంపూర్ణ విశ్వాసం తమకు ఉన్నదని చెప్పారు.

స్టీరింగ్ కమిటీ సమావేశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ హాజరయ్యారు. అంతకుముందు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "మీరు మీ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించండి, సమిష్టి నిర్ణయం తీసుకోండి అని నేను కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోరుతున్నాను. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా అది నా నిర్ణయం, ప్రతి ఒక్కరి నిర్ణయం అవుతుంది" అని తెలిపారు.

లైఫ్ సైన్స్‌లో హైదరాబాద్ టాప్

(మొదటిపేజీ తరువాయి)

కంపెనీలు ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలోనే మూడింట ఒక వంతు వ్యాక్సిన్ల ఉత్పత్తి తెలంగాణలోనే జరుగుతున్నదని వెల్లడించారు. దేశీయ ఔషధ ఎగుమతుల్లో 30శాతం, ఏపీఐ ఉత్పత్తిలో 40శాతం, ఏపీఐ ఎగుమతుల్లో 50శాతం తెలంగాణ నుంచే జరుగుతుందన్నారు. లైఫ్‌సైన్స్ రంగంలో ప్రపంచ హబ్‌గా హైదరాబాద్ అవతరించిందని చెప్పారు. హైదరాబాద్ ఫార్మాసిటీ వరల్డ్ లార్జెస్ట్ హబ్‌గా నిర్మాణం జరుగుతున్నదని తెలిపారు. ఏడేండ్లలోనే మూడు బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని వివరించారు. నగరంలో 20కిపైగా లైఫ్‌సైన్సెస్, మెడ్‌టెక్ ఇంక్యుబేటర్లు ఉన్నాయని తెలిపారు. లైఫ్‌సైన్సెస్ రంగం బలోపేతానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలో అనేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. శాస్త్రవేత్తలు, మేధావులు ఏకమై వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. 2023కుగాను 'జీనోమ్ వ్యాలీ' ఎక్సలెన్స్ అవార్డును ప్రొఫెసర్ రాబర్ట్ లాంగర్‌కు అందజేయనున్నామని మంత్రి తెలిపారు.

టీఎస్ సెట్ పరీక్ష తేదీని మార్చండి

- ఓయూ వీసీకి సంతోష్‌కుమార్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించే మార్చి 13న టీఎస్ సెట్ కూడా జరుగుతున్నందున ఆ పరీక్ష తేదీని మార్చాలని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి అయినేని సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సెట్ చైర్మెన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) వీసీ డి రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణను శుక్రవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. టీఎస్ సెట్‌ను మార్చి 13,14,15 తేదీల్లో నిర్వహించనున్నట్టు షెడ్యూల్‌ను ప్రకటించారని గుర్తు చేశారు. అయితే టీఎస్ సెట్‌కు కొంత మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా హాజరవుతారని తెలిపారు. ఒకేరోజు ఎమ్మెల్సీ ఎన్నికలు, ఆ పరీక్ష ఉండడం వల్ల వారు ఇబ్బందులు పడే అవకాశముందని పేర్కొన్నారు. అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్ష తేదీని మార్చాలని కోరారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

నాటి ప్రభుత్వ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎస్,జేకేకేటీ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. బుల్‌డోజర్‌లతో కూడిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్‌లో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఏఐకేఎస్, జమ్మూ, కాశ్మీర్ కిసాన్ తెహ్రీక్ (జేకేకేటీ) ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనకు సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి, ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, ఐద్వా ఢిల్లీ అధ్యక్షురాలు మైమూనా మొల్లా, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, జేఎన్‌యూఎస్ యూ అధ్యక్షురాలు ఐషీ ఘోష్ సంఘీభావం తెలిపారు.

సీతారాం ఏచూరి మాట్లాడుతూ... ఎన్నో తరాలు అలాంటి భూముల్లోనే ఉంటూ వాటిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాయని అన్నారు. ఈ నివాసాలను క్రమబద్ధీకరించాలనీ, రైతుల భూమి హక్కులను పరిపాలన విభాగం రక్షించాలని డిమాండ్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ బుల్డోజర్లను ఉపయోగించి పేద ప్రజలకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా భూమి నుంచి ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూమిపై 30 ఏండ్లకు పైగా నిరంతరాయంగా ఆధీనంలో ఉన్నవారు క్రమబద్ధీకరణకు హక్కులు పొందవచ్చని సుప్రీం కోర్టు ఆదేశాలున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ భూమిలో నివాసితుల హక్కులను గుర్తిస్తూ 1924 నుంచి ఇప్పటి వరకు అనేక ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్‌లు ఉన్నాయని తెలిపారు.

ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్, జేకేకేటీ ప్రధాన కార్యదర్శి జహూర్ అహ్మద్ మాట్లాడుతూ ముందున్న అన్ని భూ చట్టాలను రద్దు చేసి, జమ్మూ కాశ్మీర్ వెలుపల ఉన్నవారికి భూమిని కొనుగోలు చేయడం సులభతరం చేశారని విమర్శించారు. జమ్మూ, కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఎల్జీ పరిపాలనా అధికారులు వివిధ జిల్లాల్లో వందలాది మంది పేద రైతులు, చిన్న ఉత్పత్తిదారులపై బుల్డోజర్లను ఉపయోగించి బహిష్కరించి వేధిస్తున్నారని దుయ్యబట్టారు. ఇండ్ల నుంచి బలవంతంగా తొలగించి, భూమిని



గుంజుకుంటున్నారని విమర్శించారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిపై ఆధారపడిన గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులకు, భూనిర్వాసితులకు నష్టం కలిగించే ఇలాంటి చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఆధ్వర్యంలోని ప్రస్తుత పరిపాలన (నిర్వాసితులను భూ కబ్జాదారులుగా ముద్రవేయడం అన్యాయమే కాకుండా పూర్తిగా తప్పుదారి పట్టించేదని విమర్శించారు. ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలను రైతులు, ప్రజలు సాధారణంగా సహించలేరని, రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని రైతుల భూమి, జీవనోపాధిపై వారి హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏఐకేఎస్ డిమాండ్ చేస్తుందని అన్నారు. అటవీ హక్కుల చట్టం అమలును నిర్ధారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ అంతటా రైతులు నిరసనలు చేస్తున్నారని, ఈ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ రాజకీయ పార్టీలు కూడా రంగంలోకి దిగాయని పేర్కొన్నారు. ధర్నాలో ఏఐకేఎస్ కోశాధికారి పి.కృష్ణ ప్రసాద్, ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు ఇంద్రజిత్ సింగ్, జేకేకేటీ ప్రాంతీయ కార్యదర్శి కిషోర్ కుమార్, ఏఐకేఎస్ హర్యానా రాష్ట్ర కార్యదర్శి సుమిత్ దలాల్, జమ్మూ కాశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్ కి చెందిన రైతులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మోడీ సర్కార్ విధానాల రూపకల్పన చేసిందని ధ్వజమెత్తారు. నూతన పెన్షన్ విధానానికి భూమికగా ఉన్న పీఎఫ్‌ఆర్డీఏ చట్టాన్ని తక్షణ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన ఆర్థిక విధానాల్లో భాగంగా వచ్చిన పెన్షన్ లేని నూతన పెన్షన్ విధానం భవిష్యత్తులో ఉద్యోగులకి ఆర్థిక నష్టాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎన్ఎస్డీఎల్ లో మదుపు చేసిన సొమ్మును తిరిగి రాష్ట్రాలకు చెల్లించలేమని చెప్పటంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భవిష్యత్‌లో సీపీఎస్ ను రద్దు చేయకుండా రాష్ట్రాలను నియంత్రించే విధంగా కేంద్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలను, జాతీయ సమైక్యత భావాలను నేర్పాల్సిన విద్యకు భిన్నంగా, నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్య వ్యాపారం చేయటం తగదన్నారు. విద్యను ప్రోత్సహించకుండా.. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలనుకోవటం సరికాదనీ, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వ విధానాలను విమర్శించారు. వెంటనే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్టీఎఫ్ఐ జాయింట్ జనరల్ సెక్రెటరీ సుకుమార్ పైన్, కోశాధికారి ప్రకాష్ చంద్ర మొహంతి మాట్లాడుతూ డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్రపతికి లక్షలాది మంది ఉపాధ్యాయుల సంతకాలతో కూడిన మెమోరాండం అందజేస్తామని స్పష్టం చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఉపాధ్యాయుల దేశవ్యాప్త ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఎస్టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.టి.శివరాజన్, మోహన్‌దాస్ పండిట్, ఎస్. మయిల్, మహావీర్ సిహాగ్, బినోద్ బిహారీ పాణిగ్రాహి, చారులత మహాపాత్ర , జాతీయ కార్యదర్శి బద్రున్నిసా, మహ్మద్ అల్లావుద్దీన్, కృష్ణ ప్రసన్న భట్టాచార్య, నాగేంద్ర సింగ్, సాయిబల్ రాయ్, ధర్మేంద్ర సింగ్ ఎ. శంకర్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు యూసఫ్ తరిగామి, జేఎన్‌యూ ఎస్‌యూ అధ్యక్షురాలు ఐషీఘోష్ సంఘీభావం తెలిపారు.

తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా హాజరు

ఎస్టీఎఫ్ఐ పిలుపు మేరకు పార్లమెంట్ మార్చ్‌కు మద్దతు తెలుపుతూ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వందలాది మంది ౹ ఉపాధ్యాయులు హాజరు అయ్యారు. తెలంగాణ నుంచి టి.యూటీఎఫ్ నేతలు బి.కోటేశ్వరరావు, బి.కళ్యాణి, ఎం. విజయలక్ష్మి, కె.రమేష్, వి.కొండలరావు, ఎ.చక్రవర్తి, బి.ప్రామాణిక్, బి.సైదులు, డి.భీమ్ శంకర్ , ఆంధ్రప్రదేశ్ నుంచి యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎస్ కుసుమకుమారి, రాష్ట్ర కోశాధికారి బి. గోపి మూర్తి, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు, డి అపర్ణ, ఎం శ్రీలక్ష్మి, సి హెచ్ పట్టాభి రామయ్య, కె. కమల కుమార్, ఎస్. రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవే..

- **నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)-2020ని రద్దు చేయాలి. అందరికీ ఉచిత, నిర్బంధ, నాణ్యమైన విద్యను అందించాలి.**
- **నూతన పెన్షన్ పథకం(ఎన్పీఎస్), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) రద్దు, పాత పెన్షన్ పథకం (ఓపీఎస్) అమలు చేయాలి.**
- **అన్ని తాత్కాలిక, అడ్‌హాక్, కాంట్రాక్ట్, టర్మ్ బేసిస్ టీచర్లు, ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలి.**
- **విద్యా హక్కు చట్టాన్ని 12వ తరగతి వరకు పొడిగించాలి. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి.**
- **రూ. 7.50 లక్షలు ఆదాయం వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలి. రూ.2.5 లక్షలు వరకు స్టాండర్డ్ డిటెక్షన్ ఉండాలి. 80 సిసి మినహాయింపు రూ. 3 లక్షల వరకు ఉండాలి.**

ఉక్రెయిన్ తీర్మానానికి భారత్ దూరం

ఐక్యరాజ్యసమితి : రష్యా సైనిక చర్యను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితిలో ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత్ మరోసారి దూరం పాటించింది. ప్రస్తుత ఓటింగ్‌లో మరో 31 దేశాలు ఇదే వైఖరిని పాటించాయి. తమ దేశంలో శాంతిని నెలకొల్పే ముసాయిదా తీర్మానం విషయంలో సహకారం అందించాలని ఉక్రెయిన్ చేసిన విజ్ఞప్తికి భారత్ నుంచి సానుకూలత లభించలేదు. ఐక్యరాజ్యసమితిలో గురువారం ఉక్రెయిన్ ప్రవేశపెట్టిన శాంతి ప్రణాళిక ముసాయిదాపై జరిగిన ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగించడంలో, శాంతి నెలకొల్పడంలో భారత్ కీలక పాత్ర పోషించాలని ఇదివరకు ఫ్రాన్స్ కోరింది. ఈమేరకు ఫ్రాన్స్ దౌత్య బృందం గట్టిగానే ప్రయత్నించింది. కానీ భారత్ ఇప్పటివరకూ రష్యా అనుకూల వైఖరినే కొనసాగిస్తోంది. ఐరాస ఛార్టర్‌లోని సూత్రాలకు అనుగుణంగా శాశ్వత శాంతి స్థాపన నిమిత్తం శాంతి ప్రణాళికను ఉక్రెయిన్ సిద్ధం చేసింది. ఈ దేశంపై రష్యా సైనిక చర్య చేపట్టి ఏడాది గడిచిన నేపథ్యంలో దానిని గురువారం 193 సభ్యుల జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ ముసాయిదా తీర్మానానికి 141 మంది అనుకూలంగా ఓటేయగా..7 ఓట్లు వ్యతిరేకంగా వచ్చాయి. 32 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. అందులో భారత్ ఒకటి. ఈ శాంతి ప్రణాళికను ప్రవేశపెట్టడానికి ముందు ఉక్రెయిన్ నుంచి భారత్‌కు ఫోన్ వచ్చింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయ అధిపతి యాంద్రీ యెర్మాక్ బుధవారం ఫోన్లో మాట్లాడారు. తీర్మానం విషయంలో అనుకూలంగా ఓటు వేయాలని కోరారు.

పరిష్కారం లభించేనా?

ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యకు దిగి ఫిబ్రవరి 24తో ఏడాది కావస్తోంది. అమెరికా, పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌ను అడ్డుపెట్టుకొని రష్యాతో ప్రచ్ఛన్న యుద్ధానికి దిగాయి. నాటో కూటమిలో ఉక్రెయిన్‌ను చేర్చటం ద్వారా రష్యా సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలనే ప్రణాళికను అమల్లోకి తీసుకొచ్చాయి. దీనిని గ్రహించిన రష్యా...గత ఏడాది ఫిబ్రవరి 24న సైనిక చర్యకు దిగింది. ఉక్రెయిన్‌కు నాటో కూటమి, ఈయూ దేశాల నుంచి పెద్ద ఎత్తున ఆయుధ సామాగ్రి, ఆర్థిక సాయం అందుతోంది. రష్యాను రాజకీయంగా, ఆర్థికంగా అణచివేయడానికి సంక్షోభాన్ని అమెరికా, నాటో కూటమి వినియోగించుకుంటోంది. సైనిక చర్యకు ముగింపు పలకడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ సుముఖంగా ఉన్నప్పటికీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు, పాశ్చాత దేశాలు స్పందించటం లేదు.

మిర్చి రేటెక్కుతోంది..

(మొదటిపేజీ తరువాయి)

సతమతమవుతున్న రైతులకు ధరల పెరుగుదల కొంత ఊరటనిస్తోంది. అయితే దళారుల దోపిడీ అధికమవుతోందని రైతులు వాపోతున్నారు.

దండుకుంటున్న దళారులు

ఖమ్మం మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు రికార్డు స్థాయిలో పలికినా దళారులు ఆ స్థాయిలో ధర పెట్టలేదని రైతులు వాపోతున్నారు. ఏసీ మిర్చి రూ.22వేలు పలుకగా, నాన్ ఏసీ కొత్త మిర్చి రూ.20,800 గరిష్ట ధర నమోదు కాగా నమూనా రూ.19,500, కనిష్ట ధర 14000గా నిర్ధారించారు. బుధవారం రూ.19,100 గరిష్ట ధర పలుకగా నమూనా రూ.18,500, కనిష్ట ధర రూ.14,000గా ఉంది. అయితే జెండా పాటకు అనుగుణంగా రేటు పెట్టడం లేదని రైతులు చెబుతున్నారు. ఒకటి, రెండు లాట్లకు మాత్రమే ఈ ధర పెట్టి మిగతా సరుకును రూ.18,000లోపే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. 20శాతం లోపు సరుకుకు మాత్రమే రూ.19వేలకు పైగా ధర పెడుతున్నారని, అధిక మొత్తం సరుకును రూ.17వేలకే కొనుగోలు చేస్తున్నట్టు రైతులు వాపోతున్నారు. ఖాళీ బస్తా ఒక్కొక్కటి తాము రూ.60కి కొనుగోలు చేస్తే మార్కెట్లో మాత్రం దానికి రూ.20 చొప్పున చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..
- రుద్రాక్ష మల్లేశం, మార్కెట్ సెక్రటరీ

బెస్ట్ క్వాలిటీలకు డిమాండ్ ఉంది. నమూనా ధరకు అనుగుణంగా కొనుగోళ్లు ఉంటాయి. జెండా పాటకు అనుగుణంగా కొనుగోళ్లు చేయాలి. లేనిపక్షంలో సంబంధిత వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. ఈరోజు బడ్జెట్ మీటింగ్ ఉండటం వల్ల మధిర మార్కెట్‌కు వెళ్లడంతో రైతులకు అందుబాటులో లేము. నిత్యం పర్యవేక్షణ ఉంటుంది.

ఇంకా విషమంగానే వైద్య విద్యార్థిని ఆరోగ్యం

- నిందితులు ఎంతటి వారైనా వదలం : మంత్రి సత్యవతి రాథోడ్
- నిమ్స్‌లో వైద్య విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించిన మంత్రి



నవతెలంగాణ- బంజారా హిల్స్

వరంగల్ కేఎంసీలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న పీజీ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. హైదరాబాద్ నిమ్స్‌లో ఎక్మో వెంటిలేటర్ సాయంతో బాధితురాలు చికిత్స పొందుతోంది. శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఒకపక్క మంత్రులు వచ్చి పరామర్శించడం, ఆమె ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం సహా పలువురు ఆరా తీస్తుండగా.. మరోపక్క ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థల వారు ఆస్పత్రి వద్ద నిరసన తెలిపారు. ఇలాంటివి రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్నా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే మళ్లీ మళ్లీ పునరావృతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న మెడికో విద్యార్థిని ప్రీతిని మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించారు. విద్యార్థిని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రీతి తల్లిదండ్రులతో మాట్లాడి ఓదార్చారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపడుతోందన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ వరంగల్ కమిషనర్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. వైద్యులతో గంట గంటకు మంత్రి హరీశ్‌రావు స్వయంగా మాట్లాడుతూ ప్రీతి ఆరోగ్య పరిస్థితి గురించి పర్యవేక్షిస్తున్నారని చెప్పార. ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ డైరెక్టర్‌ను, వైద్య బృందాన్ని ప్రీతికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారని వెల్లడించారు. ప్రీతికి ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స అందిస్తున్నారని, ప్రస్తుతానికి వెంటిలేటర్, ఎక్మో మీద ఉన్నారని, సీఆర్ఆర్‌టీ డయాలసిస్ ద్వారా చికిత్స అందిస్తున్నారని చెప్పారు. ఆమె తల్లిదండ్రులతో కలిసి వెళ్లినప్పుడు వారి మాటలకు ప్రీతి కండ్లు తెరిచి చూడగలుగుతుందని, స్వతహాగా ఊపిరి తీసుకోగలుగుతుందని మంత్రి తెలిపారు. ఆమె త్వరగా కోలుకొని క్షేమంగా బయటకు రావాలని మంత్రి ప్రార్థించారు. ప్రీతి కుటుంబానికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఇదిలా ఉండగా, వైద్య విద్యారినికి ప్రభుత్వం పూర్తి అండగా ఉంటూ నిందితులను కఠిన శిక్షించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్, ఆరోగ్య శాఖ మంత్రి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

గవర్నర్ పూలదండతో రావడమేంటి : బాధితురాలి సోదరి

ప్రీతిని పరామర్శించేందుకు గవర్నర్ పూలదండతో వచ్చారని బాధితురాలి సోదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. నిందితుడిపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. గవర్నర్ పూలదండతో రావడమేంటని ప్రశ్నించారు. తన అక్క చనిపోలేదన్నారు. తక్షణమే ప్రత్యేక కమిటీని నియమించి దర్యాప్తు జరపాలని కోరారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ తన అక్కను చూడటానికి రావద్దన్నారు. తమకు అన్యాయం జరిగితే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

తప్పులు మీవీ..భారాలు మావా..!

(మొదటిపేజీ తరువాయి)

రూ.12,753.56 కోట్లు, డిస్ట్రిబ్యూషన్ బిజినెస్ ట్రూఅప్ పేరుతో రూ.4,092.23 కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేసుకొనేందుకు విద్యుత్ సంస్థలు టీఎస్ఈఆర్సీని అడుగుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.35వేల కోట్లు ఖర్చు చేసినట్టు డిస్కంలు, ప్రభుత్వం చెప్తున్నాయి. అసలు వీటిని టీఎస్ఈఆర్సీ ఎందుకు పర్యవేక్షించలేదు? అంతకన్నా తక్కువ ఖర్చుతో పంపిణీ వ్యవస్థల ఆధునీకరణ సాధ్యాసాధ్యాలను ఈఆర్సీ పరిశీలించాలి కదా? ఆ పని మీరెందుకు చేయలేదు? మూడేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం 2018-19 నాటి టారిఫ్ ప్రకారమే సబ్సిడీ సొమ్మును విద్యుత్ పంపిణీ సంస్థలకు ఇచ్చింది. ట్రూ అప్‌ల భారం రూ.8,790 కోట్లు అప్పట్లో ప్రభుత్వానికి సంబంధించినదే. ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వం నుంచి వసూలు చేసుకోకుండా, ప్రజలపై భారాలు వేస్తామనడం సరికాదు. ఛత్తీస్‌గడ్ నుంచి రావల్సిన వెయ్యి మెగావాట్లు రావట్లేదు. ఆ రాష్ట్రం యూనిట్ రేటును భారీగా పెంచేసింది. ఈ ఒప్పందం జరిగేటప్పుడే అనేకమంది లోటుపాట్లను ఎత్తిచూపారు. ఆరోజు వాటిని పట్టించుకోని ఫలితంగా ఇప్పుడు కరెంటు రాకున్నా తప్పనిసరిగా లక్షల రూపాయలు ట్రాన్స్‌మిషన్ చార్జీలుగా చెల్లిస్తున్నాం. ఓ తొందరపాటు నిర్ణయ ఫలితాన్ని ఇప్పుడు రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం కృత్రిమంగా బొగ్గు కొరత సృష్టించి, ప్రకృతి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే నిర్ణయాలు తీసుకుంది. సింగరేణికి స్థానిక బొగ్గు గనులు కేటాయించకుండా, ఒడిశా రాష్ట్రంలోని గనులు కేటాయించడం ఏంటి? దీనివల్ల రవాణా చార్జీలు పెరిగి, కరెంటు ఉత్పత్తి ధర పెరుగుతుంది. రాష్ట్రాల మధ్య విద్యుత్ సరఫరా లైన్ల నిర్వహణకు సంబంధించి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) చార్జీలను కేంద్రం భారీగా పెంచేసింది. కానీ పీజీసీఐఎల్ నుంచి అదానీ పవర్‌కు మినహాయింపు ఇచ్చారు. పవర్ ఎక్స్ఛేంజీలు నల్లబజారు అడ్డాలుగా మారాయి. ఉత్పత్తిదారులంతా కుమ్మక్కై, యూనిట్ రేట్లను పెంచేస్తున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల గడువు ముగియగానే జెన్‌కోలను మూసేయాలని కేంద్ర ప్రభుత్వం దుర్మార్గమైన ఉత్తర్వులు ఇచ్చింది. 2023-24లో 20 శాతం, 2024-25లో 35 శాతం, 2025-26లో 45 శాతం జెన్‌కోల థర్మల్ కేంద్రాల ఉత్పత్తిని తగ్గించి, సాంప్రదాయేతర ఇంధన వనరులతో భర్తీ చేసుకోవాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అలాగే విదేశీబొగ్గును తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటి వెనుక ప్రయివేటు, కార్పొరేటీకరణే లక్ష్యాలుగా ఉన్నాయి. శాంబ్‌కార్ప్ ఎనర్జీ సంస్థ నుంచి ఎవరి అనుమతి లేకుండా డిస్కంలు యూనిట్ రేటు రూ.8.33 పైసలకి విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకున్నాయి. సింగరేణి నుంచి యూనిట్ రేటు రూ.6.92 పైసలకు ఒప్పందం జరిగింది. విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఈ అధిక ధరలకు అనుమతి ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పాలి. కానీ మీరు అలా ఎందుకు చేయలేదు? డిస్కంలు ప్రతిపాదించిన ట్రూఅప్‌లు సహా అన్నింటిని ఉపసంహరించుకోవాలి.



ప్రతిపాదనలు తిరస్కరించండి
ఉడతా రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

డిస్కంలు ఆర్థికలోటులో ఉన్నాయని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. వాటిని ఎలా భర్తీ చేసుకుంటారో ప్రణాళిక, వివరణ లేవు. ప్రభుత్వ బకాయిలు సకాలంలో ఎందుకు వసూలు చేయట్లేదు. అవి వస్తే డిస్కంలు అప్పులు, నష్టాల్లో ఎందుకు ఉంటాయి? 2016-17 నుంచి 2021-22 వరకు డిస్కంలు టీఎస్ఈఆర్సీకి ఏఆర్ఆర్‌లు ఇవ్వలేదు. దానిపై ప్రశ్నిస్తే...ఎన్నికల నియమావళి వల్ల ఇవ్వలేదని రాతపూర్వకంగా సమాధానం చెప్పారు. పై కాలంలో సమాజంలో ఏ పనీ ఆగలేదు. ప్రభుత్వాలు కూడా మారాయి. అప్పుడు వాటన్నింటినీ దాటవేసి, ఇప్పుడు ట్రూఅప్‌ల పేరుతో భారాలు వేయడం సరికాదు. అంతర్గత సామర్థ్యం ఎక్కడ పెంచుకుంటున్నారు? ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు లేవు. రూ.35 వేల కోట్లతో పంపిణీ వ్యవస్థల్ని ఆధునీకరిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు ఫెయిల్ అవుతున్నాయి? అదనపు విద్యుదుత్పత్తి చేస్తున్నామని చెప్తున్నారు. డిస్కంలు యూనిట్ కరెంటును రూ.4.85 పైసలకు కొంటున్నాయి. అదనపు విద్యుత్‌ను యూనిట్ రూ.3.20 పైసలకి అమ్ముతున్నారు. ఇదేం సమతుల్యం? కేంద్ర తెచ్చిన విద్యుత్ సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. ప్రీపెయిడ్ మీటర్ల భారం వినియోగదారులపై వేయొద్దు.



వృత్తిదారుల్ని వేధించొద్దు
పైళ్ల ఆశయ్య, రాష్ట్రప్రధాన కార్యదర్శి, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం

రజక, క్షౌర వృత్తిదారులను క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది వేధించొద్దు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కేటగిరి-బీలో అమలు చేస్తున్నది. ప్రభుత్వం నుంచి డిస్కంలకు డబ్బులు రాకుంటే, లబ్దిదారుల కనెక్షన్లు తొలగిస్తున్నారు. సేవారంగంలో జీవనాధారమైన వృత్తికి ఆటంకాలు కలిగిస్తున్నారు. మేనేజింగ్‌డైరెక్టర్ స్థాయిలో కనెక్షన్లు కట్ చేయొద్దని ఆదేశాలు ఉన్నా, క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవట్లేదు. ఉచిత మీటర్‌తో పాటు ఇవ్వాల్సిన సర్వీస్ వైరు, ఎర్త్ వైరు ఇతర పరికరాలను ఇవ్వట్లేదు. కేవలం మీటర్ మాత్రమే ఇస్తున్నారు. అలాగే లాండ్రీ షాపులకు ఇబ్బడి ముబ్బడిగా వస్తున్న కరెంటు బిల్లులుపైన ఏసీడీ చార్జీలు, యూజర్ చార్జీలు, సర్ చార్జీల పేరుతో బిల్లులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. అనేక జిల్లాల్లో ఎర్త్ వైర్లు పెట్టకపోవడంతో వృత్తిదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్త కనెక్షన్లకు క్రింది స్థాయి అధికారులు సహకరించాలి. రైతులకు ఇస్తున్నట్టు రజకవత్తిదారులకు ప్రత్యేక బీమా సౌకర్యాలు కల్పించాలి.

అంతకుముందు సమావేశంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఏఆర్ఆర్, ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనల్ని వివరించారు. బహిరంగ విచారణలో పలు పారిశ్రామిక సంఘాలు, వాటర్‌బోర్డు ప్రతినిధులతో పాటు స్వామి జగన్మయానంద, ఎమ్ శ్రీధర్‌రెడ్డి, సీహెచ్ నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) సహా 37 మంది అబ్జెక్టర్స్ పాల్గొని, వారి వాదనలు వినిపించారు. ఇంధనశాఖ డిప్యూటీ సెక్రటరీ శారదాబాయి ప్రభుత్వ ప్రకటన చదివి వినిపించారు. డిస్కంలకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందిస్తామని చెప్పారు.

భారీ భద్రత

టీఎస్ఈఆర్సీ బహిరంగ విచారణ సందర్భంగా టీఎస్‌జెన్‌కో ఆడిటోరియం ప్రాంగణం పోలీసులతో నిండిపోయింది. ఇక్కడ కేవలం 37 మంది మాత్రమే తమ అభ్యంతరాలను వ్యక్తం చేసేందుకు అనుమతి తీసుకున్నారు. అయినా పోలీసులు భారీగా మోహరించడం గమనార్హం.

డాక్టర్ ప్రీతి కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ ప్రీతిని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు పలు అంశాలను తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. చాలా కాలంగా డాక్టర్ ప్రీతిని సీనియర్లు వేధిస్తున్నట్టు హెచ్‌ఓడీకి ఫిర్యాదు చేసినా స్పందించలేదని పేర్కొన్నారు. వారి నిర్లక్ష్యం ఫలితంగానే ఈ ఘటన జరిగిందని తెలిపారు. ర్యాగింగ్ నిరోధక చట్టం ఉన్నప్పటికీ దాన్ని అమలు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ నిరోధక చర్యలు చేపట్టక పోవడమేంటని ప్రశ్నించారు.ఇప్పటికైనా పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రీతికి మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆశాలత, సహాయ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ర్యాగింగ్‌కు పాల్పడిన నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ (కేఎంసీ)లో పీజీ వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని ప్రీతిపై సీనియర్ విద్యార్థి ర్యాగింగ్‌తోపాటు లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ర్యాగింగ్, లైంగిక వేధింపులను భరించలేకనే ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వహించే సమయంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. సీనియర్ విద్యార్థి మానసిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌కు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కులవివక్షకు నిదర్శనమే ప్రీతి ఆత్మహత్య ఘటన : కేఎన్‌వీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మెడికల్ కాలేజీల్లో పేట్రేగిపోతున్న కులవివక్షకు నిదర్శనమే ధరావత్ ప్రీతి ఆత్మహత్య ఘటన అని కుల నిర్మూలన వేదిక (కేఎన్‌వీ) రాష్ట్ర అధ్యక్షులు పాపని నాగరాజు, ప్రధాన కార్యదర్శి కోట ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీల్లో ర్యాగింగ్ పేరుతో అమలవుతున్న కులవివక్షను కట్టడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ర్యాగింగ్, కులవివక్షపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో కులవివక్షను రూపుమాపేందుకు రోహిత్ చట్టాన్ని తేవాలని కోరారు.

వీధికుక్కల నుంచి ప్రజలను కాపాడండి : బీహెచ్ఎస్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో వీధికుక్కల నుంచి ప్రజలు, చిన్నారులు, మహిళలను కాపాడాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వాటి బెడదను నివారించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి ఇ రఘునందన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీధికుక్కలకు స్టెరిలైజేషన్ చర్యల ద్వారా వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీల్లో వాటి కోసం నీటి నిల్వ సదుపాయం (వాటర్ పాయింట్లను) ఏర్పాటు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు ఇంజెక్షన్లు ఇచ్చి వదిలేయడం కాకుండా శాశ్వత నివారణ మార్గాలను చేపట్టాలని కోరారు.

ఆర్ఆర్ఆర్‌కి మరో అరుదైన గౌరవం



రామ్‌చరణ్, ఎన్టీఆర్

'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు' పాట ఆస్కార్ బరిలో అమీతుమీ తేల్చుకోనున్న సందర్భంలో ఈ సినిమా మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. అంతర్జాతీయంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 'ది క్రిటిక్స్ ఛాయిస్ సూపర్ అవార్డ్స్'లో ఈ సినిమా బెస్ట్ యాక్షన్ సినిమాగానే కాకుండా ఇందులో నటించిన కథానాయకులు ఎన్టీఆర్, రామ్‌చరణ్ బెస్ట్ యాక్టర్స్ ఇన్ యాక్షన్ మూవీ విభాగంలో నామినేషన్లకు అర్హత సాధించారు.


ది క్రిటిక్స్ ఛాయిస్ అసోసియేషన్ రెండేళ్లుగా 'ది క్రిటిక్స్ ఛాయిస్ సూపర్ అవార్డ్స్' పేరుతో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలను అందిస్తోంది. క్రిటిక్స్ ఛాయిస్ అవార్డ్స్ మూడో ఎడిషన్‌లో భాగంగా 'ఆర్ఆర్ఆర్' సినిమాకి బెస్ట్ యాక్షన్ మూవీ, బెస్ట్ యాక్టర్స్ ఇన్ యాక్షన్ మూవీ కేటగిరీలో రామ్ చరణ్, ఎన్టీఆర్ నామినేషన్లు అందుకున్నారు. మార్చి 16న విజేతల వివరాలను ప్రకటించనున్నారు. ఈ అవార్డుల బరిలో 'ఆర్ఆర్ఆర్' సినిమా 'బుల్లెట్ ట్రైన్', 'టాప్‌గన్ : మవరిక్', 'ది అన్‌బేరబుల్ వెయిట్ ఆఫ్ మాసీవ్ టాలెంట్', 'ది ఉమెన్ కింగ్' వంటి తదితర చిత్రాలతో పోటీ పడుతుండగా, ఎన్టీఆర్, రామ్‌చరణ్ సైతం బెస్ట్ యాక్టర్స్ ఇన్ యాక్షన్ మూవీ విభాగంలో నికోలస్ కేజ్, టామ్ క్రూజ్, బ్రాడ్‌పిట్ వంటి హాలీవుడ్ స్టార్‌తో అమీతుమీ తేల్చుకోనుండటం విశేషం. ఇదిలా ఉంటే, ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ వేడుక దగ్గర పడుతున్న నేపథ్యంలో 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందం ఓవర్‌సీస్‌లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా రామ్‌చరణ్ 'గుడ్ మార్నింగ్ అమెరికా' కార్యక్రమంలో పాల్గొని తెలుగు సినిమా ఘనత అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశం కావడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

కస్టడీ రిలీజ్ డేట్ లాక్

నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం 'కస్టడీ'. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శుక్రవారంతో పూర్తయ్యింది. ఈ సందర్భంగా ర్యాప్ అప్ వీడియోని మేకర్స్ అభిమానులతో షేర్ చేసుకున్నారు.


ఈ వీడియోలో దర్శకుడు వెంకట్ ప్రభు కట్ చెప్పి.. 'చైతు మా కస్టడీ నుంచి ఇక నీకు విడుదల' అని చెప్పగా, 'మీ అందరినీ మే 12న కస్టడీలోకి తీసుకుంటాం. థియేటర్‌లో కలుద్దాం' అని నాయకానాయికలు నాగచైతన్య, కృతి శెట్టి చెప్పడం అందర్నీ ఆకట్టుకుంటోంది.

అరవింద్ స్వామి విలన్ పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్న ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, సంగీతం: ఇళయరాజా, యువన్ శంకర్ రాజా, సినిమాటోగ్రాఫర్: ఎస్ఆర్ కతీర్, ఎడిటర్: వెంకట్ రాజన్, డైలాగ్స్: అబ్బూరి రవి, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, యాక్షన్: మహేష్ మాథ్యూ ఆర్ట్ డైరెక్టర్: డివై సత్యనారాయణ.



నాగ చైతన్య

మారుతి నగర్ సుబ్రహ్మణ్యం



రావు రమేష్

విలక్షణ నటుడు రావు రమేష్ తొలిసారి నాయకుడిగా ప్రేక్షకుల ముందు రావడానికి రెడీ అవుతున్నారు. ఆయన టైటిల్ పాత్రలో పీబీఆర్ సినిమాస్ సంస్థ ప్రొడక్షన్ నెం.2గా రూపొందిస్తున్న సినిమా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'. ఇందులో నటి ఇంద్రజ కీలక పాత్రధారి. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్ష్మణ్ కార్య ఈ చిత్రానికి దర్శకుడు. శుక్రవారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు.

దర్శకుడు లక్ష్మణ్ కార్య మాట్లాడుతూ, 'వినోదాత్మక కుటుంబ కథా చిత్రమిది. రావు రమేష్ లీడ్ రోల్‌కి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం మా ఫస్ట్ సక్సెస్. నడి వయసులో ఉన్న ఒక మధ్య తరగతి నిరుద్యోగి జీవితంలో క్షణ క్షణం జరిగే ట్విస్టులతో రెండు గంటల పాటు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని తెలిపారు.

నవచిత్రం

భిన్న కథతో అంతిమ తీర్పు



డి.రాజేశ్వరరావు, సాయి ధన్సిక, ఏ.అభిరాం

శ్రీ సిద్ధి వినాయక మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి ధన్సిక, అమిత్ తివారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అంతిమ తీర్పు'. ఈ చిత్రానికి ఏ.అభిరాం దర్శకత్వం వహిస్తున్నారు. డి.రాజేశ్వరరావు నిర్మిస్తున్న ఈ చిత్ర టైటిల్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా అమిత్ తివారి మాట్లాడుతూ, 'ప్రొడ్యూసర్‌కి సినిమా అంటే ఒక మంచి ప్యాషన్ ఉంది. ఇలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి ఎంతో అవసరం. షూటింగ్ మంచి ఆరోగ్యకర వాతావరణంలో జరిగింది. ఇది రెగ్యులర్‌గా ఉండే సినిమా కాదు. ఆద్యంతం ప్రేక్షకుల్ని సీట్‌లో కూర్చోబెట్టే సినిమా' అని అన్నారు. 'ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ మంచి క్యారెక్టర్స్ చేశారు. ఓ మంచి భిన్న కథతో మీ ముందుకు వస్తున్నాం' అని నాయిక సాయి ధన్సిక అన్నారు.

డైరెక్టర్ అభిరాం మాట్లాడుతూ, 'సీనియర్ దర్శకులు ముత్యాల సుబ్బయ్య గారి చాలా సినిమాలకు నేను పని చేసాను. విలేజ్ బ్యాక్‌గ్రాప్‌లో జరిగే ఈ సినిమాలో సాయి ధన్సిక అద్భుతంగా చేసింది. కోటి మంచి ట్యూన్స్ ఇచ్చారు. నిర్మాత మంచి సపోర్ట్ చేశారు. సినిమా చాలా బాగా వచ్చింది. త్వరలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. విమల రామన్, దీపు, సత్య ప్రకాష్, గణేష్ వెంకట్ రామన్, చిత్రం శ్రీను, నాగ మహేష్, కోటేష్ మానవ్, మహేంద్రనాథ్, ఫణి, వెంకట్, ల్యాబ్ షార్త్, శరత్ కళ్యాణ్, భవ్య, శీమణి, శిరీష, మురళి బొబ్బిలి, సునీత మనోహర్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి డి.ఓ.పి : ఎస్.సుధాకర్ రెడ్డి, ఎడిటర్: గ్యారీ బిహెచ్, పోరాటాలు : డ్రాగన్ ప్రకాష్-దేవరాజ్ నృత్యం : ఈశ్వర్ పి., ఆర్ట్ : వెంకట్.

సందేశాత్మకంగా.. అవసరానికో అబద్ధం



త్రిగున్, రుబాల్ షేక్ రావత్

మనిషి జీవితంలో నిజానికి ఎంత ఇంపార్టెన్స్ ఉందో అబద్ధానికి కూడా అంతే ప్రాధాన్యత ఉందని చెప్పే సందేశాత్మక చిత్రమే 'అవసరానికో అబద్ధం'.

ఝాన్సీ, కృష్ణమూర్తి యలమంచిలి సమర్పణలో గ్లోబల్ ఎంపవర్ బ్రాడ్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై డాక్టర్ శివకుమార్ చికిన సహకారంతో ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

త్రిగున్, రుబాల్ షేక్ రావత్ జంటగా ఆయాన్ బొమ్మాళిని దర్శకుడిగా పరిచయం చేస్తూ డాక్టర్ జై యలమంచిలి నిర్మిస్తున్న ఈ నూతన చిత్ర పూజా కార్యక్రమాలు శుక్రవారం రామానాయుడు స్టూడియోలో వైభవంగా ప్రారంభమయ్యాయి.

హీరో,హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత దిల్ రాజు క్లాప్ కొట్టగా, తెలుగు నిర్మాతల మండలి అధ్యక్షుడు దామోదర ప్రసాద్ కెమెరా స్విచాన్ చేశారు. నిర్మాత సురేష్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ సందర్భంగా దర్శకుడు ఆయాన్ బొమ్మాళి మాట్లాడుతూ,'మహాభారతంలో శ్రీ కృష్ణుడు కొన్ని సందర్భాల్లో అబద్ధం ఆడవచ్చు అని చెప్పాడు. దానిని ఆదర్శంగా తీసుకుని కమర్షియల్ వేలో సినిమాటిక్‌గా సినిమా తీస్తే ఎలా ఉంటుందనే ఐడియాతో చేసిన కథ ఇది. ధర్మం కాపాడాలి అంటే ధర్మరాజుతోనే అబద్ధం ఆడించాలనే స్ట్రాంగ్ క్యారెక్టర్ హీరోది. మణిశర్మ మా సినిమాకు మ్యూజిక్ చేయడం చాలా సంతోషంగా ఉంది' అని తెలిపారు. 'ధర్మాన్ని గెలిపించాలి అనే ఉద్దేశంతో మేము చేస్తున్న మంచి ప్రయత్నమే ఈ సినిమా' అని నిర్మాతలు కృష్ణమూర్తి యలమంచిలి, డాక్టర్ జై యలమంచిలి అన్నారు.

కెరీర్‌లో మరో మైలురాయి తారకాసురుడు

- సంగీత దర్శకుడిగానూ ప్రయోగాలు చేస్తా..



వరంగల్ శ్రీనివాస్

మళ్లీ మళ్లీ వినేలా తన పాటలతో, గాత్రంతో సంగీత ప్రియులను అలరించిన గీత రచయిత, గాయకుడు, నటుడు వరంగల్ శ్రీనివాస్. ఆయన 'తారకాసురుడు' చిత్రంతో సంగీత దర్శకుడిగా ప్రస్థానం మొదలు పెడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, "మాది వరంగల్ జిల్లా తక్కెళ్ల పాడు గ్రామం. పల్లె జానపదాల బాణీలతో ప్రస్తుత సమస్యలపై సొంతంగా పాటలు రాశాను. అలా 93 అణగారిన జాతులపై పాటలు రాశాను. కమ్యూనిస్ట్, మావోయిస్ట్, సోషలిస్ట్... ప్రజా కళలను ఆకలింపు చేసుకున్నాను. తెలుగులో మాత్రమే కాదు బెంగాలీ, అస్సామీ, ఒరియా, లంబాడీ, కోయ, గోండు.. ఇలా పలు భాషల్లో కూడా ఎన్నో పాటలు రాశాను. వాటిని సొంతంగా పాడాను కూడా. దర్శకరత్న దాసరి నా ప్రతిభను గుర్తించి సినీ రచయితగా తొలి అవకాశం ఇచ్చారు. దర్శకుడు వి.సముద్ర కూడా దాసరి శిష్యుడే. తాజాగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'తారకాసురుడు' చిత్రంతో నన్ను సంగీత దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఈ సినిమాతో సంగీత దర్శకుడిగా నా ప్రస్థానం ఆరంభం కావడానికి అమ్మ ఒడిలో నేర్చుకున్న పాటే అని గర్వంగా చెప్పగలను. వచ్చే జనరేషన్ వాళ్లకు కూడా నచ్చేలా నా బాణీలు ఉంటాయి. గతంలో నేను చేసిన ఉద్యమ పాటలు, నేను పాటలు ఇచ్చిన రాజకీయ నాయకులు ఎన్నికల్లో విజయం సాధించడంతో వారికి నా పాటలపై మంచి సెంటిమెంట్ ఉంది. ఇప్పుడు సంగీత దర్శకునిగా కూడా 'తారకా సురుడు' చిత్రం కోసం పాటలకు ప్రయోగాలు చేశాను. ఈ సినిమాలోని పాటలు కచ్చితంగా హిట్ అవుతాయి. సంగీత దర్శకుడిగా పరిచయం చేస్తున్న దర్శకుడు సముద్రకి కృతజ్ఞతలు' అని చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886